# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగస్టు 2023

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 16 సంచిక: 8

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
డా|| పులిగడ్డ విజయలక్ష్మి
ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం
డి.టి.పి: సాయినాథ్
డిజైన్: రమేష్

Email: srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
Website: www.srivenkatesham.org
E-Magazine: www.readwhere.com
Phone: 040–27175050
Cell: 9348212354


లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భగవన్నామం – విశిష్టత | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| శుభప్రదమాసం – శ్రావణమాసం | 19 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| రామాయణ రత్నాకరం | 28 |
| తిరుచానూరు శ్రీకృష్ణస్వామి దేవాలయం | 33 |
| జ్ఞానానందమయుడు హయగ్రీవుడు | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 39 |
| తిరుమల సర్వస్వం | 44 |
| వరలక్ష్మీ వైభవము | 47 |
| ముకుందమాల | 49 |
| మహా మాయ | 54 |
| నాగ పంచమి | 56 |
| అమృత కలశం | 58 |
| శ్రీమాన్ అనంతాళ్వార్ల దివ్య చరితము | 59 |
| క్షమాగుణం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


సంపాదకీయం..

# వెనుతిరిగి ఆలోచించు

ప్రతి మనిషికి ఒక జీవితం ఉంటుంది. బాల్యం, కౌమారం, యవ్వనం, నడివయస్సు చివరికి ముసలితనం ఒకటి తరువాత ఒకటి మనం కోరకున్నా వచ్చేస్తాయి. ఈ భూమి మీదికి వచ్చిన తరువాత మనిషి సాధించాల్సింది ఏమిటి? మన కర్తవ్యం గురించి ఆలోచించుకోవాలి. జరిగేది జరుగక మానదు. ఏం జరిగినా దాని కనుగుణంగ ప్రవర్తిస్తా, అందుతే సాధిస్తా, అందక పోతే ఊరుకుంటా అనే వారు ఉత్తమస్థాయి వ్యక్తులు కారు. పరిస్థితులను మనకు అనుకూలంగ మార్చుకొనుటకు ప్రయత్నించువారు ఉత్తములు. భగవంతునికి భక్తులు ఎంతోమంది కాని భక్తునికి భగవంతుడు ఒక్కడే అని గుర్తుంచుకోవాలి. భక్తులలో అగ్రగణ్యుడుగ ఉండుటకు ప్రయత్నించిన వాడే ఉత్తముడు. ప్రతి మనిషి తన జీవితంలో ప్రతి సం||ము ఒక్కసారైన వెనువిరిగి వారి గత జీవితాన్ని, వారు చేసిన పనులను, వాటి ఫలితాలను చూచి తర్కించుకొనుట ఉత్తమ విధానం. ఇది మన జీవన విధానమును మార్చుకొనుటకు ఎంతో సహకరిస్థుంది. నేను నా గత జీవితంలో అటు భగవంతునికి ఇటు తోటి మానవులకు ఏమైనా సహాయ పడ్డానా? లెక కేవలము నా కుటుంబం వరకే మంచి చేసుకున్నానా? నావల్ల అపకారములేమైనా జరిగాయా? అనే తర్కం ఎంతో మంచిది. అది మనలను సన్మార్గములో పయణించునట్లు చేస్తుంది. భగవంతుడు ప్రతివ్యక్తికి మంచి హృదయాన్ని ప్రసాదిస్తాడు. కాని కామమోహాలకు అలవాటు పడి చెడ్డవారిగ తయ్యారైతున్నాము. ఇదే మన జీవితాలను నాశనము చేస్తుంది. మన జీవిత విలువను దిగజారుస్థుంది. ఉత్తమ మానవులుగ ఎదగలేక పోవుటకు కారణమైతుంది. కాబట్టి కనీసం సం||నకు ఒకసారి మన గురించి మనము తర్కించుకోవాలి. మంచి చెడ్డలు తెలుసుకోవాలి. మనము లోకంలోని పోకడలకు అనుగుణంగ కాక, ఇతరులు ఏమనుకుంటారో అనే విషయాని వదిలి, మన మనస్సాక్షికి అనుగుణంగ మాత్రమే నడుచుకోవాలి.

వారివారి మనసాక్షి ప్రకారం నడుచుకునే ప్రతి వ్యక్తీ గొప్పవారు కాగలరు. భగవంతుడు మెచ్చే విధంగ జీవనం సాగించగలరు. ప్రతి వ్యక్తీ అత్యాసకు పోకుండ అవసరము మెర సంపాదించి జీవించుట ఉత్తమము. తృప్తి కలిగి ఉండుట ప్రథమశ్రేణి లక్షణము. ప్రతి వ్యక్తి తాను ఇతర వ్యక్తులకు ఇష్టమైనవాడనని అనిపించుకొనుట కంటే భగవంతునికి ఇష్టమైన వాడుగ జీవించుట ఉత్తమము. భగవంతుని కృపను పొందుటనే ప్రధాన లక్ష్యంగ జీవించాలి. ఈరకమైన జీవితమును నడుపు వ్యక్తిని భగవంతుడు తప్పక ఆదరించగలడు. స్వామి కృపకు పాత్రుడు కాగలడు. భగవంతుడు సర్వాంతర్యామి కనుక మనము చేసే ప్రతి పనిని గమనించుచుండును. ఏ వ్యక్తీ తన జీవితంలో కేవలం భగవంతుని కృపను పొందగోరి జీవిస్థుండునో ఆ వ్యక్తి ధన్యుడుగ, శ్రీవేంకటేశ్వరునికి ప్రియుడుగ ఉండగలడు.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః |
సదా వేంకటేశం స్మరామి స్మరామి||

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

# చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,006-00 |
| ☐ రాజపోషకులు | 50,006-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________

____________________

చిరునామా:____________________

____________________

____________________

____________________


____________________

పిన్‌కోడ్:____________________

చందా వివరాలు:____________________


మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com


**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో॥ మాత సమస్త జగతాం మధుకైటభారేః**
**వక్షోవిహారిణి! మనోహర దివ్యమూర్తే**
**శ్రీస్వామిని! శ్రితజన ప్రియదాన శీలే**
**శ్రీ వేంకటేశ దయితే! తవ సుప్రభాతం ॥ 3 ॥**

తాత్పర్యం – ప్రజలందరికి తల్లివై విష్ణువు వక్షఃస్థలమున దివ్యమైన రూపముతో ఉండుదానా! మా స్వామినివి. శ్రీ వేంకటేశుని భార్యవు. నీకు శుభోదయ మగు గాక! నీవు నిద్ర చాలించి మేల్కొనుము.

విశే॥ ఈ శ్లోకము నుండి వేంకటేశ సుప్రభాత స్తోత్రము ప్రారంభమగుచున్నది. విష్ణుపురాణము లక్ష్మిని సర్వలోకములకు తల్లిగా వర్ణించింది. (1-9-126) తండ్రికి ముందు జగన్మాతను మేలుకొలుపుచున్నాడు. శ్రీమన్నారాయణుడు అనిరుద్ధుడుగా అవతరించి, మధుకైటభులను రాక్షసులను సంహరించినాడని పురాణములు తెలుపుచున్నవి. పాల సముద్రము నుండి ఉద్భవించిన శ్రీదేవి విష్ణుదేవుని వరించగా స్వామి ఆమెను తన వక్షఃస్థలమున నివసింపజేసినాడు. విష్ణుదేవుడు శ్రీనివాసుడయినాడు లక్ష్మీదేవి విష్ణుదేవుని వక్షోవిహారిణి అయింది శ్రీదేవి మనోహరమైన, దివ్యమైన రూపము గల్గియుంది. ఆమె స్వభావము శరణు పొందిన జనులకు ఇష్టమైన ఫలములిచ్చునట్టిది. నారాయణుడు స్వామి. శ్రీదేవి స్వామిని. వేంకటము అను పేరుగల పర్వతమునకు అధిపతియగు విష్ణుదేవుడు వేంకటేశుడు అయినాడు. స్వామి నివసించే పర్వతమునకు భగవంతునికి అభేదము ఏర్పడింది. శ్రీ వేంకటేశ అష్టోత్తర శతనామ స్తోత్రములో వేంకటేశాయ నమః (1), వేంకటాయ నమః (22) అను నామములు గలవు.

**వేంకారో ఒమృత బీజస్తు కట మైశ్వర్యముచ్యతే ।**
**అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రిరితి స్మృతః ॥ - వరాహ, 37-31 శ్లో ॥**

– వేంకారము అమృతబీజము. కట మనగా ఐశ్వర్యము. అమృతము (జన్మ రాహిత్యము)ను, ఐశ్వర్యమును ప్రసాదించునది యగుటచే వేంకటమను పేరు ఈ పర్వతమునకు సార్ధకమగు పేరుగా ఉంది.

**వ్యాఖ్యానం:** డా॥ సముద్రాల లక్ష్మణయ్య



# ముక్తిమార్గము



## సామంతం (జంపె)

గరుడధ్వజా! యేమని చెప్పెడిది నీ ప్రభావంబు నీ నాభికమలంబున
బుట్టెనట విరించి
నీ మహిమ దెలియ శక్తుండుగాఁడట
నానా వేదంబులు నీ మహిమలు చెప్పెడివట
నీ మూర్తి కడ గురుతు గానవట
రవిచంద్రులు నీ నయనంబులట
నీ యపార తేజోమహిమంబులెఱుంగవట
ఇంద్రాది దేవతలు నీయాజ్ఞాధారులట
వొక్కొక్క మరిని తొంగినిసి నిన్నెదిరించలేక మఱియును నీశరణు
వేఁడుకొందురట
పంచమహాభూతంబులు నీ ప్రకృతిగుణంబులట
నీ స్వభావం బిట్టిదియని తెలుపఁజాలవట
సముద్రంబులు నీ పానుపట
నీ గుణంబుల లోతెఱుంగవట
మునులు భవదీయస్వరూపసూచకవాదులట
మీమాయ దాఁటనోపరట
చరాచరజగత్తు మీ సృష్టియట
మిమ్ముఁజూపిచెప్పనోపవట
నా శక్తియెంత నేనెంత నేను నీ పాదంబులు గతియని వుండంగ నీవే
దయదలంచి రక్షించెదవు శ్రీవేంకటేశ్వరా!
వైరాగ్యవచనమాలికా గీతాలు సమాప్తము

గరుడధ్వజా! నీ ప్రభావాన్ని ఏమని చెప్పగలను. బ్రహ్మ నీ నాభిపద్మంలో పుట్టాడట. అయినా నీ మహిమను తెలిసికోలేదట. వేదాలన్నీ నీ మహిమలను వ్యక్తం చేస్తాయట. కాని అవి నీ అంతును కనుక్కోలేవట. సూర్యచంద్రులు నీ కన్నులట. కాని అవి నీ అనంతమైన తేజోమహిమను ఎరుగవట. ఇంద్రుడు మొదలగు దేవతలు నీ ఆజ్ఞప్రాకారం నడుచుకుంటారట. ఒక్కొక్కమారు వారు నీ ముందు వంగి, వాలి, నిన్ను ఎదిరించలేక నీవే దిక్కని వేడుకుంటారట. పంచభూతాలు నీ ప్రకృతి గుణాలట. అయినా అవి నీ స్వధర్మం (నీ లక్షణం) ఇటువంటిదని తెలుపజాలవట. ఎంతో లోతున్న సముద్రాలు నీ పానుపు అట – అయినా అవి నీ గుణాల లోతును కనుక్కోలేవట. మునులు (జ్ఞానులు) నీ స్వరూపాన్ని తెలుపుతూ వాదిస్తారు. కాని నీ మాయను దాటలేరట. స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచం (జగత్తు) మీ సృష్టి అట. అయినా మిమ్మల్ని చూపలేవు; 'మిమ్మల్ని గూర్చి చెప్పలేవు. ఇక – నా శక్తి ఎంత? నేనెంత? స్వామీ! శ్రీవేంకటేశ్వరా! నీ చరణాలే నాకు శరణమని నమ్ముకున్నాను. నీవే నన్ను దయతో భావించి కాపాడుతావు'.

బ్రహ్మ, వేదాలు, రవిచంద్రులు, ఇంద్రాదిదేవతలు, పంచభూతాలు, సముద్రాలు, మహర్షులు, చరాచర జగత్తు ఇవన్నీ భగవంతునికి సంబంధించనవే. భగవంతునికి ఉపయోగపడుతున్నవే. వీటినన్నింటిని కల్పించిన సర్వేశ్వరుని స్వరూపస్వభావాలను గూర్చి మాత్రం సమగ్రంగా వివరించలేవు.



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



# భగవన్నామం - విశిష్టత

మందరపు వి.జి. శంకరాచారి

శ్రీహరి నామస్మరణయే మనల్ని సంసార సాగరం నుండి బయట పడవేసే అద్భుత సాధనం మనపాపాలన్నింటినీ ప్రక్షాళన చేసి ముక్తి ముంగిట నిలబెట్టేదే హరినామ స్మరణ. ఈ సత్యం తెలుసుకున్నవారు పుణ్యజీవులై పరమాత్మలో ఐక్యమై విష్ణు సాయుజ్యం పొందుతారన్నది సత్యం. ఈవిధంగా విష్ణు సాయుజ్యం చేరుకున్న వారు కోటానుకోట్ల మంది ప్రజలలో ఎవరో ఒక్కరు ఉంటారని సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానుడే గీతలో అర్జునుడికి బోధించాడు. అంతేకాదు తనకెటువంటి వాడు ఇష్టుడో ఈ శ్లోకంలో తెలియజేసినాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**ఏషా నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం**

ఏకాగ్రచిత్తంతో నిరంతరం నన్నే స్మరిస్తూ... సేవించే వాళ్ళ యోగక్షేమాలు నేనే చూస్తాను.

అంతేకాదు నిరంతరం తనని తలచుకొనక పోయినా రోజుకి మూడుసార్లు తలచుకున్నా తన నామాన్ని మనస్ఫూర్తిగా ఉచ్చరిస్తే చాలని తెలియ జేసాడు. ఇలాకూడా చేయలేక పోతివా పోనీ కనీసం రోజుకు ఒకసారైనా తలచుకుని కృతజ్ఞతలు తెలియజేసినా పాపాన్ని క్షమించేసి పుణ్యఫలన్ని అనుగ్రహిస్తానని చెప్పియున్నాడు.

అయితేమనంరోజుకుఎన్నిసార్లుభగవంతుడ్నితలచుకుంటున్నాము, ఆ హరినామన్ని ప్రేమగా ఉచ్చరిస్తున్నాము, ఈ ఉరుకులు పరుగుల జీవితంలో భగవంతుడ్ని తలచుకోవడానికిగానీ, నామాన్నీ ఉచ్చరించడానికి గానీ పరమాత్మ కథలు వినడానికి గానీ మనకు తీరిక దొరకడంలేదు ఎప్పుడూ స్వార్ధపూరిత భావాలతో జీవనం సాగిస్తూ పాపాన్ని మూటగట్టుకుంటున్నాము అయినా మనమెంత భక్తులమైనా ఉన్నతులమైనా హీనులమైనా అంత్యదశలో భగవంతుడి నామాన్ని పలకడానికి ఆ ఈశ్వరుడి అనుగ్రహం కావాలి. ఆ అనుగ్రహాన్ని పొందేందుకు మనసు నిష్కల్మషమై అనుక్షణం హరినామ స్మరణ చేయుటకు నిరంతరం అభ్యాసం చేయాలి.

హరినామం పలుకకపోతే ఎటువంటి స్థితిని పొందుతామో నిరంతరం హరినామం ఉచ్చరించడానికి ఎటువంటి ప్రయత్నం చేయవలెనో వయసులో ఉన్నప్పుడు భగవంతుడిపై దృష్టిని విడనాడి పాపపు కార్యాలను చేపడుతూ మహాపాతకములను ఆచరిస్తూ చిట్ట చివరకు పశ్చాత్తాపం చెందినా ఫలితం లేదని

చెప్పే ఈ క్రింది కథలు భగవన్నామం యొక్క విశిష్టతను తెలియజేస్తాయి.

పూర్వం ఒక గ్రామంలో భద్రయ్య అనే వైశ్యుడు నివసిస్తూ ఉండేవాడు. కిరాణా వ్యాపారం చేస్తు లక్షలకు లక్షలు గడించాడు. అయినా అతడికి ధనం మీద వ్యామోహం పోలేదు. విపరీతమైన మోసాలు చేస్తూ కూడని వ్యాపారాలతో అధికంగా ధనం సంపాదించసాగాడు. అలా కాలం వెల్లబుచ్చుతున్న భద్రయ్యకు ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు పెరిగి పెద్దయిన తర్వాత తండ్రి చేసిన వ్యాపారాలు చేస్తున్న మోసాలు వారికి నచ్చేవికావు. అందుకే వాళ్ళ తండ్రితో ఇలా అనేవారు.

"తండ్రి మీరు చేస్తున్న వ్యాపారాలు చేయుచున్న మోసములు మాకు నచ్చడంలేదు. ఈవిధంగా పదుగురిని మోసగించి సంపాదించిన సొమ్ము మనల్ని దహించివేస్తుంది. సంపాదించినది ఇకచాలు. ఇకనుండి వ్యాపార వ్యవహారాలు మెమిద్దరం చూసుకుంటాం. వృద్ధులైపోతున్న మీరు దైవచింతనలో కాలం గడిపి భగవంతుడి అనుగ్రహాన్ని పొందండి. చేసిన పాపాలు నశించి పుణ్యాత్ముడిగా మారడానికి ప్రయత్నించండి" అని ఎంత చెప్పినా భద్రయ్య వినేవాడుకాడు.

కాలగమనంలో భద్రయ్య కొడుకులిద్దరికీ పెళ్ళిళ్ళు చేసాడు. మరికొంత కాలానికి భార్య కాలం చేసింది. అప్పుడు భార్యలోటు తెలిసనా అతడి బుద్ధి మాత్రం మారలేదు. కొడుకులిద్దరూ మంచివాళ్ళు కాబట్టి తండ్రిని ఎదిరించే వారుకాదు. అలాగని తండ్రి చేయమని చెప్పిన మోసపూరిత పనులను చేసేవారు కాదు.

కొంతకాలానికి భద్రయ్య పాపం పండింది. క్యాన్సర్ వ్యాధికి గురిఅయ్యాడు. వ్యాధి నయం చేయడానికని కుమారులిద్దరూ తండ్రిని అన్ని ఆసుపత్రులకు తీసుకుని వెళ్ళారు. కానీ ఫలితం శూన్యం. మంచానపడ్డాడు భద్రయ్య. ఇంత జరిగినా భద్రయ్యలో పశ్చాత్తాపం ఇసుమంతైనా రాకపోవడం విడ్డూరం.

మంచాన పడిన భద్రయ్యను చివరిసారిగా పరీక్ష జరిపి ఇంకా కొన్ని గంటలు మాత్రమే బ్రతుకుతాడని కొడుకులతో చెప్పేశారు. అయితే మంచానపడిన భద్రయ్య అన్నం సహించక చిక్కిశల్యమైపోయాడు. అంతేగాని మాటమాత్రం గంటలా మోగుతోంది. అటువంటి స్థితిలో కూడా భగవంతుడి నామాన్ని పలుకలేదు. అయితే తండ్రితో ఎలాగైనా 'నారాయణ' అనిపించాలని ప్రయత్నం చేస్తున్నారు కుమారులిద్దరూ.

అందుకే వారు అవసాన దశలో ఉన్న తండ్రి దగ్గరకు వచ్చి తాము తీసుకుని వచ్చిన దానిని చూపిస్తు "తండ్రీ దీని పేరు ఏమిటి? మేము దీనితో వ్యాపారం చేయాలని అనుకుంటున్నాము" అంటూ జనపనారని చూపించారు.

తాము చూపించిన జనపనారని చూసి కనీసం నారాయణలో సగభాగమైన 'నార' అని యైనా తండ్రి పలుకుతాడని 'నారాయణ' నామం'లోని సగభాగాన్ని పలికినా తన తండ్రి పాపం క్షయమవుతుందని ఆ కుమారుల ఆశ.

అయితే తన కుమారులు చూపించిన దానిని చూస్తూ భద్రయ్య "నాయనలారా! ఈ పీచుతో వ్యాపారం చేయకండి. అది నష్టాలను తీసుకుని వస్తుంది" అని చెప్పి మరణించాడు.

నారాయణలో 'నార' అనే పదం పలికినా తండ్రి చేసిన పాపాలు క్షయమౌతాయని కుమారులు భావిస్తే భద్రయ్య 'జనపనార' అనకుండా పీచు అని పలకడంవల్ల అతడికి భగవంతుడి అనుగ్రహం దూరమై నరకానికి తీసుకుని వెళ్ళబడ్డాడు.

పాపాలు చేసినవాడికి ఎట్టిస్థితిలోనూ భగవంతుడి అనుగ్రహం లభించదు అన్నదానికి భద్రయ్య జీవితం ఒక ఉదాహరణ అయితే ఆలోచనతో అభ్యాసంతో దైవానికి దూరంగా ఉండకూడదన్న ధ్యాసతో 'ఈశ్వరయ్య' చేసిన ప్రయత్నం విష్ణు సాయుజ్యాన్ని పొందేటట్లు చేసిందని చెప్పడానికి అతడి జీవితకథయే ఉదాహరణ.

ఒకానొక గ్రామంలో ఈశ్వరయ్య అనే వ్యాపారి న్యాయంగా వ్యాపారం చేస్తూ ఎవరిని మోసగించకుండా వచ్చిన లాభంతో సంతృప్తి చెందుతూ ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తు ఉండేవాడు. అతడి పుణ్యవిశేషం వలన అతడి వ్యాపారం రోజు రోజుకీ వృద్ధి చెందితీరికలేకుండాచేసింది.ఈవిధంగావ్యాపారవ్యవహారాలలో మునిగిపోయి కొంతకాలం దైవచింతనకు దూరమయ్యాడు. యుక్తవయస్సు వచ్చిందని ఈశ్వరయ్యకు పెళ్ళి చేసారు అతడి తల్లిదండ్రులు. పెళ్ళయిన తర్వాత సంసార ఝంఝాటంలో పడి మరింతగా దైవనామస్మరణకు చింతనకు దూరమయి పోతున్నాడు ఈశ్వరయ్య. ఇది గమనించిన ఈశ్వరయ్య ఒక ఆలోచన చేసాడు.

తదనంతర కాలంలో అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగినారు. వారికి ఆధునిక పోకడలో వస్తున్న పేర్లను పెట్టకుండా పెద్దకుమారుడికి నారాయణ అని, రెండవవానికి వినాయకరావు అని, మూడోవాడికి శ్రీనివాస అని పేర్లు పెట్టాడు. అదేవిధంగా పెద్దకూతురుకి లక్ష్మియని, రెండవకుమార్తెకి పార్వతి అని పేర్లు పెట్టాడు.

ఈవిధంగా తన పిల్లలకు దైవసంబంధమైన పేర్లు పెట్టడంవలన తనెంతగా వ్యాపారవ్యవహారాల్లో మునిగిపోయివున్నా వారిని పేరు పెట్టి పిలవడం భగవంతుడి నామాన్ని పలుకకుండానే పలుకుతున్నట్టవుతోంది ఈశ్వరయ్యకు.

ఈవిధంగా జీవిస్తున్న ఈశ్వరయ్య కాలగమనంలో కుమార్తెలిద్దరికి పెళ్ళిళ్ళు చేసాడు. పెద్ద అల్లుడి పేరు మల్లికార్జున రావు అయితే చిన్న అల్లుడి పేరు కేశవరావు. పండుగలకి వచ్చినప్పుడు వారిని కూడా వారియొక్క పేర్లతో పిలుస్తూ ఉండడం వలన ఒకవిధంగా భగవన్నామం ఉచ్చరించినట్లు అయ్యేది.

తదనంతర కాలంలో కొడుకులు ముగ్గురికి పెళ్ళిళ్ళు చేసాడు. వచ్చిన కోడళ్ళ పేర్లు కూడా ముగ్గురమ్మల మూలపుటమ్మ నామములే. భ్రమరాంబ, శ్యామల, అన్నపూర్ణ. ఈవిధంగా ఈశ్వరయ్య ఏరి, కోరి ఎవరైతే భగవంతుడి పేర్లు కలిగియున్నారో వారినే తనకు అల్లుళ్ళుగాను, కోడళ్ళుగాను చేసుకున్నాడు. ఈ మంచిపని వలన నిరంతరమూ భగవంతుడి నామాన్ని పలికినట్లే అవుతుంది.

కాలప్రవాహంలో ఈశ్వరయ్య ముదుసలిగా మారాడు. రోగాలు చుట్టుముట్టాయి. అవసాన దశకు చేరుకున్నాడు. మృత్యుశయ్యమీదకు వెళ్ళే సమయం ఆసన్నమైంది. చివరగా కొడుకులని, కూతుళ్ళని, కోడళ్ళని, అల్లుళ్ళని వారి పేర్లతో ప్రేమగా పిలిచి చివరి శ్వాస వదిలాడు.

అనుక్షణం భగవంతుడి నామాన్ని పలుకలేనేమోనని భయంతో కుటుంబంలోని వారికందరికీ దేవునియొక్క పేర్లను పెట్టడం వలన అవసాన దశలో వాటిని పలకడంవలన ఈశ్వరయ్య విష్ణు సన్నిధికి చేరుకున్నాడు.

ఈవిధంగా ప్రయత్నపూర్వకంగా ఈశ్వరయ్య విష్ణులోకం చేరుకుంటే ధనమదంతో అహంకారం నింపుకుని తల్లిదండ్రులను చూడకుండా ఇల్లాలిని పట్టించుకోకుండా వేశ్యలచుట్టూ తిరుగుతూ సురాపానం సేవిస్తు మనుగడ సాగిస్తున్న వినోద్ చివరికి పశ్చాత్తాపం పడినా ప్రయోజనం లేదని చెప్పేదే ఈతడి కథ.

ఒకానొక పట్టణంలో అపరకుబేరుడికి ఒక్కగానొక్క కొడుకుగా జన్మించిన వినోద్ యుక్తవయసు వచ్చేసరికి సకలవిద్యలను నేర్చుకోవడమేగాక మహాపాతకాలను కూడా అలవాటు చేసుకున్నాడు. (సురాపానం చేయడం, వేశ్యలతో తిరగడం, గురువుగారి భార్యను కాంక్షించడం, తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా ఇంటినుండి వెడలగొట్టడం, ఇల్లాలని నిందించడం వీటినే మహాపాతకాలుగా చెబుతారు) తల్లిదండ్రును సరిగా చూసుకొనకపోవడం, పెళ్ళి చేసుకున్న ఇల్లాలిని నిందచేయడం అంతేకాదు ఆమె ఎదుటే మరియొక వేశ్యతో భోగించడం. సురాపానం చేయడం వంటి పనులను చేస్తూ ఒక భోగిలా జీవితాన్ని గడపసాగాడు.

వినోద్ చేస్తున్న పాపపు పనులను చూడలేక అతడితో ఉండలేక కలిసి జీవించలేక భయపడి కన్నవారింటికి వెళ్ళిపోయిందతడి భార్య. ఇక తల్లిదండ్రులను వారిబాగోగులను చూడకపోవడం వలన వారు వృద్ధాశ్రమంలోకి వెళ్ళిపోయారు. ఎవరు లేకపోవడంవలన, నిరంతరం చెడు సావాసాలతో సహవాసం చేస్తూ తన ఇంటిని ఒక వ్యసనాలకూపంగా మార్చుకున్నాడు.

కాల చక్రభ్రమణంలో అతడి ఆస్తి అంత హారతి కర్పూరంలా హరించకుపోయింది. స్నేహితులు దూరమయ్యారు. తల్లిదండ్రలు మరణించారు. తాళికట్టిన భార్య రాను పొమ్మంది. ఇప్పుడతను ఒంటరివాడయ్యాడు. కుటుంబం విలువ ఏమిటో ఇప్పుడు తెలిసింది. తను వయసులో ఉన్నప్పుడు తల్లిదండ్రులెంత పోరుపెట్టినా దైవనామస్మరణ చేయలేదు. గుడికి వెళ్ళలేదు. ఇప్పుడు వెళ్ళాలన్నా వెళ్ళలేడు. కారణం తను తిరిగిన చెడు తిరుగుల్లవల్ల కోలుకోని జబ్బు వచ్చింది. క్షణం క్షణం నీరసించి పోతున్నాడు. మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. భగవన్నామాన్ని ఉచ్చరించాలన్నా నోరు పెగలడం లేదు. కారణం నోటిలో రాచపుండు మనసులో అనుకుందామని అనుకున్నా అనుకోలేకపోతున్నాడు. ఎందుకంటే గుండె దడ తనని రక్షించువారు లేరు. వైద్యుని దగ్గరకు తీసుకుని వెళ్ళేవారు లేరు.

కాళ్ళు చచ్చుబడిపోయాయి. బయటకు వెళ్ళలేడు. ఎవరూ సహాయం చేసేవారు లేరు. ఇప్పుడు తను మరణిస్తే అనాథ ప్రేతమవుతుంది. అందుకే వినోద్ చింతిస్తున్నాడు. 'వయసులో ఉన్నప్పుడు ఎన్నో తప్పులు చేసా ఎందరు చెబుతున్నా వినలేదు. దానిఫలితముఇది.' అతడి నోటివెంట భగవన్నామం పలుకలేదు. మైలపడ్డ మనసు మలినం కడుక్కుందామని ఆశపడుతున్నా, పశ్చాత్తాపంతో జీవిత గీతను మార్చుకుందామని అనుకున్నా మార్చుకోలేని స్థితి. ఆచరణకు రాని దుస్థితి. చివరకు అనాథగా మిగిలింది వినోద్ శవం.

అందుకే కాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి అంటాడు ఇలా


**"దంతంబు ల్పడ నప్పుడే తనువు నందారుండి యున్నప్పుడే**
**కాంతా సంఘము రోయనప్పుడే జరక్రాంతంబు గానప్పుడే**
**వితతమ్మన జరించినప్పుడే కురుల్వెల్లెల్లి గానప్పుడే**
**చింతింపన్వలె నీపదాంబు జములన్ శ్రీకాళహస్తీశ్వరా!"**

శ్రీకాళహస్తీశ్వరా! మానవులు ఎవ్వరేకాని, దంతములు రాలని స్థితియందు ఉండగనే, తన శరీరము నందు బలము బాగుగ ఉండగనే, స్త్రీలకు తన విషయమున ఏవగింపు కలుగుటకు ముందే తన వెంట్రుకలు నెరసి తెలతెల్లన కాకుండగనే తన శరీరమున మెరుగులు తగ్గని సమయముననే నీ పాద పద్మములను సేవించవలెను.



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..

**5వ భాగము**



దిశ: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 5వ భాగపు లీలల ప్రచురణ. (జూన్ 2002 – ఆగష్టు 2002)

సంవత్సరం 2000 ఆగస్టు ప్రాంతమున ప్రారంభమైన నా అల్వాల్ సమస్య మార్చి 2002 వరకు కొనసాగింది. ఈ కాలములో నాలో చాలా మార్పు వచ్చింది. స్వామివారు నా నరనరాలలో జీర్ణించుకుపోయారు. ఆయనను ప్రతి క్షణం స్మరించుట అలవాటైంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్వామివారితో విడదీయరాని బంధం ఏర్పడింది. నేను స్వామి వాడిని. స్వామి నా వారు అనే అభిప్రాయం దృఢంగా కలిగింది. ఏప్రిల్ 2002 నుండి సమస్యలు లేక కొంత విరామము లభించింది. నా జీవితంలో ప్రతి విరామ సమయం, తరువాత వచ్చే లీలకు పూర్వాంగంగా ఉపయోగ పడింది. ఈ లీలలో నేను ఈ జీవితంలో తృప్తిచెందేవరకు తన సేవా భాగ్యమును ప్రసాదించారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

## శ్రీ ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించుట

నేను ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఇంటి నుండి ఆఫీసుకు వెళ్ళి, అక్కడినుండి పని దగ్గరికి వెళ్ళే క్రమములో ఉదయం 11.30 ప్రాంతమున, దారిలో ఉన్న తిరుమలగిరిలోని శ్రీఆంజనేయస్వామి వారి ఆలయమునకు వెళ్ళి ప్రార్థించేవాడిని. ఆ సమయానికి భక్తులు లేక ఆలయం ఖాళీగా ఉండేది. కావున నాకు మరింతఆనందంగాఏకాంతంగాస్వామివారిని ప్రార్థించు అవకాశం దొరికేది. గత కొన్ని రోజుల నుండి స్వామివారికి తనివి తీర సేవ చేయాలనే కోరిక కలుగుతుంది. ఈరోజు, శనివారం ఉదయం 11.30 ప్రాంతమున, తిరుమలగిరి శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయమునకు వెళ్ళాను. అత్యంత ఆర్తితో శ్రీ ఆంజనేయునకు 11 ప్రదక్షిణాలు చేశాను. ఆ ప్రదక్షిణములు చేయుచున్న సమయంలో, శ్రీ ఆంజనేయస్వామి వారికి దేవదేవుడైన ఆ శ్రీరామచంద్రస్వామి సేవచేయు భాగ్యము లభించిందని, అందువల్ల శ్రీ ఆంజనేయుడు మహా పుణ్యాత్ముడని, భాగ్యవంతుడని, అదృష్టవంతుడని మరియు ఆయన జన్మ ధన్యమైందని నా హృదయంలో మనసారా భావించాను. ఆ విధంగా తలంచుచున్నప్పుడు నా కనుల నుండి

ఆనంద బాష్పాలు పటపటా రాలాయి. మరియు నా దేహము కంపించింది. అంతేకాకుండా శ్రీరామచంద్రులవారు జీవించి ఉన్న సమయాన ఆంజనేయులవారు ఉన్నారని, అప్పుడే ఇది సాధ్యమైందని భావించాను. ప్రస్తుతం నాకు కూడా అలాంటి సేవ చేయాలనే బలమైన కోరికి ఉన్నప్పటికీ శ్రీరామచంద్రుడు లేడు, మరియు రామాయాణం పూర్తైంది కాబట్టి అలాంటి సేవ లభించనందుకు దుఃఖించాను. నిజనానికి శ్రీరామచంద్రుడు, సీతను వెదుకుటలో కాని, రావణునితో యుద్ధమునకు కాని ఆయనొక్కడే సమర్థుడైనప్పటికీ 'రామాయణం' అనే దానిని కల్పించి, శ్రీరామునికి అవసరాన్ని సృష్టించి, ఆంజనేయుడు, అంగదుడు మొదలగు వారికి స్వామివారి సేవాభాగ్యమును కల్పించారని భావించాను.

అదేవిధమైన ఏదైనా అవసరముతో నేను కూడా ఆ దేవదేవుని (శ్రీరాముని) సేవ చేయాలని, అంతటి అదృష్టము నాకు కలగాలని, అత్యంత ఆర్తితో, కళ్ళనుండి నీరు ధారలుగా రాలుచుండగా ప్రార్థించాను. ఈ ప్రార్థన చేయు సమయాన నా ఒళ్ళు కంపించింది, రోమాంచితుడనైనాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ క్షణం నేను పొందిన స్థితిని వర్ణించలేకపోవుచున్నాను. ఎలాగైనా ఈ జీవితంలో తృప్తి చెందేవరకు స్వామి సేవ చేసి తీరవలసిందే! మీరు దానిని ప్రసాదించి తీరవలసిందేనంటూ ప్రార్థించాను. ఒకవేళ మీరు ప్రసాదించకుంటే ఈ జీవితము వృథా కాగలదని దుఃఖించాను. అప్పుడు నా మనస్సులో ఈ రోజు నాకు ఏదో ఒక కల తప్పకుండా వచ్చునని, అందులో నా స్వామి సందేశము తప్పక ఉండునని నూటికి నూరుపాళ్ళ దృఢ విశ్వాసం కలిగింది.

రాత్రి నా కోరిక నెరవేర్చమని స్వామివారిని ప్రార్థించుచు పడుకున్నాను. అనుకున్నట్లే కల వచ్చింది.

**10-06-2002 కల :** ఈ కలలో తిరుమల కొండను దర్శించాను. పచ్చని చెట్లతో కూడిన కొండ, దానితో పాటు గాలి గోపురములను చూచాను. ఈ గాలి గోపురములను చూచు సమయాన ఎవ్వరో నాకు "అదే నీ భద్రాచలమని" చెప్పారు. ఈ మాటలు ఎక్కడో ఆకాశము నుండి వచ్చుచున్నట్లు అనిపించింది. ఆ గాలి గోపురములు ముదురు గోధుమ రంగులో ఉన్నవి. వాటిపైన దేవతల విగ్రహములు చెక్కబడినవి. అవి తిరుమల ఆలయ గోపురాలలాగా టీవీలో చూపించే మాదిరిగానే ఉన్నాయి. "ఇందులో నివసించువారే నీ ప్రభువు. నీవు వీరికే సేవ చేయవలసి ఉందనే" ఒక హృదయాంతరంగ భావం కూడా కలిగింది. ఈ కలలో ఇది మొదటి సన్నివేశం.

రెండవ సన్నివేశంలో ఒక గుడి లోనికి వెళ్ళాను. కొంచెం ఇరుకుగా చీకటిగా ఉంది. అందులో బుద్ధుని స్థూపమును చూచాను. ఇది నేపాల్ లోని బౌద్ధ స్థూపము మాదిరిగా కలదు. తిరిగి ఆ గుడిలో వేరే స్థలమునకు వెళ్ళాను. అక్కడ చందనముతో ఉన్న శ్రీ ఆంజనేయుణ్ణి చూచాను. ఆంజనేయునికి అక్కడున్న పూజారితో పూజ చేయించాను. "ఓం ఆంజనేయాయ నమః, రామభక్తాయ నమః" అను మంత్రమును కలలోనే పఠించాను. తిరిగి బయటకు వచ్చేసరికి నా చెప్పులు ఎవ్వరో ఎత్తుకుపోయారు. అప్పుడు నా శని వదిలిందని కలలోనే అనుకున్నాను. ఇది కల, కాని ఆ సమయాన నాకు ఎలాంటి సేవ లేనందున, ఇది ఎందుకు కల్పించారో, దీని మర్మమేమిటో తెలియలేదు. స్వామిని, స్వామి లీలలను చూడాలనే నా ఆత్రుతను తగ్గించుటకే దీనిని చూపాడని భావించాను.

ఈ కలను నా విజ్ఞతను ఉపయోగించి విశ్లేషించుకున్నాను. శ్రీ ఆంజనేయుడు, శ్రీరాముణ్ణి ఏవిధంగా తన స్వామిగా భావించి ఎంతటి కష్టతరమైన సేవ అయినప్పటికీ, స్వామి స్మరణతో, స్వామి శక్తితో చేశాడో నేను కూడా తిరుమల శ్రీవేంటేశ్వరుని నా స్వామిగా భావించి, ఎంతటి కష్టతరమైన సేవ అయినప్పటికీ వెరవక స్వామిని ప్రార్థిస్తూ, ఆయన శక్తిచే సాధించమని ఆజ్ఞాపించాడని భావించాను. నేను జీవితంలో తృప్తి చెందేవరకు స్వామి సేవ లభించునని స్వామి ఇచ్చిన మాట నన్ను ఎంతో సంతోషపిరిచింది.

స్వామివారిని విడిచి ఉండలేని స్థితి కలిగింది. ప్రతిక్షణం నా స్వామివారిని సంతోష పెట్టుటే నా లక్ష్యంగా భావించుకున్నాను. దీనికై రకరకాల ప్రయత్నాలు చేసేవాడిని. అందులో ముఖ్యమైనది అందరిలో అణిగిమణిగి ఉంటూ నేనే అధమ స్థాయి వ్యక్తిననే భావము అలవాటు చేసుకున్నాను. నా సంతోషాన్ని ప్రక్కనపెట్టి సదా స్వామివారిని ఆనందింప చేయుటే నా కర్తవ్యంగా పెట్టుకున్నాను. ఈ స్థితి ఎంతగా చేరిందంటే ఎప్పుడైన నేను సినిమా చూస్తున్నప్పుడు మానసికంగా నేను నాయికగా మారిపోయేవాడిని. నా ప్రభువును నాయకుడుగా భావించి ఆయనను తృప్తి పరచుటకు నాయికలాగా మానసికంగా నాట్యమాడేవాడిని. శ్రీవేంకటేశ్వరుడు తృప్తి చెందుచున్నాడని భావించి నేను సంతోషించేవాణ్ణి. ఈ స్థితి అప్పటి నుండి నేటివరకు కొనసాగుచున్నది. ఏ విధంగానైనా శ్రీవేంకటేశ్వరునికి సంతోషం కలిగించుటే నా కర్తవ్యంగా ఎంచుకున్నాను.

కీ.శే. గవర్రాజు గారితో బంధం బలపడింది. ఆయనతో ఎన్నో విషయాలు చర్చించాను. గతంలో నేను మానసికంగా ఒక వస్తువుగా మారిపోయి స్వామివారి హుండీలో సమర్పించబడ్డానని, మరియు నాకు ఈ లోకంలో ప్రతి ఒక్కరు శ్రీవారి మూడు నామాలు పెట్టుకున్నట్లు కనిపించేదని, ఇవి దేనికి

సంకేతమని అడిగాను. దీనికి సమాధానంగా వారు ఇవి చాలా అత్యంత ఉన్నత స్థాయి క్రియలన్నారు. శ్రీవైష్ణవంలో శరణాగతికి ప్రథమస్థానం ఇస్తారన్నారు. మరియు చూచినవారందరూ మూడు నామాలతో కనబడుట అన్నది ఉత్తమస్థాయి లక్షణమన్నారు. గవర్రాజు గారు గత అయిదారు సంవత్సరాల నుండి ఐశ్వర్య మహామంత్రమును భక్తులచే వ్రాయించారు. దీనిని తిరుపతిలో తగిన సమయములో నిక్షిప్తము చేయుదుమని చాలా సంవత్సరాల నుండి చెప్పుచు వ్రాయిస్తూ ఉన్నారు. ఐశ్వర్య మహామంత్రములో 8 శ్రీలు ఉన్నవి కాబట్టి వ్రాసినవారికి అష్టైశ్వర్యాలు సిద్ధించునని చెప్పినప్పటికీ, ధనమే ప్రధానంగా వారి భక్తి ప్రచారం జరిగేది. ఇది ఆయనకు అవసరం కాబట్టి అలా చేయుచున్నారని భావించి నేను మాత్రం ఆయన బోధనలను విన్నప్పటికీ భగవంతున్ని పొందడమే లక్ష్యంగా సాధన చేసేవాడిని. ఆయన ఐశ్వర్య మహామంత్రం చెపుతూ ఉంటే నేను మాత్రం దాని స్థానంలో స్వామివారి అష్టాక్షరీ మహా మంత్రమును స్మరించేవాడిని.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుట :

కీ.శే. గవర్రాజు గారితో కలిసి కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారిని చూచుటకు వెళ్ళాము. అమ్మవారిని ఒక పర్యాయము దర్శించాము. మరియు 21-06-2002 శుక్రవారము అభిషేకమును బుక్ చేసుకున్నాము. ఆ గుడిలో ఒక బ్రాహ్మణుడికి అమ్మవారికి నైవేద్యమునకు మరియు మా ఇరువురికి భోజనానికి డబ్బులు ఇచ్చాము. గవర్రాజు గారు వారితో ఏదో విషయము మాట్లాడు సమయాన నేను మరోసారి అమ్మవారిని దర్శించెదనని గుడి లోనికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకొని బయటకు వచ్చి ఆ గుడిని అన్నివైపుల చూచుచుంటిని. ఈ ఆలయానికి 4 ద్వారములు కలవు. అందులో తూర్పు వైపున ఉన్న ముఖ్యద్వారము లోనికి వెళ్ళాను. ఆ ముఖ్యద్వారములో నిలబడి అనుకోకుండా అమ్మవైపు ఒక ప్రత్యేక కోణంలో చూచాను. అప్పుడు నమ్మలేని నిజం తెలిసింది. అక్కడినుండి అమ్మవారిని చూచుచున్నప్పుడు ఆ చూపు ఎన్నో ఆర్చెస్ గుండా పోయి దాదాపు ఒక ఫర్లాంగ్ దూరములో ఉన్న అమ్మ నల్లని ఆకారముతో స్పష్టంగా కనిపించింది. ఇది నాకు 20-03-2001 రోజున కలలో కనిపించిన విధంగానే ఉన్నది. అమ్మవారి చుట్టూ ఉన్న చక్కునము కూడా కలలో చూచినట్లే ఉన్నది. తరువాత ముఖ్యద్వారము బయటకు వెళ్ళి ఆ ద్వారమును చూచాను. ఇది నాకు కలలో కనిపించినట్లు ఆర్చెస్ మాదిరిగా దానిపైన చతురస్రాకారములో డిజైన్ కలలో కనబడిన విధంగానే ఉంది. ఎంతో సంతోషంతో కూడిన ఆత్రుతతో స్వామివారికి మరియు అమ్మవారికి పరి పరి విధాలుగ ధన్యవాదాలు తెలియచేసుకున్నాను.

హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత లక్ష్మీదేవి అమ్మవారిని ధ్యానించుచు పడుకున్నాను. అంతలో ఒక కల కన్నాను.

**23-06-2002 : కల :** ఈ కలలో నాకు కొంచెం దూరంలో ఒక గుడిలో అమ్మవారి పూజను ఒక బ్రాహ్మణుడు చేయుటను చూచాను. నాకు కొల్హాపూరులో భోజనం పెట్టిన పూజారి లాగానే ఈ పూజారి కలడు. ఆయన అమ్మవారికి పూజ చేయుచుండెను. ఆయనతో పాటు ఇంకా ఇద్దరు పూజారులు కలరు. ఈ పూజారి ఎరుపురంగు పంచ ధరించి పూజ చేయుటను చూచాను.

ఈ విధంగా నాకు శ్రీ కొల్హాపూర్ అమ్మవారి అనుగ్రహము లభించింది.

## తిరుమల స్వామివారిని దర్శించుట :

జూన్ 2002 : ఒక సందర్భంలో కీ.శే. గవర్రాజు గారి సలహా మేర తిరుమల శ్రీవేంకటేశ్వరుని "మేల్చాట్ వస్త్రము" అను సేవను నేను నా భార్య కలిసి చేశాము. ఈ సేవ అత్యంత తృప్తిని ప్రసాదించింది. స్వామివారి గర్భాలయము ముందు స్వామివారి అభిషేకమును చూచుకుంటూ ఒక గంట పదిహేను నిమిషాలు కూర్చున్నాము. స్వామివారిని తనివితీర చూడవలెననే నా కోరిక తీరింది. చిత్రమేమిటంటే నేను స్వామివారిని కలలో దర్శించిన మాదిరిగానే శ్రీవెంకటేశ్వరుడు కలడు. కలలో దర్శించినట్లే ఆయన అరచేతిలోని గీతలను కూడా చూచి పోల్చుకున్నాను. నేను కలలో స్వామివారిని అభిషేకము తరువాత ఎలాంటి వస్త్రములు, ఆభరణములు లేని విధంగా చూచాను. ఇప్పుడు కూడా అదేవిధంగా స్వామివారిని చూచాను. అదే రూపము. అదే ఆకర్షణ. అణువణువు పోల్చుకున్నాను. మరో విషయమేంటంటే మొత్తం ఈ సేవాకాలంలో ఒక గంట పదిహేను నిమిషాల వరకు, తన్మయత్వముతో కళ్ళనుండి నిరాటంకంగా ఆనంద భాష్పాలు రాలాయి. నేను కూర్చున్న స్థలము నా కన్నీటితో తడిసిపోయింది.

ఈ జీవితములో నేను పొందిన అత్యంత మధురమైన క్షణాలలో ఇది మూడవ స్థానము ఇవ్వదగింది. అంతటి పరమానందాన్ని అనుభవించాను. పూజారులు స్వామివారిని ఏ విధంగా అభిషేకించుదురు అనే విషయాన్ని అత్యంత సూక్ష్మ దృష్టితో చూచాను. ఆ పూజారులు ఎంతో అదృష్టవంతులని నాది నేను భావించుకున్నాను. స్వామిని స్పర్శించిన వారి చేతిని ముద్దాడాలనిపించింది. కాని వీలుపడక ఊరుకున్నాను.

కీ.శే. గవర్రాజు గారు 1983 సంవత్సరము నుండి భక్తి ప్రచార పీఠమును స్థాపించి, భక్తులకు శ్రీవేంకటేశ్వరున్ని ఎలా పూజించాలి, ముడుపులెలా కట్టాలి, అసలు శ్రీవేంకటేశ్వరుడంటే

ఎవరు? ఏడు కొండలు ఎలా ఉద్భవించాయి మొదలగునవి ప్రజలకు తెలియచేయుచుంటారు. మరియు అప్పుడప్పుడు భక్తుల నుండి ధనమును సేకరించి టిటిడి గోశాలకు విరాళంగా ఇచ్చారట. ప్రస్తుతము కూడా వారు గత 5-6 సంవత్సరముల నుండి వ్రాయించిన 3 కోట్ల ఐశ్వర్య మంత్రమును టిటిడి డైరీఫాంలో ఒక చిన్నపాటి స్థూపాన్ని ఏర్పాటు చేసి యజ్ఞము చేసి సమర్పించాలని భావించారు. దానిపేరు "జపనామ స్థూపం" అని పెట్టారు. ఈ ఆలోచన గత 5-6 సంవత్సరముల నుండి ఆయనకు ఉన్నప్పటికీ ఎంత ప్రయత్నించినప్పటికీ ముందుకు సాగలేకపోయారు. ఇదే కాకుండా టిటిడి డైరీఫాం డెవలప్మెంటు కోసం ఒక కోటి రూపాయలను విరాళంగా ఇచ్చుదునని చెప్పి భక్తుల నుండి చెక్కుల రూపంలో ధనాన్ని కూడా సేకరించుచున్నారు. దీనికోసం సభలు, సమావేశాలు ఏర్పాటు చేయుచున్నారు. నేను కూడా నాకు తెలిసిన చోట్ల ప్రయత్నించాను. సిద్ధిపేటలో కూడా గో సమర్పణ ధనాన్ని సేకరించుటకు ఒక సభను ఏర్పాటు చేశాను. ఈ విధంగా హైదరాబాదులో ధన సమీకరణ చేయుచు తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో ఈ స్థూపం ఎక్కడ నిర్మించాలనే మంతనాలు జరుగుచున్నవి. అప్పుడు టిటిడి డైరీఫాం డైరెక్టరుగా శ్రీమాన్ డా॥ కొండారెడ్డి గారు ఉన్నారు. శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత వీరు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించేవారు. ఇదే కాలములో టిటిడి వారు "గో సంరక్షణ ట్రస్ట్" అనే దానిని ఏర్పాటు చేయదలచారు. దీని బాధ్యతను డైరీఫాం డైరెక్టరుగా ఉన్న శ్రీమాన్ కొండారెడ్డి గారు తీసుకున్నారు. నాకు కీ.శే. గవర్రాజు గారితో చక్కని బంధం ఏర్పడింది. ముఖ్యంగా సభలు నిర్వహించుటలో, డబ్బు సమీకరించుటలో నేను ఆయనకు సహకరించుచున్నాను. తేది 03-07-2002 ప్రాంతమున టిటిడి డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కొండారెడ్డి గారి ఆహ్వానం మేర "నామస్థూపం" నిర్మించే స్థల పరిశీలన నిమిత్తమని ఒక నాలుగైదు రోజుల కొరకు నాకు చెప్పి గవర్రాజు గారు తిరుపతి వెళ్ళారు.

## నా మొదటి పుట్టినరోజు పండుగ — స్వామివారి బహుమానం :

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక పద్ధతిలో సమయానుకూలంగా తన లీలలను ప్రసాదించును. ఆకలైనప్పుడే రుచెక్కువున్నట్లు మనలో ఆ దిశగా ఆర్తిని పెంచి ఆ లీలలో అత్యంత ఆనందమును అనుభవించేటట్లు చేస్తాడు. ఇలాంటి అద్భుతమైన లీల ఒకటి నా జీవితంలో జరిగింది. జీవితాంతం గుర్తుంచుకునే సంఘటన. నా మొదటి పుట్టినరోజు పండుగకు స్వామివారు ఈ ప్రపంచములోని మన్నికైన వజ్రవైఢూర్యాలు పొదిగిన నగను బహుమతిగా ఇచ్చారు. నేను కొంత తడవు స్పృహ కోల్పోయేలా చేశారు.

నా జీవితములో శ్రీవేంకటేశ్వరుడు కొన్ని ఆణిముత్యాలను ప్రసాదించాడు. జీవితాంతం గుర్తుంచుకోతగినవి ఇచ్చాడు. మరికొన్ని అంతకంటే విలువైనవి ప్రసాదించాడు. ఆయన ఒక్క అనుగ్రహానికి పరవశుణ్ణై ఈ జీవితం మొత్తం మీకు ఋణపడి ఉంటాను అని భావించిన అనుగ్రహాలలో ఇది ఒకటి.

భక్తుడు భగవంతున్ని నావాడు అనుకొని సాధన చేస్తుంటాడు. భగవంతుని దృష్టిలో పడాలని తాపత్రయపడుతుంటారు. కాని, భగవంతుడే స్వయంగ ఆ భక్తుని "నీవు నావాడివి" అని అంటే ఆ భక్తుని ఆనందం ఏ స్థాయిలో ఉంటుంది? ఈ జీవితంలో ఆ భక్తునికి మరేమి కావాలి? నేను ఇంతటి అదృష్టానికి నోచుకున్న ఘటన ఇది. ఆ లీల ఈ విధంగా ఉంది.

నేను ఒక మామూలు వ్యవసాయ కుటుంబంలో పల్లెటూరిలో పుట్టినవాణ్ణి. నా పుట్టినరోజు తెలియదు. మా అమ్మానాన్నలు జన్మతేదీని వ్రాసి పెట్టేలేదు. నా మేనమామ వ్రాశాడట కాని అలభ్యం. నా స్కూల్ రికార్డులో మాత్రం నా జన్మతేది 02-02-1959 అని ఉంది. కాని ఇది తప్పు. మా పెద్దనాన్న పెద్దకొడుకు ఆక్సిడెంటులో చనిపోయాడు. ఆయన జ్ఞాపకార్థం మా ఊరిలో పాఠశాల నిర్మించి దానిపై ఈయన మరణతేది 02-02-1959 అని వ్రాశారు. నిజానికి నేను ఈయన మరణం తరువాత ఒకటిన్నర సంవత్సరమునకు పుట్టానని మా అమ్మ చెప్పేది. కాబట్టి ఈయన మరణతేది నా పుట్టిన రోజు ఒకటి కాదని 2వ తరగతిలోనే గ్రహించిన నేను, నా స్కూల్ రికార్డు తప్పని తెలుసుకున్నాను. కాబట్టి ఇప్పటివరకు నేను ఒక్క పుట్టినరోజును జరుపుకోలేదు. కనీసం దేవునికి దండం కూడా పెట్టలేదు. నా పెండ్లి తరువాత నా భార్య కోరిక మేర మా అమ్మను నేను ఎప్పుడు పుట్టాను? దాని ముందు వెనుక ఏమి పండుగలు ఉన్నవని అడుగగా ఆమె "తొలి ఏకాదశి మరియు మొహర్రం పండుగలు రెండు మూడు రోజుల వ్యవధిలో వచ్చాయని, నేను సాయంత్రం దాదాపు ఐదు నుండి ఐదున్నర మధ్యలో పుట్టానని చెప్పింది. దీనిని బట్టి ఒక పంతులు గారు నేను తేది 05-07-1960 లేదా 07-07-1960 సాయంత్రం పుట్టానని చెప్పారు. నేను ఒకసారి నాడీ జ్యోతిష్కుని వద్దకు వెళ్ళినప్పుడు నా వేలిముద్ర తీసుకొని నేను తేది 05-07-1960 (తొలి ఏకాదశి) సాయంత్రం 05-15 నిముషాలకు పుట్టానని చెప్పారు. (ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు నేను తొలి ఏకాదశి రోజు పుట్టానని చెప్పాడు).

ఇన్ని సంవత్సరముల నుండి నేను నా పుట్టిన రోజును

ఒక్క సంవత్సరము కూడా జరుపుకోలేదు. అలాంటిది తేది 05-07-2002 నాడు మాత్రం నా పుట్టిన రోజును ఎవ్వరికీ తెలియకుండా జరుపుకోవాలని, ఆ రోజు నా స్వామికి ప్రత్యేక పూజలు చేయాలని కోరిక కలిగింది. శ్రీవేంకటేశ్వరా! నేను నా గత 41 పుట్టిన రోజులలో మిమ్ములను ధ్యానించలేదు. కనీసం దండం కూడా పెట్టలేదు. ఈ 42వ పుట్టిన రోజున మిమ్ములను మనసారా పూజించుకుంటాను ప్రభూ! అని వేడుకున్నాను. స్వామివారిని అభిషేకించి నాకు ఇష్టమైన గులాబీలతో, మల్లెపూలతో అర్చించాలనిపించింది.

నా అదృష్టము కొలది తేది 05-07-2002 నాడు శుక్రవారమయింది. ఈనాడు మా ఇంటిలో నా ఇష్టపూర్వకంగా స్వామివారికి నీరు, పాలు, తేనె, గంధముతో అభిషేకము చేశాను. ఈ జీవితంలో ఇదే నేను నా స్వామికి చేసిన మొదటి అభిషేకము. తిరుమలలో స్వామివారిని శుక్రవారము రోజు ఏ విధంగా అభిషేకిస్తారో అదేవిధంగా, తులసీదళాలు వేసిన నీరు, పాలు, గంధం, తేనె మొదలగు వాటితో అదే వరుసక్రమములో అభిషేకించాను. స్వయంగా స్వామివారిని స్పృశించుచున్నాననే భావముతో చేశాను. మొత్తం అభిషేక క్రియ గం. 1.15 నిముషాలు పట్టింది. ఈ మొత్తం కాలం నేను పరవశించిపోయాను. రోమాంచితుడనైనాను. కనుల నుండి ఆనంద బాష్పాలు మొత్తం గం. 1.15 ని॥లు నిరాటంకంగా రాలాయి. నా జీవితంలో అత్యంత పరవశంతో, నిరాటంకంగా పరమానందాన్ని అనుభవించిన దానిలో ఇది రెండవ స్థానము ఇవ్వదగింది. పూజ జరుగు సమయాన 'ప్రభూ నా చేత లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక కార్యమును చేయించమని వేడుకున్నాను. ఈ కార్యక్రమములో నేను కూడా తృప్తిగా మీ సేవ చేయాలి, ఆనందపడాలని కూడా ప్రార్థించాను'. తరువాత మల్లెపూలు, గులాబీలతో పూజించాను. చివరికి అప్రయత్నంగా నా నోటి నుండి ఒక మాట వెలువడింది. "ప్రభూ! గత 41 సంవత్సరాలు నా అజ్ఞానం వల్ల నా పుట్టినరోజు నాడు పూజించలేదు. ఈరోజు తృప్తిగా మిమ్మల్ని పూజించుచున్నాను. ఒకరకంగా ఇది నా మొదటి పుట్టినరోజు పండుగ. ఇష్టమైనవారు ఏదో ఒకటి ఈ మొదటి పుట్టినరోజు పండుగకు బహుమానం ఇచ్చెదరు. మీరు అత్యంత ఆప్తులు. నాకు మీరు ఏమి బహుమానం ఇస్తున్నారు ప్రభూ!" అని అకస్మాత్తుగా నా నోటి నుండి వచ్చింది. మరియు నా రెండు అరచేతులు చాచి, దోసిలి పట్టి, స్వామి పాదాల చెంత పెట్టి స్వామివారిని "బహుమానం, బహూమానం" అని అప్రయత్నంగా అడిగాను. నా కళ్ళనుండి ఆనందబాష్పాలు జాలువారుచుండ అత్యంత ప్రేమతో అడిగాను. ఆ విధంగా నేను నా మనస్సు తృప్తి చెందే విధంగా ప్రార్థించాను.

ఇంతటితో ఈ విషయం ముగిసిపోయింది. ఈ రోజు నుండి ప్రతి శుక్రవారం స్వామివారికి అభిషేకించుట ప్రారంభించాను.

స్వామివారు నా ప్రశ్నకు జవాబు ఇస్తారని, మంచి బహుమానం ఇస్తారని ఊహించలేదు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నేను కోరినదానికంటే ఎక్కువ ఇచ్చాడు. నా మనస్సును గ్రహించాడు. నా సేవను వినియోగించుకోవాలనుకున్నాడు. ఈ రోజు ఆ స్వామి నోటినుండి "నా సాయిరెడ్డి", "సాయిరెడ్డి నావాడు" అనే పదమును పలికి నా మనస్సు నింపాడు. ఈ జీవితంలో నేనే అందరి కంటే ధన్యుడనని అనుకున్నాను. పొంగిపోయాను. నా స్వామి పాదాలకు శతకోటి ప్రణామాలను అర్పించాను. ఈ జీవితాంతం ఋణపడి ఉంటానని నిర్ణయించుకున్నాను. అసలు చెప్పాలంటే నోరు లేదు, మాటలు లేవు, మూగవాడినైనాను. కొంత తడవు స్పృహ తప్పినట్లైంది.

అది ఈ విధంగా జరిగింది.

## సాయిరెడ్డి నావాడని పిలుచుట – స్థూప నిర్మాణానికి అవకాశం

**09-07-2002:** ఈ రోజు ఉదయం గం.8.30 ప్రాంతమున కీ.శే. వాద్రేవు గవర్రాజు గారు నాకు ఫోన్ చేశారు. ఆయన తిరుపతికి పోయి శ్రీవేంకటేశ్వర 'నామ జప స్థూపము' ఎక్కడ కట్టాలో అధికారులతో చర్చించానని 21-09-2002 నాడు జపనామ స్థుపం మరియు 22-09-2002 నాడు గోసంరక్షణ ట్రస్టు ప్రారంభోత్సవ రోజులుగ నిర్ణయించారన్నారు. అంతే కాకుండా తాను, టిటిడి అధికారులు కలిసి కంచి వెళ్ళి శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి స్వామివారిని కలిసి ఆ రోజులలో వారిని తిరుపతికి రమ్మని ఆహ్వానించామన్నారు. వారు కూడా తేది 22-09-2002 నాడు తిరుపతికి వచ్చి "గో సంరక్షణ ట్రస్టు"ను ప్రారంభించెదరని చెప్పారు. నాతో ఆయన పది గంటలకు వారింటికి రమ్మన్నారు. హిమాయత్‌నగర్ లోని తిరునిలయంలో సాయంత్రం 6 గంటలకు వారి మిత్రుడి స్వామి గురించిన ఉపన్యాసమున్నది వెళ్ళాలని చెప్పారు. దానికి నేను సరేనన్నాను.

ఉదయం 10 గంటలకు నేను ఆయన ఇంటికి వెళ్ళాను. ఆప్యాయతతో స్వామివారి లడ్డూ ప్రసాదమును ఇచ్చారు. మరియు సెప్టెంబర్ 21, 22 తేదీలు నిర్ణయమైనవి. ఆ రోజు గోపూజ, కోటి రూపాయలు స్వామివారికి గో సమర్పణ క్రింద ఇవ్వడము జరుగునని చెప్పాడు. మరియు 'నామ జప స్థూపము' గురించి కూడా చెప్పాడు.

తరువాత నేను మా ఆఫీసుకు కారులో బయలుదేరి వస్తున్నాను. మార్గమధ్యమున నేనే ఆ స్తూపమును కట్టవలెననే

ఆలోచన కలిగింది. ఆఫీసుకు వచ్చి యథాప్రకారం స్వామివారికి బొట్టుపెట్టి మ్రొక్కుచూ "స్వామీ! నాకు ఆ స్తూప నిర్మాణమును చేయు ఆజ్ఞ ఇవ్వమని, నా సేవను స్వీకరించుమని" నా కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగగా ఆ స్వామిని వేడుకుని స్వామి పాదాలు మ్రొక్కాను. అప్పుడు నా శరీరం కంపించింది. ఎలాగైనా ఈ స్థూప నిర్మాణం నేనే చేయాలనే దృఢ సంకల్పం ఏర్పడ్డది.

సాయంత్రం 5.45 నిముషములకు నేను కారులో శ్రీ గవర్రాజు గారి ఇంటికి హిమాయత్‌నగర్ లోని తిరునిలయమునకు తీసుకుపోవుటకని వెళ్ళాను. అక్కడ నుండి 6 గంటలకు బయలుదేరాము. ఆ స్వామివారి లీలలను చెప్పుకుంటూ వెళ్ళుచున్నాము. చివరికి నేను ఆ స్వామివారి జప స్థూపము నేనే కట్టుదునని దానిని ఇతరులకు చెప్పవద్దని గవర్రాజు గారితో అన్నాను. అప్పుడు మేము హిమాయత్‌నగర్ లోని తిరునిలయం యొక్క ముఖ్యద్వారము ఎదురుగా ఉన్నాము. దీనిని విని గవర్రాజు గారు ఒక్కసారి ఉలిక్కి పడ్డారు. కారును ప్రక్కకు త్రిప్పమన్నారు. అప్పుడు తిరునిలయం ప్రక్కన ఉన్న కళ్యాణ మండపం ఎదురుగా, శ్రీవేంకటేశ్వరస్వామి వారి విగ్రహానికి ఎదురుగా, రోడ్డుకు ఎడమ ప్రక్కన కారును ఆపాను. గవర్రాజు గారి ఒళ్ళు వణుకుచున్నది. ఆయన కళ్ళనుండి నీరు కారుచున్నది. అప్పుడు ఆయన అన్న మాటలు ఇవి. "నేను గత 22 సంవత్సరముల నుండి ఆ స్వామివారి సేవ చేయుచున్నాను. ఆ స్వామినే నమ్ముకున్నాను. మనసా, వాచా, కర్మణా నాకు ఆ స్వామి మాత్రమే. నేను ఆ స్వామివారి పాదముల సాక్షిగా చెప్పుచున్నాను. ఇది నిజము" అన్నారు. మరియు తేది 05-07-2002 శుక్రవారము రోజున నేను మరియు టిటిడి ఎస్వీ డైరీఫాం డైరెక్టర్ శ్రీ కొండారెడ్డి గారు వారి డైరీఫాంలో స్థూపమునకు స్థలము నిర్ణయించాము. తరువాత తెల్లవారు జామున మేము మద్రాసుకు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారిని ఆహ్వానించుటకు వెళ్ళవలెనని నిర్ణయించాము. తరువాత నేను హోటల్ రూం లోనికి వెళ్ళి కూర్చుండి కాగితము తీసి ఆ స్థూపము ఏ విధంగా ఉండాలి, దీనిని ఎవ్వరు కట్టుదురు అని ఆలోచించుచుంటిని. ఇంతలో ఎదురుగా ఉన్న గోడపైన ఒక నల్లని రూపము ఏర్పడింది. అది స్వామివారి రూపము వలెనే ఉన్నది. ఆడ మగ కాని గొంతుతో ఆ రూపము నాతో ఈవిధంగా అన్నది "స్థూప నిర్ణయం బాగుంది. దీని విషయము వదులుము. దీనిని నా సాయిరెడ్డి కట్టును, సాయిరెడ్డి నావాడు, నా కోసం ఏమైనా చేస్తాడు, అని పలికి ఆ రూపము మాయమైంది" అని నాతో చెప్పాడు. ఆ మాటలు ముఖ్యంగా "నా సాయిరెడ్డి" అనే మాట నా హృదయములో ఎంతగానో చొచ్చుకుపోయింది. స్వామివారే స్వయంగా తన నోటితో నన్ను "నా సాయిరెడ్డి" అని అన్నారని మురిసిపోయాను. ఒళ్ళు కంపించింది. ఈ మాట వినగానే గొల్లున ఏడిచాను. అంటే నేను తేది 05-07-2002 రోజున మీరు నాకు ఏమి ఇచ్చెదరు స్వామీ అని ప్రొద్దున వేడుకుంటే సాయంత్రము శ్రీ గవర్రాజు గారితో "నా సాయిరెడ్డి" అని సంబోధించాడు. ఆ తరువాత నా మనస్సులో స్థూప నిర్ణయాన్ని కల్పించి ఆచరించే విధంగా చేశాడు. నాచే ఆయన పని చేయించుకుంటున్నాడు. నేను ఏదో ఒకటి చేయాలనే నా చిరకాల కోరికను స్వామివారు తీరుస్తున్నారని భావించాను. ఆ సమయంలో నేను ఈ లోకము విడిచి.... ఎక్కడికో పోయాను. ఆనందమునకు హద్దులు లేవు. కొంత తడవు స్పృహ కోల్పోయినట్లైంది. జీవితాంతం నా స్వామికి ఋణపడి ఉంటానని నిర్ణయించుకున్నాను. పిదప ఒక పది నిముషాల తరువాత కారు దిగి తిరు భవనము లోనికి వెళ్ళాము.

ఈ విధంగ తేది 05-07-2002 రోజు సాయంత్రం "సాయిరెడ్డి నావాడు. నాకోసం ఏమైనా చేస్తాడు" నీవు స్థూప విషయమును అతనికి వదులుమని శ్రీ గవర్రాజు గారిని ఆజ్ఞాపించాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. స్వామివారు ఈ అనుగ్రహన్ని నా మొదటి పుట్టిన రోజు కానుకగ ఇచ్చారని భావించుకున్నాను. ఒక భక్తునికి ఇంతకంటే కావలసిందేముంటుంది. ఇది ప్రపంచంలో మన్నికైన వజ్రవైఢుర్యాలు పొదిగిన నగ కంటే విలువైనదిగా నాకు నేను భావించుకున్నాను.

ఈ విధంగా తిరుపతిలో శ్రీవేంకటేశ్వరుని స్థూపమును నిర్మించుటకు అవకాశం కల్పించాడు.

**11-07-2002 :** భారత దేశము నలుమూలలో శ్రీవేంకటేశ్వరుని మందిరములను నిర్మించాలని కోరిక కలిగింది. ఆది శంకరాచార్యులు ఏ విధంగా దేశం నలుదిక్కులా పీఠములను స్థాపించారో అదేవిధంగా శ్రీవేంకటేశ్వరుని మందిరములను దేశం నలుదిక్కులా కట్టాలని, కట్టించాలని కోరిక దృఢంగా కలిగింది. ఆయన కృపాకటాక్షాలు సర్వులకూ అందేవిధంగా చేయాలనిపించింది. ఈ విధమైన బలమైన హృదయాంతర భావం కలిగింది.

**తేది 20-07-2000 :** నేను ఏప్రిల్ 2000 సంవత్సరము నుండి స్వామివారి లీలలను పొందుచున్నప్పటికీ, వీటిని మామూలు కలలుగా భావించాను. నేను మాత్రమే అర్థము చేసుకునే విధంగా, ఆ కల యొక్క సారాంశమును మాత్రమే నా డైరీలో వ్రాసుకునేవాడిని. అది కూడా ఒక నాలుగు పొందిన తరువాత, నాకు సమయము చిక్కినప్పుడు వ్రాశాను. చివరికి స్వామివారు నాచే ఏదో సాధించుటకు ఒక క్రమ పద్ధతిలో

లీలలను ప్రసాదించుచున్నారని గ్రహించి తేది 20-07-2002 నుండి ఈ అనుభూతుల కోసమని ఒక ప్రత్యేక పుస్తకమును పెట్టి వ్రాయుట ప్రారంభించాను.

నాకు మీ సేవా భాగ్యమును ప్రసాదించుమని, తిరుపతిలో స్థూప నిర్మాణమును చేయు భాగ్యమును ఇవ్వమని, నాచే లోకమునకు ఉపయోగపడే ఒక మంచిపనిని చేయించమని శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రతిరోజు ప్రతిక్షణం వేడుకుంటున్నాను. మరియు గవర్రాజు గారు గోసమర్పణ నిధిని సమీకరించుటకు నిర్వహించు సభలకు వెళ్ళుచున్నాను.

మొదట్లో శ్రీ గవర్రాజు గారు ఈ స్థూపము చిన్నమొత్తంలోనే అంటే మూడడుగులకు మించకుండా చేయమన్నాడు. కాని శ్రీవేంకటేశ్వరుని పైనున్న భక్తితో చిన్నగా చేస్తే అది నా స్వామివారికి అవమానమని భావించి డబ్బులకు వెరవక అత్యంత సుందరంగా ఉండాలని భావించాను. నా ఆర్కిటెక్ట్ శ్రీమాన్ శివలీలానంద్ గారికి దీని డిజైన్ బాధ్యతను అప్పగించాను. ఆయన కూడా దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తన మిత్రుడు, తన వద్దనే పని చేయుచున్న శ్రీమాన్ బాలు గారికి ఈ బాధ్యతను అప్పగించాడు. శ్రీమాన్ బాలు గారు కూడా మంచి భక్తుడు. స్వామివారిని ప్రార్థించుచు ఒక చక్కని రూపమును డిజైన్ చేశాడు. నాకు చాలా నచ్చింది. ఈ రూపము డిజైన్ చేయునప్పుడు తాను ఎంతో పరమానందమును అనుభవించానని, మరియు ఈ రూపము తన ప్రమేయము లేకుండానే తనకు తానే సంతరించుకున్నట్లు అనుభూతి పొందానని చెప్పాడు. ఈ విధంగా స్థూపం ప్లాన్ సిద్ధం చేసుకున్నాము. చివరికి తిరుపతిలో తేది 13-08-2002 నాడు జపనామ స్థూప నిర్మాణ పనులు ప్రారంభించుటకని తేది 12-08-2002 నాడు నేను మరియు గవర్రాజు గారు హైదరాబాద్ నుండి ప్రయాణమై తేది 13-08-2002 ఉదయం తిరుపతి చేరాము. పిదప స్నానాదులు ముగించుకుని 10 గంటల వరకు టిటిడి గోశాలకు వెళ్ళి దాని డైరెక్టర్ డా॥ కొండారెడ్డి గారిని కలిశాము. ఆయన అంతకుముందే ఒక స్థపతిని ఈ స్థూపము కట్టుటకు మాట్లాడి పెట్టారు. స్థూప ప్లానును వారికి చూపించాను. తరువాత స్థపతితో పరిచయము చేసుకుని ఏ విధంగా ఈ స్థూప నిర్మాణము చేయాలో చెప్పాను. ముందు బావి లాగ ఒక గోయి తవ్వి చుట్టు బేస్‌మెంటు కట్టాలి. ఆ తరువాత భూమిపై కనబడే ఆకారం నిర్మించాలని చెప్పాను. మేము అందరం కలిసి గోశాల తిరిగి పూర్వము నిర్ణయించిన స్థలమునకు బదులుగా వేరొక స్థలమును గోవిందుని సన్నిధిలో నిర్ణయించాము. చివరికి మార్కింగ్ వేసి తేది 13-08-2002 మంగళవారం రోజున దాదాపు 12 గంటలకు (మధ్యాహ్నము) రోజు భూమిపూజ చేశాము. మేము నలుగురము (డా॥ కొండారెడ్డి, గవర్రాజు, నేను మరియు స్థపతి) 4 టెంకాయలు కొట్టి ప్రారంభించాము. అప్పుడు మా వద్ద గడ్డపార, పార లేనందున త్రవ్వలేదు.

ఆ రోజు సాయంత్రం ఆ స్థపతితో స్థూపము కట్టుటకు మాట్లాడాము. బేరసారాల తర్వాత ఆయన కొంత మొత్తానికి ఒప్పుకున్నాడు. ఒక సందర్భములో ఆ స్థపతితో నేను ఇలా అన్నాను "అయ్యా మేము హైదరాబాదులో ఉంటాము. ప్రతిసారి ఇక్కడకు రాలేము. స్థూప నిర్మాణములో 'స్కఫోల్డింగ్' (అంటే కట్టెలు కట్టుట) అవసరముంటుంది వాటిని మీరే చూసుకోవాలని చెప్పి, మీకు స్కఫోల్డింగ్ అంటే తెలుసా? అని అన్నాను. ఈ మాటను ఆ స్థపతి చిన్నతనంగా భావించి కోపగించుకుని నేను ఈ పనిని చేయనని వెళ్ళిపోయాడు. నేను ఆ స్థపతితో 'సారీ' చెప్పినప్పటికీ ఆయన వినలేదు. అది నన్ను చాలా బాధపెట్టింది. చివరికి కొండారెడ్డి గారు ఆయనతోనే చేయిస్తానని అభయమిచ్చారు. మేము సరే అని ఆ రోజు రూముకు వెళ్ళిపోయాము. తిరిగి తేది 14-08-2002 నాడు మరల ప్రారంభించుటకని డైరీఫాంకు వచ్చాము. స్థపతి మాత్రం రాలేదు. దాదాపు ఉదయం 9.30 గంటలకు మరల పూజ చేశాము. గునపముతో తవ్వాము. పారతో మట్టిని తీశాము. ఫోటోలు తీసుకున్నాము. ఏనుగుచే ఆశీర్వాదము చేయించుకున్నాము. స్వామివారిని మనసారా వేడుకున్నాము. "ఈ స్థూపము నాచే కట్టించి నన్ను తృప్తి పరచి మీరు మనసారా స్వీకరించండి ప్రభూ!" అని వేడుకున్నాను. కొండవైపు తిరిగి ఈ రకమైన ప్రార్థన చేశాను.

రెండవరోజు తవ్వడం చాలావరకు చేశాము. కట్టుటకు కావలసిన మెటీరియల్ అంటే స్టీల్, మెటల్, ఇసుక, ఇటుకలు, రాళ్ళు, సిమెంటు మొదలైనవి అన్నీ చేర్చాము. మేస్త్రీ దొరకక ఇబ్బంది పడ్డాము. కాని కొండారెడ్డి గారు మాత్రం మీరు తిరిగి హైదరాబాదుకు వెళ్ళండి, నేను ఆ స్థపతితో ఈ పనిని చేయిస్తాను లేదా వేరే మేస్త్రీతో అయినా చేయిస్తానని అన్నారు. నేను ఆయనకు ఖర్చుల క్రింద కొంత ధనము ఇచ్చి వచ్చాను.

ఈ స్థూప సంకల్పము నుండి పూర్తి అగువరకు అడుగడుగునా స్వామివారి లీలలు కనబడ్డాయి. ఒక్కొక్క లీలను వర్ణించుచున్నాను.

## ప్రతి సం॥ ఒక పండుగ చేయమని ఆదేశించుట

తేది 13-08-2002 మరియు 14-08-2002 రోజులలో శ్రీవేంకటేశ్వర జపస్థూప శంకుస్థాపనోత్సవములు

తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో జరిగాయి. 15-08-2002 రోజున ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించాలనే ఉద్దేశ్యంతో నేను మరియు శ్రీ గవర్రాజు గారు కలిసి తెల్లవారు ఝాము 4.15 గంటలకు తిరుపతి నుండి బయలుదేరి 5.10 గంటలకు కొండపై వైకుంఠమునకు చేరుకున్నాము. మా వద్ద ఉన్న ఎ.ఎ.డి. (అప్పట్లో స్పెషల్ దర్శనము) టిక్కెట్స్‌కు ఉదయం 5.30 గంటలకు మాత్రమే ప్రవేశము కలదు. ఇంకా సమయము ఉంది కావున నేను శ్రీ వరాహస్వామి వారిని దర్శించ తలచాను. శ్రీ గవర్రాజు గారు మాత్రం తాను నడవలేనని "నీవు వెళ్ళు, నేను ఇక్కడే ఉంటాను" అన్నారు. నేను ఒంటరిగా శ్రీ వరాహస్వామిని దర్శించుటకు వెళ్ళుచు వైకుంఠములోని మెట్లు దిగుచు శ్రీ వరాహస్వామి ఆలయం వైపు నడుచుకుంటూ ఒంటరిగా వెళ్ళుచున్నాను. అనుకోకుండా అక్కడున్న ఒకాయన నా వద్ద ఒక రూపాయి తీసుకుని స్వామివారి తిరునామమును నా నుదుటిపై పెట్టాడు. నేనప్పుడు నా ప్రభు యొక్క నామము మొదటిసారి ధరించానన్న సంతోషం మరీ మరీ ముగ్ధుణ్ణి చేసింది. చాలా మురిసిపోయాను. ఇంతలో ప్రక్క గోడపైన స్వామివారు తన భక్తుడైన బావాజీతో పాచికలు ఆడు దృశ్యమును చూచాను. వెనువెంటనే హృదయము నందు ఒక దృఢమైన సంకల్పము కలిగింది. నా ఒళ్ళు జలదరించింది. నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలేవిధంగా శరీరం పులకరించింది. "నేను సర్వము స్వామివారికి సమర్పించుకున్నానని మరియు తప్పక ప్రతి సంవత్సరం స్వామివారి గురించి లేదా ఆయన కార్యక్రమముల గురించి మంచి మొత్తంలో కొంత సొమ్మును వెచ్చించాలని మరియు ప్రతి సం॥ము ఒక పండుగ చేయాలి" అనే బలమైన హృదాయాంతర భావం పుట్టింది. ఈ కోరిక నెరవేర్చు ప్రభూ అని ఆ స్వామిని మనసారా ధ్యానించుకున్నాను.

పిదప శ్రీ వరాహస్వామివారిని దర్శించి నాకు కలిగిన కోరిక నెరవేర్చు ప్రభూ అని వేడుకున్నాను. తిరిగి వెనుకకు వచ్చేటప్పుడు స్వామివారికి టెంకాయ కొట్టి, కర్పూర హారతి ఇచ్చాను. (సం॥ 2004 ప్రాంతమున టిటిడి వారు ఆలయ ముందరి ప్లాన్‌ను మార్చారు) వెంటనే అక్కడున్న (ఇన్‌స్టెంట్) ఫోటోగ్రాఫరు నేను నామాలతో ఉన్న ఫోటోను స్వామి ఆలయ గోపురము వచ్చేలాగా తీసి నాకిచ్చాడు. ఆ సమయంలో స్వామివారు ఆదేశించిన ప్రతి సంవత్సరం ఒక పండగ చేయాలనే ఆలోచనతో పరవశించిపోవుచున్నాను. నేను దిగిన ఆ ఫోటోను శ్రీ గవర్రాజు గారు చూచి నవ్వి చాలా బాగుంది అన్నారు. (2002 సంవత్సరం నుండి ప్రతి జప పుస్తకం వెనుక ఇదే ఫోటోను ముద్రించుచున్నాము).

ఆరోజు స్వామి నా హృదయములో ప్రతి సంవత్సరము మంచి మొత్తంలో ధనాన్ని ఖర్చు చేసి తిరుపతిలో ఒక ఉత్సవము చేయవలెననే కోరిక కలిగించాడు. ఆ ఖర్చు చేయు ధనము నానుండి నేరుగా స్వామికి మాత్రమే చేరవలెననే భావము కూడా కలిగింది. అంటే మధ్యవర్తులెవరూ ఉండకూడదని దీని భావం. ఈ భావన వచ్చిన తరువాత చాలా ఆలోచించాను. ఈ సంవత్సరం స్వామి కృప వల్ల మహామంత్ర స్థూప నిర్మాణంను చేయుచున్నాను. కాని దీనిని ప్రతి సంవత్సరం చేయలేను కదా, టిటిడి వారు సంవత్సరానికొకటి కట్టమనరు కదా? మరి ప్రతి సంవత్సరం ఇంత మొత్తం ఖర్చు చేసి ఒక ఉత్సవంను ఏ విధంగా చేయాలని ఆలోచించాను. శ్రీ గవర్రాజు గారికి కూడా ఈ విషయం చెప్పాను. ఆయన దీనిని తేలికగా తీసుకున్నారు. నేను మాత్రం స్వామి సేవ ఎలా చేయాలని తపించాను, మార్గం చూపుమని వేడుకున్నాను.

తరువాత తేది 16-08-2002 ఉదయం హైదరాబాద్ చేరుకున్నాము. తరువాత స్వామి స్థూప నిర్మాణమును ఏ విధంగానైనా అత్యంత తొందరగా నిర్మించాలని స్వామివారిని ప్రార్థించుచున్నాను. పది రోజుల తరువాత 26-08-2002 నాడు టిటిడి వారి నుండి స్థూపనిర్మాణానికి తిరుపతికి రమ్మని మళ్ళీ పిలుపు వచ్చింది. ఈ పది రోజులలో ఎన్నో అనుకోని సంఘటనలు జరిగాయి. స్వామివారి మరో అద్భుత లీల ఒకటి 26-08-2002 నాటికి పక్వస్థితికి వచ్చింది. దాని గురించి వచ్చే భాగంలో తెలుసుకుందాము.

ఒక విశ్లేషణ : తేది 13-08-2002 నాడు ఎంతో ఇష్టంగా స్వామివారి స్థూప నిర్మాణమును చేయుటకు వచ్చిన స్థపతి చిన్న విషయానికి ఎందుకు జారుకున్నాడు? నీకు "స్కఫోల్డింగ్" తెలుసా? అనే మాట తప్పుకాదు, పైగ సారీ చెప్పినా మన్నించనంతటి తప్పు కాదు. స్వామి సేవను త్యజించునంతటి తప్పు అసలే కాదు. ఇందులో తప్పక శ్రీవేంకటేశ్వరుని లీల దాగి ఉంది. మేము మాత్రం ప్రారంభోత్సవమునకు తేది 21-09-2002 న ముహూర్తము నిర్ణయించి ఈ లోగా స్థూప నిర్మాణం పూర్తి చేయాలని ఆరాటపడుచున్నాము. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం పని జరగకుండా అడ్డు తగిలాడు. దీనికి బలమైన కారణం ఉంది. అది స్వామివారిని తృప్తి పరిస్తే తప్ప మా చేత తన పనిని చేయించుకోడు.

తిరమల శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుట, అందునా స్వామివారు మెచ్చేవిధంగా చేయుట అత్యంత కఠినమైన పని. మనలో ఎంతో ఆర్తి ఉంటే తప్ప స్వామివారు స్వీకరించరు. ఇది స్వామివారు స్వయంగా సంకల్పించిన సేవ అయినప్పటికీ మాలో కొంత "ఆర్తి మరియు సమర్పణాభావం" తక్కువ ఉండటం వలన ఈ ఆటంకం కల్పించాడని భావించను.

యోగ్యత సిద్ధించలేదు. దానిని పూరించుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మరో లీలను ప్రసరిస్తున్నాడు. అది నేటికి అంటే 25-08-2002 వరకు ఫలదీకరణ స్థితికి వచ్చింది. ఇది కేవలం ఒక లీల కాదు. కొన్ని లీలల సమూహంచే స్వామివారు ఆశించిన విధంగా ఫలవంతం అయింది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను తన దారి లోనికి తెచ్చుకొనుటకు ఆయా సందర్భాలలోని మా మానసిక స్థితికి అనుగుణంగా సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించువారు. అలాంటి సంఘటన ఒకటి ఇప్పుడు జరిగింది. ఒకసారి మేము ప్రయాణించు మార్గములో ఒక సుడిగుండం పుట్టి మమ్మల్ని పైకి ఎగరేసుకుపోయింది. గాలిలో ఉన్న మేము ఈ సుడిగుండం ఎక్కడ పడేస్తుందోనని భయపడ్డాము. పట్టుకోటానికి ఏ ఆధారము దొరకలేదు. గజ గజ వణికాము. ఇలా మరణ అంచుల వరకు వెళ్ళాము. చివరికి శ్రీవేంకటేశ్వరుని శరణు వేడాము. రక్షించమని ప్రాధేయపడ్డాము. నీవు చెప్పినట్లు వింటామన్నాము. ఒట్టు వేశాము, నమ్మమని బ్రతిమిలాడాము. చివరికి దయామయుడైన స్వామి కరుణించి రక్షించాడు. ఈ లీలతో మాలో చాలా మార్పు వచ్చింది. మేము ఈ జీవితంలో శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుటకే జీవించాలనే దృఢ సంకల్పం ఏర్పడ్డది. మరియు ఈ లీలలో ఒక వ్యక్తికి జబ్బు తగ్గుటకు డాక్టర్ విధించు "పత్యము" లాగా స్వామి సంకల్పము నెరవేర్చుటకు శ్రీవేంకటేశ్వరుడు మా జీవితానికి కొన్ని విధి విధానాలను విధించాడు. ఈ నియమాలు శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా కోరుకున్నప్పటికీ వీటిని మా ఇష్టపూర్వకంగా అత్యంత ఆర్తితో ఆ విధంగా జీవించుదుమని మేమే మాట ఇచ్చేవిధంగా పరిస్థితులు కల్పించబడ్డాయి. ఒకరకంగా ఈ లీల స్వామివారు ప్రసాదించిన సేవ అనే వృక్షానికి కాండం లాగా పనిచేసింది. (దీనిని వచ్చేభాగంలో చూద్దాం!)

**మరో విశ్లేషణ :** నా జీవితంలో 1.15 గంటలకు పైగా నిరాటంకంగా పరమానంద స్థితిని పొందిన సందర్భాలు మూడు. ఆనందబాష్పాలు పొందే స్థితి కంటే ఈ స్థితిలో ఎన్నోరెట్లు ఎక్కువ ఆనందం కలుగుతుంది. స్వామివారి కృపతోనే భక్తుడికి ఈ స్థితి లభిస్తుంది. ఆనంద తీవ్రతను ఆధారంగా ఈ మూడు సందర్భాలు ఇలా ఉన్నవి.

1. 2001 సంవత్సరంలో నేను సంపూర్ణ శరణాగతి చేసినప్పుడు అత్యంత పరమానందస్థితిని అనుభవించాను. ఆనందమును భరించలేక ఒక ఉన్మాదిగ కేకలు వేశాను. మొత్తం గంటన్నర కాలం జరిగింది. ఇది మొదటిస్థానం ఇవ్వదగింది. ఈరోజు సాయిరెడ్డిగా నా జీవితం ముగించి శ్రీవేంకటేశ్వర పాదసేవకుడిగా మారిపోయాను.

2. జులై 2002 లో నా మొదటి పుట్టినరోజు పండుగ సందర్భంగా చేసిన పూజలో దాదాపు గంట పదిహేను నిముషాలు పరమానంద స్థితిని అనుభవించాను. ఇది రెండవస్థానం ఇవ్వదగింది. ఈరోజు నాకు స్వామివారి సేవ బహుమానంగా లభించింది.

3. జూన్ 2002లో తిరుమల ఆలయంలో స్వామివారి అభిషేకము చూస్తున్నప్పుడు కూడా పరమానంద స్థితిని పొందాను. గంట పదిహేను నిముషముల వరకు ఈ స్థితిని అనుభవించాను. ఇది మూడవ స్థానం ఇవ్వదగింది. ఆనందనిలయంలో స్వామివారి ముందు ఉన్నప్పటికీ తక్కువ ఆనందాన్ని పొందాను.

దీనిని బట్టి స్వామివారిని పొందుట కంటే కూడా ఆయన సేవలో ఎక్కువ ఆనందమును అనుభవించే విధంగా నా మూల ప్రకృతిని స్వామివారు ప్రసాదించారని గ్రహించాను.

నా దశ : స్వామివారి సేవకై తపించిపోయాను. ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించారు. కష్టతరమైన సేవకైన వెరవక స్వామి స్మరణతో, ఆయన శక్తితో చేయాలనుకున్నాను. 'సాయిరెడ్డి నావాడు' అనే పిలుపుకు ప్రతిగ నా జీవితాన్ని అంకితం చేసాను. తిరుపతిలో స్థూప నిర్మాణ భాగ్యం లభించింది. ప్రతి సంవత్సరం మంచి మొత్తం ఖర్చు చేసి ఒక పండుగను చేయమన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.



**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్. ఫోన్: 040-27175050**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# శుభప్రదమాసం శ్రావణమాసం

– చిల్లర సీతారామారావు

'నభోనభస్స్వవర్షా' : నభ అనగా శ్రావణమాసము నభస్స అనగా భాద్రపదము నభోనభస్స అనగా శ్రావణభాద్రపదములు. శ్రావణమాసమునందు వర్షములు అధికము. వర్షపురాకతో వాతావరణమునందు మార్పుచోటుచేసుకొంటుంది. ప్రకృతి చల్లబడుతుంది. చల్లబడిన వాతావరణము మనస్సునకు ఉల్లాసమును, ఉత్సాహమును, ప్రశాంతతను కలుగజేస్తుంది. శ్రావణమాసమునందు వర్షము అధికమైనప్పటికీ ఆ మాసమునందు వచ్చు మంగళగౌరీ వ్రతము, వరలక్ష్మీ వ్రతముల కొరకు మహిళలు ఎదురుచూస్తుంటారు.

విష్ణుమూర్తి జన్మనక్షత్రము శ్రవణము. ఈ నక్షత్ర సమీపమున చంద్రుడు సందరించుట వలన ఈ మాసము శ్రావణమాసము అని అంటారు. ఆధ్యాత్మికముగాను, సామాజికముగాను ప్రత్యేకతను సంతరించుకున్న మాసము శ్రావణమాసము. పరిపూర్ణమైన సుఖములను, సౌఖ్యములను ప్రసాదించు నోములను, వ్రతములను కలిగిన మాసము శ్రావణమాసము. మహర్షులు మానవాళికి ఆధ్యాత్మికతను, భక్తిభావమును పెంపొందిపజేయు నిమిత్తము నోములను, వ్రతములను ప్రసాదించారు. వారు అనుగ్రహించిన వ్రతాలు నోములవలన హిందూ సంస్కృతి, హిందూ ధర్మము శోభాయమానముగా వెలిగిపోతున్నాయి. మహిళలందరినీ ఐకమత్యముతో కలిసిమెలిసి ఉండేటట్లు చేసి, చక్కని జీవనసరళికి సహాయపడే సోపానము వంటి శ్రావణమాసమునందు మానసిక, శారీరక, ఆర్థిక శక్తిననుసరించి వ్రతములను తప్పనిసరిగా ఆచరించటము శ్రేయోదాయకము.

గృహస్థులు శ్రావణమాసము రావడానికి ముందునుండే ఇళ్ళను శుభ్రపరచే కార్యక్రమములు మొదలుపెడతారు. ఇళ్ళల్లో పనికి రాని సామానులు తీసివైచి బూజుదులుపుకుంటారు. వ్రతముల రోజున వాకిళ్ళకు మామిడితోరణాలు కడతారు. గడపలకు పసుపురాసి కుంకుమ బొట్లు పెడతారు. ఇంటిముందు గోమయముతో అలుకుతారు. రంగురంగుల ముగ్గులు పెడతారు. గృహములకు బంధుమిత్రులు వస్తుంటారు. పేరంటాలకు ముత్తైదువలు వస్తుంటారు. కాళ్ళకు పసుపురాసుకొని, కళ్ళకు కాటుకపెట్టుకొని నుదుట

బొట్టుబెట్టుకొని, జడలో చేమంతిపూలు పెట్టుకొని, పట్టుచీరలు ధరించి, బంగారునగలు ధరించి వ్రతమాచరించు వారి ఇండ్లకు ముత్తైదువులు వస్తుంటే సాక్షాత్తు లక్ష్మీదేవే ఇంట్లోకి వస్తుందన్న భావన కలుగుతుంది. ముత్తైదువులు నట్టింటనడయాడుతుంటే లక్ష్మీకళ ఉట్టిపడుతున్నట్లుగా ఉంటుంది.

శ్రావణమాసమునందు మహిళలందరూ ఐకమత్యముతో కలిసిమెలిసి సరదాగా, ఉత్సాహముగా, ఉల్లాసముగా, పూజలు, పునస్కారములు, పేరంటములు మున్నగు వాటిలో పాల్గొంటు నెలరోజులు ఆనందముగా గడిపేస్తారు. వ్రతము రోజులలో బాలికలు చేతులకు క్రొత్త గాజులు, పట్టుపరికిణీలు ధరించి కళకళలాడుతూ లక్ష్మీదేవిలా మెరిసిపోతుంటారు. మహిళలు కూడా క్రొత్త చీరలు ధరిస్తారు క్రొత్త గాజులు వేసుకుంటారు. పేరంటము కొరకు వాళ్ళు నడుచుకుంటూ వెళ్ళుతుంటే గాజుల గలగలలతో, క్రొత్త చీరల రెపరెపలతో లక్ష్మీమాతవలే కన్పిస్తూ ఆనందమును కలుగజేస్తుంటారు. శ్రావణమాసమునందు మహిళలు అధిక ప్రాధాన్యమునిచ్చు వ్రతములలో ముఖ్యమైన మంగళగౌరీ వ్రతము, వరలక్ష్మీ వ్రతము. మంగళగౌరీవ్రతము పార్వతీదేవికి, వరలక్ష్మీవ్రతము లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన వ్రతములు. క్రొత్తగా వివాహమైనవారు మంగళగౌరీవ్రతమాచరించుటకు ఎదురుచూస్తుంటారు. కుటుంబ క్షేమము కొరకు సువాసినులు వరలక్ష్మీవ్రతమును ఆచరించుటకు ఎదురుచూస్తుంటారు.

శ్రావణమాసమునందు గృహస్థులు ఆనందముగా ఉంటారు. ప్రతిరోజు ఒక పండుగలాగా గడిచిపోతుంది. సోమవారము శివుడిని, మంగళవారము గౌరీదేవిని, శుక్రవారములు లక్ష్మీదేవిని, శనివారము శ్రీమహావిష్ణువును పూజిస్తుంటారు. ఒక్కొక్క దేవతకు కూడా పూజలు జరుగుతుంటాయి. పాడ్యమినాడు ధనదునికి, విదియనాడు శ్రియఃపతి, తదియనాడు పార్వతికి, చవితినాడు వినాయకునికి, పంచమినాడు శశికి, షష్ఠినాడు సుబ్రహ్మేశ్వరస్వామికి, సప్తమినాడు సూర్యభగవానునకు, అష్టమినాడు దుర్గామాతకు, నవమినాడు మాతృగణములకు, దశమినాడు ధర్మరాజుకు, ఏకాదశినాడు మహర్షులను, ద్వాదశినాడు చక్రపాణిని, త్రయోదశినాడు అనంగునకు, చతుర్దశినాడు శివునకు, పూర్ణమినాడు పితృదేవతలకు పూజలుగావించనట్లైతే మనోభీష్టాలు నెరవేరుతాయని శాస్త్రోక్తి.

**మంగళగౌరీవ్రతము :** మంగళగౌరీవ్రతమును మంగళవారపు నోము అని కూడా అంటారు. క్రొత్తగా వివాహమైన స్త్రీలు శ్రావణమాసమునందు ఎన్ని మంగళవారములు వస్తాయో అన్ని మంగళవారములు మంగళగౌరీవ్రతమును ఆచరిస్తారు. వ్రతమునాటకి నూతన వధువుకు అత్తగారు బంగారువస్తువులు తెచ్చుటనొక యాచాముగానున్నది. దీనినే శ్రావణపట్టీ అని అంటారు.

**శ్లో॥ వివాహాత్ ప్రథమంవర్షమారభ్యపంచవత్సరం**
**శ్రావణే మాసి భౌమేషు చతుర్షవ్రతమాచరేత్**
**ప్రథమవత్సరే మాతుర్గేహే కర్తవ్యమేవచ**
**తతోభర్తృ గృహేకార్యమవశ్యం స్త్రీభిరాదరాతో ॥**

వివాహమైన ప్రతిమహిళ ఐదుసంవత్సరముల వరకు ప్రతి మంగళవారము ఈ వ్రతమును ఆచరిస్తుంది. వివాహమైన తర్వాత వచ్చు మొదటి శ్రావణము మాతృగృహమునందు తరువాత నాలుగు సంవత్సరములు అత్తగారి గృహమునందు వ్రతమాచించాల్సివస్తుంది. మంగళవారమునాడు మంగళ గౌరిని పూజించి, మంగళవారపు కథను విని లేదా చదువుకొని, అక్షింతలు శిరస్సున ధరించి ఆ రోజు ఏకభుక్తముగా ఉంటారు.

**శ్లో ॥ మంగళం మంగళాధారే మాంగళ్యేమంగళప్రదే**
**మంగళార్థం మంగళేసిమాంగల్యం దేహిమేసదా ॥**

అంటూ సువాసినులు మంగళగౌరిని ప్రార్థిస్తారు. తమ భర్తలను దైవములుగా భావించి వారికి పాదాభివందనముగావిస్తారు. సాయంకాలము ముత్తైదువుల కాళ్ళకు పసుపురాసి, కుంకుమబొట్టు నుదుటనుబెట్టి, గళసీమయందు గంధముపూసి, కళ్లకుకాటుకనుబెట్టి వారి పాదములకు నమస్కరిస్తారు. ఆశీర్వాదపూర్వకముగా వారిచేత తమశిరస్సులమీద అక్షింతలు వేయించుకుంటారు. తర్వాత పూలు, పండ్లు, శనగలు, తాంబులము వాయనముగా ఇస్తారు. మంగళగౌరీవ్రతమును ఆచరించు సందర్భమునందు మొదటి సంవత్సరము అయిదుగురు, రెండవ సంవత్సరము పదిమంది, మూడవ సంవత్సరము పదిహేనుమంది, నాలుగవ సంవత్సరము ఇరవైమంది, అయిదవ సంవత్సరము ఇరవైఅయిదుమంది ముత్తైదువులకు వాయనములు ఇవ్వాలి. తదనంతరము పెండ్లి జరుగుతున్న అమ్మాయికి మట్టెలు, మంగళసూత్రములు, అరిసెలు చేయించి వాటిని క్రొత్త ఇత్తడిగిన్నెలో ఉంచి క్రొత్త వస్త్రముతో వాసెనగట్టి వాయనము ఇస్తారు. దీనిని ఉద్యాపన అంటారు.

**వరలక్ష్మీవ్రతము :** ఈవ్రతమును అందరూ చేయవచ్చును. శ్రావణశుక్ల పూర్ణిమకు ముందుగా వచ్చెడు శుక్రవారమునాడు వరలక్ష్మీవ్రతమును ఆచరిస్తారు. వరలక్ష్మీవ్రతమును ఆచరిస్తే అష్టైశ్వర్యములు,ఆయురారోగ్యాలు,అయిదవతనముకలకాలం ఉంటాయని భక్తుల విశ్వాసము. వరలక్ష్మీవ్రతమునాడు మహిళలు మంగళస్నానమాచరించి క్రొత్త వస్త్రములు ధరిస్తారు. ఒక మంటపమును ఏర్పాటు చేసి దానయందునొక



ఆసనమును ఏర్పాటు చేస్తారు. క్రొత్త బియ్యము దానిమీద పోసి పంచపల్లవములతో కలశమును ఏర్పాటుజేస్తారు. మేడి రావి, జువ్వి, మఱ్ఱి, మామిడి చిగుళ్ళను పంచపల్లవములని అంటారు. కలశముమీద నారికేళమును ఉంచి దానికి కళ్ళు ముక్కు చెవులు తీర్చి లక్ష్మీదేవిని ఆవాహనచేసి షోడశోపచారములతో పూజిస్తారు. తొమ్మిది సూత్రములుగల దారమును దక్షిణహస్తమునకు కడతారు. తరువాత వ్రతకథను చదవాలి లేదా వినాలి. కథ పూర్తి అయిన తరువాత లక్ష్మీదేవికి హారతినిచ్చి ముత్తైదువులకు ఫలములు పుష్పములు, కాటుక, తాంబులము ఇస్తారు. వ్రతమునాడు రాత్రి భోజనము చేయకూడదు.

**నాగపంచమి** : నాగపంచమి పుణ్యతమైనది. సద్గతిదాయిని. శ్రావణశుక్ల పంచమినాడు ద్వారమునకు ఇరువైపుల గోమయముతో సర్పాకారమును చిత్రిస్తారు. శాస్త్రోక్తిననుసరించి సర్పములను పూజిస్తారు. నాగపంచమినాడు భూమిని త్రవ్వకూడదు. నాగపంచమివాడు సర్పములను పూజిస్తే సర్పములవలన భయము ఉండదని భక్తుల విశ్వాసము.

**జంధ్యాలపూర్ణిమ** : జంధ్యాలపూర్ణిమనే ఉపాకర్మ అని కూడా అంటారు. ఈ రోజు జీర్ణమైన యజ్ఞోపలీతములను విసర్జించి నూతన యజ్ఞోపలీతములను ధరిస్తారు.

**రాఖీపండుగ** : రాఖీపండుగనే రక్షాబంధన్ అని కూడా అంటారు. ఈ పండుగ మహిళలకు చాలా ఇష్టమైన పండుగ. ఈ రోజునవారు తమ సోదరులకు రాఖీకట్టి సోదరులకు సుఖసంపదలు, ఆయురారోగ్యములు కలిగి ఆనందముగా జీవించాలని కోరుకుంటారు. సోదరులు రాఖీ కట్టిన సోదరీమణులను ఆశీర్వదించివారికి రక్షణగా మేము ఉన్నామని బలమైన విశ్వాసాన్ని కలిగిస్తారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటారు. బహుమతులు ఇచ్చుకుంటారు. సోదరసోదరీమణుల అనురాగబంధానికి ప్రతీక రాఖీపండుగ. రాఖీపండుగ శ్రావణశుక్ల పౌర్ణమినాడు వస్తుంది.

**కృష్ణజన్మాష్టమి** : శ్రీకృష్ణజన్మాష్టమినాడు శ్రీకృష్ణుడుని పూజిస్తారు. పగలు ఉపవాసం ఉండి రాత్రి సమయములో తులసీకోట దగ్గర దీపాలు పెడతారు. సాయంకాల సమయములో ఉట్టికొడతారు. ఉట్టికొట్టడానికి పిల్లలు, పెద్దలు, యువకులు అందరూ ఎంతో ఉత్సాహముతో పాల్గొంటారు.

**అశూన్యశయనవ్రతము:** ఈవ్రతము శ్రావణ బహుళ పాడ్యమి నాడు వస్తుంది. ఈవ్రతమును ఆచరించుటవలన మహిళలకు వైధవ్యం, పురుషులకు సతీవియోగం ఉండదు. అశూన్యశయనము అనగా భర్తలేకుండా భార్య, భార్యలేకుండా భర్త ఒంటరిగా శయనించకుండా ఉండటం. వ్రతము ఆచరించడానికి సంకల్పించుకున్నవారు వేకువజాముననే లేచి స్నానాదికములు ముగించుకొని లక్ష్మీవారాయణులను పూజించాలి. రోజంతా మౌనవ్రతమును పాటించాలి. సాయంకాలము తిరిగి స్నానమాచరించి లక్ష్మీనారాయణులను ఆరాధించాలి. చంద్రోదము తర్వాత అర్ఘ్యపాత్రలో జలం, పుష్పం, గంధం, అంక్షితలు ఉంచి క్రింద ఇవ్వబడనిన శ్లోకమును చదువూతూ అర్ఘ్యమివ్వాలి.

శ్లో ॥ "గగనాంగణ సందీపక్షీరాబ్ధిమథనోద్భవ
భాభాసిత దిగాభోగరమానుజానమోऽస్తుతే" ॥

అనగా క్షీరసాగర మథన సమయములో ఉద్భవించిన రమానుజా మీ ప్రకాశముతో దిశలన్నీ ప్రకాశవంతమయ్యాయి. మీరు గగనములో దేదీప్యమైనదీపము. రమానుజా! మీకు ప్రణామము. చంద్రుడు లక్ష్మీదేవికి అనుజుడు కాన లక్ష్మీదేవికి చాలా ఇష్టమైనవాడు. చంద్రుడిని ఆరాధిస్తే లక్ష్మీదేవి ప్రసన్నురాలవుతుంది. ఈవ్రతమును ఆచరించినవారికి సమస్త దాంపత్యసుఖాలు భోగాలు ప్రాప్తిస్తాయి.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## సుదర్శనోపాఖ్యానము

'మునీంద్రులారా! ఈరోజు మీకు ఒక చిత్రమైన ఉపాఖ్యానాన్ని వివరిస్తాను' అని సూతమహర్షి అనగానే అందరూ ఆయనవైపు ఆశ్చర్యంగా చూశారు. వారి ఉత్కర్షని గమనించిన సూతుడు అవును అగ్నిహోత్రుడి వివాహకథ వినసొంపుగా, విచిత్రింగా, గృహస్థాశ్రమ ధర్మబోధకంగా చక్కగా ఉంటుంది. వినాలన్న ఆత్రుతను తమ నయనాలలో కనబరుస్తూ శౌనకాదిముకులందరూ నిశ్శబ్దాన్ని పాటించారు. చెప్పటం మొదలుపెట్టాడు సూతమహర్షి.

ఒకప్పుడు మనువంశంలో దుర్యోధనుడనే మహారాజు జన్మించి, తన సద్గుణావళితో త్రిలోకవాసులు మెచ్చేటట్లు ప్రజారంజకంగా సమస్త భూమిని పరిపాలించాడు. మునులారా! ఈ దుర్యోధనుడు ధృతరాష్ట్రసుతుడైన దుర్యోధనుడు కాడు. ఆయన పాలనలో జనులందరూ తమ కోరికలన్నీ తీర్చే కల్పవృక్షము ఈ మహారాజని తమలో తాము చెప్పుకుంటూ పరమానందభరితులవుతుండేవారట! సద్గుణాలతో పాటు ఆయనను ఎనలేని సౌందర్యం కూడా వశం చేసుకొంది. ఆ మహారాజు యొక్క అతిలోకసౌందర్యానికి ముగ్ధురాలై నర్మదా నది, ఆయనను వివాహమాడాలన్న కోరికతో స్త్రీరూపం దాల్చి, ఆయన ముందు నిలిచి తన కోరికను వెల్లడించింది. దుర్యోధన మహారాజు కూడా నర్మదానది దాల్చి ఉన్న స్త్రీమూర్తిలోని లావణ్యానికి అబ్బురపడి, ఆనందపడి, ఇష్టపడి ఆమెను వివాహం చేసుకున్నాడు. గంగాదేవి ఏవిధంగా శంతన మహారాజును వివాహమాడిందో, నర్మాదాదేవి కూడా అదేవిధంగా దుర్యోధన మహారాజును వివాహమాడి సంతానాన్ని పొందింది. అయితే

నర్మద కథ ఎప్పుడో పూర్వకాలంలో జరిగిన ధర్మబోధకు నిలయమైన కథ.

**"ఆ రమణికి నతనికి క**
**న్యారత్నం బుద్భవించె నమర పురంధ్రీ**
**శ్రీరామణీయకము ని**
**స్సారంబగునట్లు గాగ జగతీనాథా!"**

**- 45వ ప్ర.ఆ. - అను.ప. - మ.భా.**

"సుందరీ మణిఅయిన నర్మదకు, దుర్యోధన మహారాజుకు ఒక చక్కని బిడ్డ పుట్టింది. తల్లిదండ్రుల నిద్దరినీ మించిన త్రిలోకసుందరి కావటంతో ఆ కన్య దేవతా స్త్రీల సౌందర్యాలనే క్రిందుపరిచేదిగా శోభించింది."

**"విను! దానికి పేరు 'సుద**
**ర్శన' యన్నరనాయకుండు సంప్రీతిమెయిం**
**బెనిచి, తన యగ్నిహోత్రం**
**బున పరిచర్యలకు బనిచె బుజ్జవమొప్పన్."**

**- 46 ప. – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

"ఆ దుర్యోధన మహారాజు తన కుమార్తెకు 'సుదర్శన' అనే పేరుపెట్టి అతిగారాబంగా పెంచుకోసాగాడు. సుదర్శన పెరిగి పెద్దదికాగానే ఆమెను అగ్నిదేవుడి పూజనిమిత్తం, అగ్నిశాలలో ఆ దిక్పాలకునికి పరిచర్యలు చేయమని నియోగించాడు. తండ్రివాత్సల్యంతో పెరిగిన సుదర్శన తండ్రిమాటలను శిరసావహించి, ఆయన చెప్పిన విధంగా అగ్నిదేవుడికి సమస్త పూజాకార్యాలను నిర్వర్తించసాగింది. అగ్నిశాలను పరమపవిత్రంగా ఉంచేది. ఆమె ధర్మానుచరణం, అగ్నిహోత్రుని మెప్పించింది. సుదర్శన సౌందర్యాతిశయం అగ్నిదేవునే అలరించి, అనురాగవంతుని చేసింది. ఆమె ఏ పని చేసినా అగ్ని ఆకర్షితుడయ్యేవాడు" అని చెప్పి సూతమహర్షి ఒక్కక్షణం ఆగాడు. వెంటనే శౌనకుడు లేచి –

"మహాత్మా! ఇది నిజమా! పంచభూతాలలో ఒకదేవుడైన అగ్ని, సుదర్శన పట్ల వలపుకు లోనైనాడంటే ఆశ్చర్యంగా ఉంది. అయితే ఆమె ఎంత సౌందర్యవతి అయి ఉంటుందో అన్న విషయం ఊహకు అందటం లేదు. తరవాత ఏమై ఉంటుంది? సుదర్శన అంగీకరించిందా? వారికి వివాహమైందా? చెప్పండి. కుతూహలంగా ఉంది" అని అనేటప్పటికి సూతమహర్షి "అందుకేకదా! చిత్రమైన కథ చెబుతానని చెప్పి ప్రారంభించాను. అగ్నిదేవుడు సుదర్శన పట్ల అనురాగపూరితుడైన విధం శృంగార రసావిర్భావానికి నాంది పలుకుతుంది.

**"అర్చించు నప్పు డయ్యంగన కెంగేలి**
**బిగిసొంపు, చిత్తంబు దిగిచికొనగ**
**నరసికగ్గొను నప్పుడయ్యింతి కనుగవ**
**పొలపంబు రాగంబు పొదల జేయ**
**నన్యుల పని పంచునప్పు డమ్ముద్దియ**
**పలుకుల తీపు కోరుల ౘగెరల్ప**
**నల్లన యూదెడునప్పు డక్కొమ్మ వా**
**తెఱతావి ధైర్యంబు త్రిప్పుకొలుప**
**మరుడు తోడ్తోడ తేకువమాలి కదిసి**
**తూపుగముల క్రొవ్వాడిమి సూపనంత**
**కంత కగ్గలమగు నలవంతతూలి**
**పోయె పావకు దేమి చెప్పుదు నరేంద్ర!"**

**- 48 ప. – ప్ర. ఆ. – అను.ప. – మ.భా.**

త్రిలోక సుందరి అయిన సుదర్శన తండ్రి ఆనతి ప్రకారం అగ్నిదేవుని శ్రద్ధాభక్తులతో ఆరాధించసాగింది. అగ్నిహోత్రుని సుదర్శన పూజిస్తుంటే అరుణారుణ కాంతిని విరజిమ్ముతున్న ఆమె వ్రేళ్లకాంతికి ఆ దిక్పాలకుడు ఎంతగానో ఆకర్షితుడైనాడు. అతని ఆకర్షణ అంతటితో ఆగలేదు. ఆయనకు పరిచర్యలు చేస్తూ ఆమె ఏకాగ్రచిత్తంతో ఆయన జ్వాలలను చూసినప్పుడు సుదర్శన నయనకాంతి అగ్నిలో అనురాగాన్ని అతిశయింపచేసింది. పరిచారికలకు ఆమె పనులు పూరమాయిస్తూ పిలిచే పలుకుల మాధుర్యం ఆయనలో కోర్కెలను ఇనుమడింపచేసి మరింత అనురక్తుని చేసింది. ఆమె అగ్నిని రగుల్కొల్పడానికి మెల్లగా ఊదినప్పుడు ఆమె అధరం నుండి వెలువడిన సువాసన అగ్నిలో అంతవరకు ఉన్న ధైర్యాన్ని సడలచేసింది. వీటికితోడు ఇదే సరైన సమయమని భావించిన మన్మథుడు అగ్నిని సమీపించి వాడి అయిన తన పంచబాణాలతో (పద్మం, అశోకము, మామిడి, నవమల్లిక, నల్లకలువలనే అయిదు పూలబాణాలతో) వేధించసాగాడు. మన్మథుడి పుష్పబాణాల ధాటికి తట్టుకోలేకపోయిన అగ్నిదేవుడు విరహవేదనతో కుమిలిపోయాడు. క్షణంలో ధైర్యాన్నంతటినీ కోల్పోయాడు. తన వలపును, కోర్కెను సుదర్శనతో ఎలా చెప్పాలా అని మథనపడసాగాడు. ఎంత ఆలోచించినా దారితెలియలేదు. ఎప్పుడు చూసినా ఆమె చుట్టూ పరిచారికలే. తన బాధ అంకంతకు ఎక్కువౌతున్నదేగాని తగ్గే సూచన ఏమాత్రం కనబడటం లేదు అగ్నిదేవుడికి. సమయం దొరకకపోతుందా అని ఆశపడసాగాడు. అర్చనలో తనపట్ల భక్తిని కలిగి ఉన్న ఆమె యందు మరింత అనురక్తిని పెంచుకున్నాడు. సర్వకాల సర్వావస్థలలోను ఆమె ధ్యాసతోనే కాలంగడుపుతుండటంతో తృప్తి పొందుతున్నాడు. అగ్ని, సుదర్శనతో మాట్లాడాలని వేచి చూస్తున్న క్షణం రానే వచ్చింది. సఖీ జనం ప్రక్కన లేకుండా సుదర్శన ఒక్కతే అగ్నిదేవుని అర్చిస్తోంది. ఇదే అదను అనుకొని తనమనోభావాన్ని సుదర్శనకు వ్యక్తం చేయాలని



భావించి అగ్నిదేవతారూపాన్ని ధరించి ఆమె ముందు నిలబడ్డాడు. అగ్నిదేవుని చూసిన సుదర్శన వెంటనే లేచి నిలబడి నమస్కరించింది. అగ్ని ఆమెను ప్రేమగా చూశాడు.

"కోమలీ! నీఅందం ఏలోకంలోని ఏ స్త్రీకి లేదు. హవ్యవాహనుడనైన నేను ప్రవేశించని ఏ ప్రదేశం ఉండదుగదా! అద్భుతమైన నీ సౌందర్యం నన్నులోగొన్నది. చిగురుటాకుల మెత్తదనాన్ని, అరుణకాంతులను తిరస్కరించి తనదైన సొగసును వెదజల్లే నీపాదశోభ నాచూపులను మరల్చలేకపోతోంది. లతల లావణ్యాన్ని ధిక్కరించే నీ తనూలత నాలో కోర్కలు నింపింది. పున్నమినాటి జాబిల్లిని వెక్కిరించే నీముఖ దీప్తి నాలోని ధైర్యాన్ని అణగద్రొక్కింది. మన్మధుడు నన్ను రకరకాలుగా వేధిస్తున్నాడంటే నమ్ము. నామాటలలోని వలపును నీవు గ్రహించలేవా? నీయందు నాకు గల ప్రేమ కల్మష రహితమైనది. అన్యమైన నా అనురాగాన్ని అర్థంచేసుకొని నాకు భార్యవుకావలసినదని మనఃపూర్వకంగా కోరుతున్నాను. నీ రాజ్ఞీత్వానికి ఏలోటు రాదు." అన్న అగ్ని మాటలకు సుదర్శనలో కొంచెం సిగ్గు చోటు చేసుకుంది. తలదించుకొంది. ఆయన మాటలు సుదర్శనలో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి. అయినా ఆత్రుతను దూరంచేసి, ముఖంపైకెత్తకుండా, కుటుంబ గౌరవాన్ని మదిలోతలచి, తన ఆభిజాత్యానికి ఏలోటూ రానీయకుండా సన్నని స్వరంతో అగ్ని వెలిబుచ్చిన కోర్కెకు సమాధానంగా తన అభిప్రాయాన్ని తెలియజేసింది. సుదర్శన ఉత్తమకన్య, ఉదాత్త గుణగణాలకు ఆటపట్టు. తల్లిదండ్రుల గౌరవానికి భంగం రానీయని ధర్మవర్తనగల విదుషీమణి.

**"కులకన్యకలకు వేడుక**
**తలవీడుల పరులతోడి తగుమాటలకుం**
**దలకొనతగునే? గురుజన**
**ముల కాకత్తెఱుగువారు పురుషార్థనిధీ!"**
**- 51 ప. – ప్ర.ఆ. – అను. ప. – మ.బా.**

"అగ్నిదేవా! నీవు ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను ప్రజలకు ప్రసాదించే దిక్పాలకుడివి. నీకు నేను ధర్మగుణం గురించి చెప్పేపాటి దానినా? అయినా నీవడిగినదానికి సమాధానం చెప్పటం నా విధి. కనుక నా అభిప్రాయం కూడా చెబుతాను. ఆలకించు మహాత్మా! సద్వంశ సంజాతలయిన కన్యలు గృహానికి ముఖద్వారం (తల వీడు) వద్ద నిలబడి పరులతో మనస్సుకునచ్చిన విధంగా మాట్లాడటం ఉచితమేనా? పెద్దవారు తలవాకిట నిలబడి ఎంతసేపయినా, ఎన్నిమాటలయినా మాట్లాడటం ధర్మబద్ధంగా సముచితమైన కార్యమని ఆర్యులంటారు. మీకోరిక మా తండ్రికి తెలియజేయటం సమంజసమని నా ఉద్దేశం." అని చెప్పి సుదర్శన మౌనం వహించింది. ఈ సందర్భం సుదర్శన జీవితానికే ఒక పెద్ద మలుపు, ధర్మానుసరణం, కన్య వర్తించవలసిన పద్ధతి, గృహస్థజీవన విధానం, ఆవేశానికి లొంగకపోవటం, చెప్పవలసిన విషయం నేరుగా కాక వ్యంగ్య విధానంతో తెలియజేయడం. సుదర్శన నడతలో కొట్టవచ్చినట్లు కనిపించే సద్గుణాలు. తనకభీష్టమైనా, ఆసంగతిని బహిర్గతం చేయకుండా 'నన్ను వివాహమాడాలనే తలపు నీకుంటే వెళ్ళి మా తండ్రినడగాలిగాని, నన్నడగుతావేమని అగ్నిదేవుని నిలదీస్తుంది. అక్కడ కులకన్యకుండవలసిన సల్లక్షణం తేటపరుస్తుంది సుదర్శన. సుదర్శన సమాధానం బాగా నచ్చినందుకు సంతోషించిన అగ్నిదేవుడు 'ఆ విధంగానే నీవు చెప్పినట్లే చేస్తానని మాటయిచ్చి అంతర్హితుడౌతాడు.

దుర్యోధన సార్వభౌముడు ఒక పెద్ద యజ్ఞం చేయాలని సంకల్పించి వేదవిదులైన బ్రాహ్మణోత్తములను పిలిపించి, వారందరినీ పూజించి దానాలిస్తుండటం చూసిన అగ్నిదేవుడు 'తాను కూడా వెళ్ళి, రాకుమారిని తనకు కన్యాదానంగా ఇవ్వమని అడగాలని నిశ్చయించి బ్రాహ్మణ వేషంలో మహారాజును సమీపించాడు. సుదర్శన కోరిక ప్రకారం దుర్యోధనునితో మహారాజపుత్రిక అయిన సుదర్శనను తనకు దానమివ్వవలసిందిగా కోరాడు. నాపట్ల దయచూపించాలి. నీ చేతులమీదుగా మా వివాహం జరిపించమని అర్థించాడు. దాన గ్రహీతగా పేద బ్రాహ్మణుడి రూపంలో వచ్చిన అగ్ని కోరిక దుర్యోధన మహారాజుకు నచ్చలేదు. తన కుమార్తె సుక్షత్రియ వంశ సంభూత. ఆమెను భార్యగా ఇమ్మని అడిగినవాడు

ఒక పేద బ్రాహ్మణుడు. కులమా సరిపోలేదు, స్థాయి సమకూడలేదు అటువంటప్పుడు తన కుమార్తెను ఆ పేదవాడికి అడిగినంతమాత్రాన ఇచ్చేయటమేనా? అసంభవం. ఇవ్వనుగాక ఇవ్వను అని అనుకొని అగ్నిదేవుడని తెలియక ఆయన కోరికను మన్నించలేదు మహారాజు. తన కోరిక విఫలంకావడంతో అగ్ని ఏమీమాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయినా ఆయన మనస్సు వేదననుంచి ఉపసంహరించుకోలేకపోయింది. తనకు శుభసమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడసాగాడు. ఆసమయం రానేవచ్చింది.

"మునులారా! దుర్యోధన మహారాజు ఒక మంచి యజ్ఞం చేయాలని తలపెట్టాడని చెప్పాగదా! ఆయజ్ఞకార్యం కోసమే ముందుగా దానధర్మ కార్యాలు చేసాడు. అప్పుడే అగ్నిహోత్రుడు బ్రాహ్మణవేషంలో మహారాజును కన్యాదానమిమ్మని అర్థించి తిరస్కరింపబడ్డాడు. ఆతరవాత మహారాజు యజ్ఞం చేయటం మొదలుపెట్టాడు. అదే అదననుకొన్నాడు అగ్ని. యజ్ఞం చేయాలంటే హోమద్రవ్యాలేకాదు, హోమాగ్నికూడా ఉండాలి గదా! యజ్ఞం జరగటానికి వీలు లేకుండా అగ్ని తేజోమయమైన తనజ్వాలలన్నిటినీ ఉపసంహరింపజేశాడు. దానితో అగ్నిని ఎంత ప్రజ్వరిల్లచేసినా మంటలు రాలేదు. అగ్నిమండకపోవడంతో యజ్ఞకర్త అయిన మహారాజు, యజ్ఞం చేయించే ఋత్విజులు ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయినారు. ఎందుకగ్ని మండటం లేదో ఎంత ఆలోచించినా వారికి అర్థం కాలేదు. మనం అవలంబించిన కర్మలో ఏలోపం వాటిల్లిందో అని బాధపడ్డారు. ఏంచేస్తే హోమాగ్ని జ్వలిస్తుందో అని ఆలోచించారు. ఋత్విజులు అంతకుముందు చెప్పిన మంత్రాని కన్నా గొప్పవైన మంత్రాలతో అగ్నిహోత్రున్ని స్తుతించారు. మరింత భక్తితో యజ్ఞకర్త పావకుని (అగ్నిహోత్రుని) స్తోత్రపాఠాలతో ప్రజ్వరిల్లమని ప్రార్థించాడు. అప్పటికి కొంతశాంతించిన అగ్నిదేవుడు ఋత్వికులకు మాత్రమే వినపడే విధంగా తాను రాజుకు, అతని కుమార్తెనిచ్చి వివాహం చేయమని అర్థించినా, దుర్యోధనుడు అంగీకరించలేదని, సుదర్శనను తనకు పత్నిగా సమర్పిస్తేనే తాను యజ్ఞ కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించగలనని చెప్పడంతో పరిస్థితినర్థం చేసుకొన్న ఆ ఋత్విజులు అగ్నిమండకపోవటానికి గల కారణాన్ని మహారాజుకు సవిస్తరంగా వివరించారు. అడిగినవాడు అగ్నిదేవుడని తెలియక తనవల్ల జరిగిన అపరాధమే ఈ అనర్థానికి కారణమని తెలుసుకున్న దుర్యోధనుడు తనను మన్నించమని వేడుకున్నాడు. తన కుమార్తెను దిక్పాలకుడైన అగ్నిదేవునికిచ్చి వివాహం చేయటంకన్న మహదదృష్టం ఇంకేముందని అగ్నిహోత్రుని స్తుతించాడు. వెంటనే వివాహం చేస్తానని మాట ఇవ్వడంతో అగ్నికూడా సంతోషస్వాంతుడైనాడు.

**"వారలా నృపుతో చెప్పగారవంబు**
**సంతసముత కొనగ నయ్యింతిలాఁడ్లి**
**సేస విప్రకుమారుడై చెన్నుమెఱసి**
**యగ్నివరియించె నచ్చెరువంద జనులు"**

**- 58 ప. - ప్ర.ఆ. - అను.ప. - మ.భా.**

గారాలకుమార్తె అయిన సుదర్శనను అగ్నిదేవునకిచ్చి అంగరంగవైభవంగా వివాహం చేసాడు దుర్యోధన మహారాజు. ఆ పెండ్లికి వచ్చిన జనులందరూ మహారాజు సంతోషాన్ని చూసి ముగ్ధులయ్యారు. మరొక విషయం. అగ్నిదేవుడు తన నిజస్వరూపంతో సుదర్శనను వివాహమాడలేదు. చూస్తున్నవారందరూ ఆశ్చర్యపోయేటట్లు, ఆ సుందరికి తగినట్లు సుందరాకారుడైన విప్రకుమారుడిగా మారి సుదర్శనను మహోత్సాహంతో వివాహమాడాడు అగ్ని. సుదర్శనాపావకుల వివాహం అత్యద్భుతంగా, అతిమనోహరంగా జరగడంతో కోరిక తీర్చుకున్న అగ్ని పరమానందంతో మామగారి కోరిక కూడా తీర్చడానికి సిద్ధమయ్యాడు. ఆదిలోనే ఆగిపోయిన యజ్ఞాన్ని సముజ్జ్వలంగా పూర్తిచేయడానికి అగ్నిదేవుడు పూనుకొని ప్రకాశించాడు. మిన్నంటుతున్న దేదీప్యమానమైన జ్వాలలతో కాంతిమంతుడై దర్శనమిచ్చాడు. యజ్ఞంలో వేల్చబడిన ద్రవ్యాలను స్వీకరించి హవిస్సులనన్నిటినీ ఆయా దేవతలకు అందించాడు. దుర్యోధన మహారాజు చేసిన మహోన్నత యజ్ఞాన్ని చూసి మానవులు, దేవతలు మహదానందభరితులైనారు. ఇక సుదర్శనపావకుల సంతోషానికి అవధులేలేవు. వారి మనోరథం ఈడేరటంతో నర్మాదా దుర్యోధనులు కూడా కృతకృత్యులైనట్లు భావించి తృప్తిచెందారు.

**"అనలునకు సుదర్శనకును**
**జనియించె నుదాత్త గుణవిశాలుండు, సుద**
**ర్శన నామధేయుఁడా నృపు**
**డనూన ధర్మమున దాల్చె నవనీభరమున్"**

**- 60 ప – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

అగ్నిదేవుడికి, సుదర్శనకు మహోన్నత సుగుణశీలుడైన 'సుదర్శనుడ'నే కుమారుడు జన్మించాడు. సుదర్శనుడు అత్యంత ధర్మవర్తనతో భూభారాన్ని వహించి ప్రసిద్ధి చెందాడు. మాతామహుని రాజ్యానికి అర్హుడై సకల ప్రజానురంజకంగా రాజ్యాన్ని పాలించి తనదైన ధర్మబుద్ధిని తన కుమారుడైన ఓఘవంతుడికి కూడా కలుగచేసి మాతాపితల ఆశయాన్ని నెరవేర్చాడు." అని సూతమహర్షి చెప్పడం ఆపడంతో మునులందరూ అగ్నిదేవుని మహిమను, శృంగారతత్వాన్ని, సుదర్శనధర్మగుణాన్ని అభివర్ణించుకొంటూ సూతునితో సహా ఆశ్రమాలకు నడకసాగించారు.

## శుకోపాఖ్యానము [చిలుక కథ]

సూతమహర్షి విష్ణునామ పారాయణ చేస్తూ రావటం గమనించిన శౌనకాది మునులందరూ లేచి నిలబడి వినమ్రంగా నమస్కించారు. ఆయన వేదిక మీద కూర్చున్న తరవాత తామూ కూర్చొని శ్రద్ధాళువులైనారు. సూతుడు వారిని చూస్తూ –

“నాయనలారా! ఈ రోజు మీకు ఒక్క నీతిభరితమైన కథ చెబుతాను. విని ఆనందిస్తారు. కాశీదేశంలో ఒక వేటగాడు నివసిస్తుండేవాడు. అతనొకనాడు వేటకని వెళ్ళి, అడవిలో అతడిని చూసి భయంతో పరుగెడుతున్న జింకమీద విషపూరితమైన బాణాన్ని ప్రయోగించాడు. పరుకెడుతుండడంవల్ల, ఆజింక బాణపు దెబ్బనుంచి తప్పించుకొంది. కానీ, ఆ బాణం వెళ్ళి ఫలపుష్పభరితమైన ఒక మహావృక్షాన్ని తాకింది. బాణపు విషం వల్ల చెట్టుమొత్తం మలమలామాడిపోయింది. ఒక పువ్వూ, ఒక పండు, ఒక ఆకూ, ఒక కాయ కూడా మిగలకుండా చెట్టు ఎండిపోయినదానిలా కనిపించింది. ఇక్కడ తెలుసుకోవలసని మహత్తరమైన ఒక విశేషముంది. అదేమంటే – ఆ చెట్టు తొర్రలో ఎప్పటినుంచో ఒక ధర్మజ్ఞాన సంపన్నురాలైన చిలుక కాపురముంటూ ఉండేది.

**“అది తరువు విడిచి పోవక**
**హృదయంబున భక్తి పేరినెండను గానిన్**
**చెదరక ధృతిమై నయ్యెడ**
**కదలక యుండె ననుజీవి గౌరవమెసగన్.”**

**- 152 ప. – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

ఇంతకాలం తనకాచెట్టు ఎంతో ఆశ్రయమిచ్చిందిగదా! అన్న గౌరవభావంతో చిలుక చెట్టుతొర్రను వదలి ఎక్కడకూ పోలేదు. ధైర్యం వహించి, ఆ చిలుక, చెట్టుపైన తనకుకలిగిన భక్తిభావంచేత ఎండకు, గాలికీ ఏమాత్రం చలించకుండా అక్కడే ఉండిపోయింది. ఆశ్రయమిచ్చిన వారిని, వారికి ఆపదకలిగినప్పుడు వదలివెళ్ళకూడదన్నదే చిలుక ఉద్దేశం. ఆ ఆలోచనతోనే తిండి దొరకకపోయిన ఆ చెట్టు తొర్రలోనే స్థిరంగా నిల్చి ఉంది. దేవేంద్రుడు అటువైపుగా వెళుతూ ఆ ఎండిన చెట్టునూ, చెట్టుతొర్రలో ఒదిగి కూర్చుని ఉన్న చిలుకను చూడడం తటస్థించింది. వెంటనే ఇంద్రుడు మనుష్యరూపాన్ని ధరించి చెట్టు వద్దకు వచ్చాడు. చిలుకను చూసాడు.

**“దాని యుదాత్త వృత్తము శతక్రతుదాత్మ నెఱింగి వచ్చి, బెం**
**డైనది యిమ్మహీజము మహాతరువుల్ ఫలవృద్ధి నొందియి**
**క్కాననానేకముల్ గలుగగా, నిటు లేటికి నిందు నిల్వనో**
**మానిచకీరమా!” యనియె మానుష భంగిక రూపమొప్పగన్**

**- 153 ప. – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

చిలుక మానసిక ప్రవృత్తినంతా మనసులో గ్రహించి, దాని వద్దకు వచ్చి దేవేంద్రుడు దానితో సంభాషించసాగాడు. అదీ ఒక మానవుడిగా వచ్చి, “ఓ చిలుక రాజా! నిన్ను చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ చెట్టుచూద్దామా అంటే బెండైపోయిందే. చెట్టులో ఎక్కడా పచ్చదనం అనేది కనబడడం లేదు. పూర్తిగా ఎండిపోయి ఉంది. ఈ అరణ్యములో బాగా కాంతులతో, పండ్లతో నిండి ఉన్న మహావృక్షాలు అనేకానేకం ఉన్నాయి కదా! ఆ చెట్లేవీ నీకు నచ్చలేదా? కాయగాని, పండుగాని, ఏదీ దొరకని ఈ చెట్టు నీకెలా నచ్చింది. ఎండిపోయిన ఈ చెట్టుతొర్రలో ఎందుకు నివసిస్తున్నావు? కారణంతెలియడం లేదు. నీ మనసులోని అభిప్రాయాన్ని తెలియజెబుతావా? తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంది.” అని అడిగిన ఆ మానవుని చూసి చిలుక గంభీరంగా తన ఉద్దేశాన్ని చెప్పసాగింది.

“మహేంద్రా! చెట్టు బాగా, చక్కగా పండి ఉన్నప్పుడు ఆశ్రయాన్ని పొంది, వాటిమీద నిలిచిఉండటం, ఎండిపోయినప్పుడు అవసరం తీరిపోయిందిగదా అని అనుకొని ఆ చెట్లను వదలి వెళ్లిపోవటం న్యాయమంటావా? అలాచేస్తే దానిని కృతఘ్నుత అని అనరా? నీవే చెప్పు.” అని చిలుక అనగానే దేవేంద్రుడాశ్చర్యపోయాడు. ఆహా! ఈ చిలుకు పూర్వజన్మ జ్ఞానం ఉన్నట్లుంది లేకపోతే నన్ను ఎలా తెలుసుకోగలిగేది? ఎంత ధర్మపరిజ్ఞానం లేకపోతే నాకీవిధమైన సమాధానం చెప్పగలుగుతుంది? అందుచేత ఉత్తమగుణాలు కలిగిన చిలుకకు మేలు చేకూరుస్తాను.

**“అని తలచి నీదు పలుకులు**
**వినిమెచ్చితి వరము గోరు విహగోత్తమ! నీ**
**వనిన, శుకంబు మహీజం**
**బునకుం బేరెలమి వేడె భూపవరేణ్యా!”**

**- 157 ప. – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

అని అనుకొన్న దేవేంద్రుడు ‘ఓ శుకరాజమా! నీ ఆలోచన, నీమాటలు ఎంతో గొప్పవి. నన్ను గుర్తించిన నీపూర్వజన్మ సంస్కృతిని సంతోషం నన్ను మెప్పించిన నీకు వరం ఇవ్వాలని ఉంది. నీకెం వరంకావాలో అది కోరుకో తప్పక ఇస్తాను.’ అని అనడంతో ఆచిలుకకు కలిగిన ఆనందం అంతాఇంతా కాదు. సాక్షాత్తు త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడే దిగివచ్చి తలకు వరమిస్తానని ప్రసన్నుడైనాడు. ‘అప్పుడా చిలుక ఏంవరం కోరిందో విన్నారా మునులారా?’ అన్న సూతుని చూసిన మునులు ‘మహాత్మా! ఏవరం కోరింది? స్వర్గవాసం ఇమ్మందా? భూలోకంలోనే చక్రవర్తిని చేయమని వేడుకొందా!’ అని ప్రశ్నస్తూ ఉత్కంఠకులోనైనారు!

“అవేమీ కాదు నాయనలారా! ఎండిపోయిన ఈ

మహావృక్షానికి పూర్వ స్థితిని కలుగజేసి నన్నానందింపజేయి మహేంద్రా!" అని వేడుకొంది.

చిలుక కోరిక మహేంద్రుని మరింత ఆనందింపచేసింది. 'ఆహా! ఈ చిలుక ధర్మబుద్ధి ఎంతగొప్పది? తనకొఱకు ఏమీ అడుగకుండా ఆశ్రయమిచ్చిన వృక్షం యొక్క మేలును కోరింది.' అని మనసులోనే తథాస్తన్నాడు.

**"అమరవల్లభుండు నమృతసేచనమున**
**భూజమునకు దొంటి పొల్పుకంటె**
**మిగులనెలమి సేసె మరియాశ్రితు లిట్ల**
**మనుతురధిపు కురుకుమార వర్య!"**

**- 158 ప. – ప్ర.ఆ. – అను.ప. – మ.భా.**

చిలుకను చూస్తూ దేవేంద్రుడు ఆ ఎండిన చెట్టుమీద అమృతం చల్లాడు. అంతే పూర్వంకంటే కూడా ఆ వృక్షం మహోన్నతంగా ప్రకాశించింది. ఆ చెట్టు అందం అక్కడకు వచ్చేవారిని ముగ్ధుల్ని చేయటమేకాకుండా అనేకానేక సంఖ్యలో పూవులను, కాయలను, పండ్లను, ప్రసాదిస్తూ అరణ్యంలోని అన్ని వృక్షాల కన్నా శ్రేష్ఠమైనదిగా విరాజిల్లింది. ఇంద్రుడిచ్చిన వరమంటే మాటలా మరి. చిలుకను సంతోషపరచి దేవేంద్రుడు అంతర్హితుడైనాడు. శౌనకాది మునులారా! ఇక్కడే ముఖ్యంగా మనం గమనించవలసిన విషయమేమిటంటే – చిలుక భావనా పటిమ ఎంతగొప్పదీ అన్నది. ఉత్తమమైన సద్గుణాలతో వ్యక్తిత్వాన్ని నిలుపుకొనే ఆశ్రితులు (ఆశ్రయించినవారు) తాము ఎవరిని ఆశ్రయించుకొని జీవిస్తున్నామో అన్న విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో పెట్టుకొని ఆశ్రయమిచ్చినవారికి మేలు చేకూరుస్తు, వారిని కాపాడుతూ ఉంటారు. అది ఒక్క చిలుక వర్తనమనే కాదు, రాజును ఆశ్రయించుకొని ఉండే వారంతా ఆ రాజు క్షేమాన్నే కోరుతూ ఆయనకు అండదండలుగా



ఉంటూ, ఆయనను కాపాడటమే ధ్యేయంగా ప్రవర్తించాలి. అలా ప్రవర్తిస్తేనే అటువంటి వారిని 'సరైన ఆశ్రితులు' అని అంటారు. మంచి ఆశ్రితులకు చిలుక తన సత్ప్రవర్తనతో చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. అని చెప్పటం ఆపాడు సూతమహర్షి.

మునులందరూ చిలుక చెప్పిన మాటలను మళ్లీమళ్లీ తలచుకొంటూ, ఆశ్రితుడైనవాడు ఏవిధంగా మసలాలన్న విషయాన్ని మనసులలో పదిలపరచుకొంటూ, గురువుగారికి నమస్కించి తమతమ ఆశ్రమాలకు పయనమైనారు.


# భక్తులకు విజ్ఞప్తి

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి 21వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాయుచున్న భక్తులు, వారి వారి జప పుస్తకములను పూరించి తేది 10–08–2023 వరకు మాకు చేరునట్లు పంపగలరని మనవి.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007. ఫోన్: 040-7175050**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

'సీతా నా భార్యగా వుండు అది అధర్మంకాదు. వద్దనకు. నాతోబంధం విధివశాన ఏర్పడింది. ఈ అనుబంధం శాస్త్రసమ్మతమే!

రాజులకు రాక్షసవివాహం శాస్త్రసమ్మతం. అది వనిత ఇష్టపడితే సరే. ఇష్టపడకపోతే అది నింద్యం. వివాహితురాలిని ఒక సాధ్వి. ఇష్టపడకపోయినా అపహరించటం అది శాస్త్రసమ్మతమనటం మహాపాపం. రావణుడు అధర్మపరుడు. ధర్మ విరుద్ధమైంది శాస్త్రసమ్మతం కానిది. వాడి దృష్టిలో ధర్మమే. అధర్మాన్ని ధర్మంగా చూడటం తామసలక్షణం కదా.

"సీతా! నీపాదాలు చాలా మృదువైనవి. నా తలలు తగిలేట్లు నమస్కరిస్తున్నాను. ఈ రావణుడు కామపీడితుడు. నీవశవర్తిని. నీ దాసుణ్ణి అనుగ్రహించు". పోగాలం దాపురించింది వాడికి. సీతమ్మ దక్కిందని వెర్రిలోపడ్డాడు. (తన జీవితంలో ఏ స్త్రీకి శిరసా నమస్కరించలేదు రాక్షసేంద్రుడు).

## హెచ్చరిక

వినింది రావణుని మాటలు ఒక గడ్డిపోచను తీసుకుంది సీత. తనకు రావణునికి మధ్యలో వుంచింది. నిర్భయంగా పలికింది. అదివాడికి ప్రత్యుత్తరం. 'రాక్షసుడా! నారాముడు ధర్మాత్ముడు ఆమహానుభావుని భార్యని నేను అధర్మానికి పాల్పడను. రాముడువస్తాడు శరవర్షం కురిపిస్తాడు. నీ మదం పోగొడతాడు. నీబలం అణుస్తాడు. నీ పరాక్రమం అంతంచేస్తాడు. సురాసురులతో చావు లేదన్నావు. రాముని చేత చావు తప్పదు. నీవు కొంతకాలమే వుంటావు. యూపస్తంభానికి కట్టబడుతుంది పశువు. అది బతికేది కొద్దికాలమే. నన్ను అపహరించావు. వశపరచుకోవాలనుకున్నావు. అది అసాధ్యం. నీవు చేసింది మహాపాపం. దాని ఫలితం నువ్వు, నీలంకా భస్మంకాక తప్పదు.

పద్మాల మధ్య హంస విహరిస్తుంది. గడ్డిలో తిరిగుతుంది నీటికాకి. దాన్ని కన్నెత్తి చూడదు హంస. ఈ శరీరం ఒక జడపదార్థం. నీవు బంధించినా సరే, భక్షించినా సరే నాకు బాధలేదు. శరీరాన్ని కాపాడుకోవాలి. ప్రాణాల్ని రక్షించుకోవాలి. ఆ తపన లేదు నాకు. నేను నిందల పాలు కాను. కళంకం తెచ్చే పనులు చేయను.'

**యథా వినోభూతానాం దృశ్యతే కాలచోదితః ।**
**తదా కార్యేప్రమాద్యంతి నరాః కాలవశం గతాః ॥**

"పోగాలం దాపురిస్తే కాలవశులవుతారు దుష్కృత్యాలు చేస్తారు. నన్ను అవమానించావు, అపహరించావు. నీకు —

నీరాక్షసులకి అది మరణము కలిగిస్తుంది. అది తెలియదు నీకు కావున తెల్సుకో."

అనిపరుషవచనాలు, విన్నాడు రాక్షసరాజు. కోపంతో వళ్ళు కంపరం పుట్టింది. జవాబు చెప్పలేకపోయాడు, భయపెడుతున్నాడు. "మైథిలీ విను, నీకు పన్నెండు నెలలు గడువు ఇస్తున్నాను. ఈలోగా మనసు మార్చుకో. నాకు సుముఖురాలివి కావాలి. కాలేదా, నావంట వాళ్ళున్నారు. ఏంచేస్తారో తెలుసా, నిన్ను ముక్కలు ముక్కలుగా నరుకుతారు. వండుతారు. అది నా ప్రాతఃకాల భోజనమవుతుంది" అన్నాడు.

రావణుడు నరమాంసభక్షకుడు కాదు. నరమాంసం తిన్నట్లు శ్రీరామాయణంలో లేదు. వాల్మీకి ఎక్కడా చెప్పలేదు. మరి ఆమాట ఎందుకు అన్నట్లు. అంటే కేవలం సీతాదేవిని భయపెట్టటానికే. అలాగైనా తనకి లోబడుతుందని వాడి ఆలోచన.

సీతమ్మని వెతుకుతున్నాడు హనుమంతుడు. రావణ మందిరం చూసాడు. భోజనశాలలోకి వెళ్ళాడు అక్కడ నానావిధ జంతుమాంసాలున్నాయి. నరమాంసం వున్నట్లు వర్ణించలేదు వాల్మీకి.

## అశోకవనం

రాక్షస స్త్రీలను చూసాడు రావణుడు. 'ఈ సీతను అశోకవనం చేర్చండి. ఏమాత్రం ఏమరుపాటు పడకండి. భయంకర రూపాలు ధరించండి. రక్తం తాగుతు వుండండి. మాంసం తింటూ వుండండి. సీత గర్వం అణచండి. నయానభయాన చెప్పండి. మచ్చికచేసుకొండి. నాదారికి తీసుకురండి'.

అది రాజాజ్ఞ, సీతను తీసుకువెళ్ళారు, అశోకవనం చేర్చారు. అక్కడ ఋతుభేదం లేదు. నానావిధ ఫలవృక్షాలున్నాయి. సర్వకాలాల్లో అన్ని రకాల పూలు పూస్తాయి. అన్ని రకాల కాయలుకాస్తాయి. అన్ని రకాల పండ్లు పండుతాయి.

ఆ వనంలో చుట్టూ రాక్షస స్త్రీలు. మధ్యలో జనకరాజ పుత్రిక, పెద్దపులుల మధ్య జింకలా వుంది. తాళ్ళతో కట్టిన ఆడు జింక వుంది. ఆ రాక్షసాంగనలు వికృతరూపాలు ధరించారు. గుడ్లురిమి చూస్తున్నారు. బిక్కుబిక్కుమంటూ వుంది జానకి. రాముణ్ణి స్మరిస్తూ వుంది.

ఎంత బంగారు లంక అయినా కళ్ళుచెదిరే ఐశ్వర్యం వున్నా రత్నాలు వజ్రావైఢుర్యాలు తాపిన ఆభరణాలున్నా, రావణుడు ఎంత ఆశ చూపినా ఆకర్షితురాలు కాలేదు జనకరాజ పుత్రిక. అది భౌతికపరమైన ఐశ్వర్యం, అశాశ్వతం. భక్తిప్రపత్తులు భగవన్నామ స్మరణం. అది భగవత్ పరమైన ఐశ్వర్యం, శాశ్వతం అదే మైథిలి దృష్టి. అందుకే విముఖత చూపిందామె.

రామధ్యాన నిమగ్నమైంది. పశువులు, పక్షులు మృగాలు ఏరోజుకి ఆరోజు ఆహారం సంపాదించుకుంటాయి. తృప్తిపడతాయి. రేపటికి దాచుకోవు. మరి మనిషి ఎంతో సంపాదిస్తాడు అది చాలక అక్రమంగా ఆర్జిస్తాడు, ఆస్తిపాస్తులు కూడబెడతాడు. అయినా తృప్తిపడడు ఇంకా సంపాదించాలని ఆరాటం, తపన. రాత్రిళ్ళు నిద్రపట్టదు. దొంగలువస్తారేమో దోచుకుంటారేమో అధికారులు వస్తారేమో సోదా చేస్తారేమో భయం భయం బతుకంతా భయం. ఉన్నదాంతో తృప్తిగా బతికేవారు నిరంతర భగవన్నామ స్మరణం సాగించేవారు అరుదు. వాళ్ళు భయరహితులు ధన్యజీవులు.

## ఆందోళన

అక్కడ మారీచుణ్ణి చంపాడు. రాముడు వెనక్కి తిరిగాడు. మరో జింకను చూసాడు. చంపాడు. దాని మాంసం తీసుకున్నాడు. ఆశ్రమంవైపు నడిచాడు. వెనక నుంచి నక్క కూత వినిపించింది. అది అశుభంగా తోచింది రామునికి. మారీచుడు తనగొంతు అనుకరించాడు. సీతాలక్ష్మణులేమైనారో. మైథిలి ప్రేరేపించిందేమో, తమ్ముడు నాకోసం వస్తున్నాడేమో, ఇది రాక్షసమాయ. సీతను చంపాలని పన్నాగం కాబోలు. జింకను చంపి మాంసం తీసుకోవడం కొన్ని ప్రతుల్లో లేవు. ఆ శ్లోకం ప్రక్షిప్తమా? ఐవుండొచ్చు అని వ్యాఖ్యాతలు చెప్పలేదు.

మృగాలు వచ్చాయి రాముణ్ణి చూసాయి. పక్షులు వచ్చాయి పైన తిరుగుతున్నాయి. అవన్నీ అప్రదక్షిణంగా తిరుగుతున్నాయి. భయంకరంగా అరుస్తున్నాయి. వ్యాకులచిత్తుడైనాడు రాముడు. నడక వేగం పెంచాడు అంతలో ఎదురుగా లక్ష్మణుడు ముఖంలో కాంతిలేదు. విషాదరేఖలు నుదుటిమీద పరుగులిడుతున్నాయి. చూసాడు రాముడు. తమ్ముని చేయి పట్టుకున్నాడు. "సీతనెందుకు వదిలిపెట్టి వచ్చావ్? చేయకూడని పని చేసావు. దుర్నిమిత్తాలు గమనించావా? ఇదంతా రాక్షసులపని. మైథిలి బతికి వుంటుందా? మనం చూడగలమా? రాక్షసులు ఎత్తుకు పోయారేమో? ప్రశ్నలవర్షం. రామునిలో దుఃఖం, భయం, ఆందోళన. సీత దూరమైతే భరించలేడు రాముడు అతని ఆ ఆవేదనని 10 శ్లోకాల్లో వర్ణించారు వాల్మీకి.

మళ్ళీ అంటున్నారు రాముడు "సీతను ఒంటరిదాన్ని చేసావు. నీది తప్పు. నరమాంస భక్షకులు రాక్షసులు. సీతని చంపి తినివుంటారు. అయ్యో ఇది నా తలరాత. శోకంలో మునిగాడు లక్ష్మణుని మందలించాడు. నిట్టూర్చాడు. దిక్కుతోచలేదు. తమ్మునితో పర్ణశాల చేరాడు రాఘవుడు. కనపడలేదు సీత. పరిసరాలన్నీకలియచూసాడు. జానకిలేదు చింతాక్రాంతుడైనాడు.

శ్రీరామాయణంలో దుర్నిమిత్తాలున్నాయి. అపశకునాలున్నాయి. సీతారాముల వివాహమైంది అయోధ్యకు తిరుగు

ప్రయాణం. పక్షులు జంతువుల కూడా ప్రదక్షిణంగా తిరిగాయి. శుభాశుభాలగూర్చి వసిష్ఠుడు వివరిస్తాడు. అవి పరశురాముని రాకపరంగా కనిపించాయి. ఖరుని మరణాన్ని సూచిస్తూ అశుభాలు వర్ణించబడ్డాయి. ఇపుడు రామునికి దుర్నిమిత్తాలు కనిపించాయి. రామసుగ్రీవుల మైత్రి సందర్భంలో – అశోకవనంలో సీతకి ఎడమకన్ను అదిరింది. రావణునికి ఎడమకన్ను అదిరింది. వానరసైన్యం కూడదీసారు. లంకకు దండయాత్రకు బయల్దేరారు. రామలక్ష్మణులకు శుభనిమిత్తాలు కనిపించాయి. ఇక్ష్వాకుల నక్షత్రం విశాఖ. అది ప్రకాశిస్తోంది. రాక్షసుల నక్షత్రం మూల. దాన్ని తోకచుక్క ఆక్రమిస్తోంది. సీతరాకతో లంకలో ఎన్నో అశుభసూచికలు. విభీషణుడు ఏకరవుపెడతాడు. జటాయువు కొనవూపిరిలో వున్నాడు. సీత దొరుకుతుందని చెబుతాడు రామునికి. అప్పటి నక్షత్రాన్ని బట్టి చెబుతాడు దాన్ని ప్రశ్న చెప్పడం అంటారు కొందరు. రావణుడు యుద్ధానికి బయలుదేరాడు అపుడెన్నో దుర్నిమిత్తాలు. అవి అతనికి మరణాన్ని సూచిస్తాయి.

శ్రీరామాయణంలోనే కాదు మహాభారతంలో కూడా అపశకునాలు వర్ణించబడ్డాయి. తుమ్ములు కూడా శుభాశుభాల్ని తెలుపుతాయంటారు. ఆ తుమ్ముల మాట వాల్మీకి వ్యాసుడు చెప్పలేదు. అలాగే జ్యోతిషం, హస్తసాముద్రికం ఉటంకించబడ్డాయి శ్రీరామాయణంలో. సీతకు వనవాస యోగం వుందని జ్యోతిష సాముద్రిక శాస్త్రాలు చెప్పాయి. హస్తసాముద్రికల లక్షణాలను రాముని విషయంగా సీతమ్మకి వివరిస్తాడు హనుమంతుడు. అది సుందరకాండలో వస్తుంది.

రామాయణ భారత కాలాల్లో ప్రజలు వాటిని నమ్మేవారని తెలుస్తోంది. ఈనాడు కొందరు వాటిని మూఢనమ్మకాలంటున్నారు. కొందరు నమ్ముతున్నారు.

## పరితాపం

ఆశ్రమంలోకి వచ్చారు రామలక్ష్మణులు. కృష్ణాజినాలు ధర్మాసనాలు యథాస్థానంలో లేవు. సీత తప్పించుకోవాలనుకుంది. పీటలు, చాపలు చెల్లాచెదరైనాయి బయటికి వచ్చారు. నీళ్ళకోసం గోదావరికి వెళ్ళిందా పూలకోసం పోయిందా వెదకసాగాడు రాముడు. సీత కనిపించలేదు. కనులు ఎర్రబడ్డాయి. పిచ్చివానిలా వున్నాడు. చెట్టుని పుట్టని అడుగుతున్నారు. సీతను చూసావా – కదంబవృక్షాన్ని అడిగుతు బిల్వవృక్షాన్ని అడిగాడు. ప్రతి వృక్షాన్ని అడిగాడు. జింకల్ని అడిగాడు ఏనుగుని అడిగాడు పెద్దపులిని అడిగాడు, అడుగుతున్నాడు వెదుకుతున్నాడు.

సీత నా ప్రేమపెన్నిధి. చూసావా అని లక్ష్మణున్ని అడిగాడు రెండు భుజాలు గట్టిగా పట్టుకున్నాడు. ఊపాడు. తమ్ముణ్ణి కూడా గుర్తుపట్టలేదు రాముడు. ఎవరో అనుకున్నాడు. ఉన్మత్తుడైనాడు రాముడు అన్నారు వాల్మీకి. రాముని విరహం పరితాపం 63 శ్లోకాల్లో వర్ణించాడు వాల్మీకి.

లక్ష్మణస్వామిఅడవిఅంతాజల్లడపట్టాడు.సీతకనిపించలేదు. తిరిగి తిరిగి వచ్చాడు రాముణ్ణి చూసాడు. దుఃఖోపశమనం కోసం అంటున్నాడు. "రామా! వదినెక్కడికెడుతుంది? ఈ వనమంతా వెదుకుదాం. ఇద్దరం వెళ్దాం పదా, నీవు ప్రాజ్ఞుడివి. అన్నీ తెల్సునీకు. సీతనెవరైనా అపహరిస్తే – వాణ్ణి చంపేస్తావు. దిగులుపడకు. రా పోదాం. వెదుకుదాం. అని సౌమిత్రి ఓదార్పు.

తమ్ముని మాటలు చెవికి ఎక్కలేదు. వెక్కివెక్కి ఏడ్చాడు. చేష్టలుడిగిపోయాయి. దీనుడైనాడు. నిట్టూర్చాడు. చతికిలపడ్డాడు. కన్నీళ్ళు కార్చాడు. 'ప్రియ సీతా' అన్నాడు. తెలివితప్పారు. కాసేపటికి తెలివిలోకి వచ్చాడు అంటున్నాడు.

"లక్ష్మణా! సీతకు తోడువున్నావు. ఆ ధైర్యంతో వెళ్ళాను. నీవెందుకు వచ్చావు. సీతను ఏకాకిని చేసావెందుకు నీది ముమ్మాటికి తప్పు."

అంతకుముందు వదినె నిందించింది. బాధపడ్డాడు. భరించాడు. ఇపుడు అన్న మందలించాడు. భరించాడు. "అన్నా నాకై నేను వడిచి రాలేదు. మారీచుని కేక వినింది. అది రాముని గొంతు అంది. కాదన్నాను నేను. రామునికి ప్రమాదం పోవా అంటూ దారుణంగా మాట్లాడింది. వ్యధచెందకు, కలవరపడకు, రాముడు అజేయుడు. ఎంతో ధైర్యం చెప్పాను. నాది పాపబుద్ధి అట. సీతను పొందాలనుకున్నానట. అందుకే వనాలకి వచ్చానట. విన్నాను ఆ మాటలు. ఓర్చుకో లేకపోయాను. వదినెను వడిచివచ్చాను."

విన్నాడు రాముడు. 'నా ఆజ్ఞ అతిక్రమించావు చాలా తప్పు చేసావు' అన్నాడు మళ్ళీ "నిన్ను నిందించి లాభంలేదు. తమ్ముడా! నేను పాపాత్ముణ్ణి. ఈలోకంలో నాలాంటివాడు మరొకడు వుండడు".

**శోకేన శోకేహి పరం పరాయా**
**మామేతి భిందన్ హృదయం మనశ్చ॥**

"శోక పరంపరలు నన్ను వెంటాడుతున్నాయి. నా హృదయాన్ని ముక్కలు చేస్తున్నాయి మనసు వికలమవుతోంది. పూర్వజన్మలో పాడుపనులు చేసి వుంటాను. దాని ఫలితం ఇది, రాజ్యం పోయింది. అయినవాళ్ళు దూరమైనారు. తండ్రిని పోగొట్టుకున్నాను. తల్లి దూరమైంది. ఇపుడు సీతా వియోగం సమిధల వల్ల అగ్ని ప్రజ్వరిల్లుతుంది. కష్టాలతో దుఃఖం పెల్లుబికి వస్తోంది" – అంటూ విలపించాడు రాముడు. ఆకాశానికేసి చూసాడు. "సూర్యుడా కర్మసాక్షివి కదా, మంచిచెడులు

తెలుస్తాయి నీకు. సీత ఎటువెళ్ళింది? ఎవరు అపహరించారు చెప్పవా! పుణ్యం వుంటుంది నీకు. వాయుదేవుడా! సర్వవ్యాపివి నీవు లోకంలో జరిగేవన్నీ తెల్సునీకు. నా జానకి ఏమైంది? ఎవరైనా ఎత్తుకెళ్ళారా? చెప్పవా?"

పరిస్థితి చూసాడు లక్ష్మణస్వామి ధైర్యాన్ని నూరిపోసాడు. ఎన్నో మాటలు చెప్పాడు. నిరాశపడవద్దాన్నాడు.

**"ఉత్సాహవంతో హి నరా న లోకే**
**సీదంతి కర్మస్వతి దుష్కరేషు"**

"లోకంలో వుత్సాహవంతులుంటారు. కష్టకాలం వస్తోంది. కుంగిపోరు. అలా నీవు కుంగిపోవద్దు. వెదుకుదాం. లే కష్టాల్ని ఎదుర్కొందాం. ధైర్యం తెచ్చుకో. దుఃఖించకు" అన్నాడు

లక్ష్మణుడు వనమంతా వెదికాడు. గోదారితీరమంతా వెదికాడు. అయినా స్వయంగా వెళ్ళాడు రాముడు. 'గోదావరి సీత ఎక్కడుంది? చూసావా? ప్రశ్నించాడు. గోదావరి పలకలేదు. వనదేవతలు మిన్నకున్నారు. సర్వభూతాలు మౌనం వహించాయి. కారణం రావణుడంటే భయం. వాడు భయంకరుడు, క్రూరుడు, దుర్మార్గుడు. వైదేహి గూర్చి చెప్పలేదు.

కొన్నివేల కి.మీ. దూరంలో వుంది లంక. దశగ్రీవునికి భయపడింది గోదావరి నది. మధుర పక్కన వుంది యమునానది. కంసునికి భయపడలేదు. చిన్ని కృష్ణునితో వస్తున్న వసుదేవునికి దారి ఇచ్చింది. అంటే కంసునికంటే మహా భయంకరుడు రావణుడు అని చెప్పాలి.

## అడుగుజాడలు

"లక్ష్మణా! అటుచూడు ఆ మృగాల్నీ చూడు. కన్నీరుకారుస్తున్నాయి. మాటమాటకి నా వైపు చూస్తున్నాయి." అన్నాడు. "సీత జాడను చెబుతారా" అడిగాడు. అవి దక్షిణదిశకు చూసాయి. అటుకేసి పరుగెత్తాయి. ఆకాశాన్ని చూసాయి. పైకెగిరాయి. వెనక్కి తిరాగాయి. రాముణ్ణి చూసాయి. సూక్ష్మగ్రాహి లక్ష్మణస్వామి అంటున్నారు "అన్నా! సీత పోయిన దారి చెబుతున్నాయి. దక్షిణంవైపు పోదాం. నైరుతిలో రాక్షసులుంటారు. వెదకుదాం సీత దొరకవచ్చు."

వేగంగా నడిచారు ఇద్దరు. కొంతదూరం పోయారు. ఆగాడు రాముడు "సౌమిత్రీ! కింద పడ్డ పూలు చూడు ఇవి సీతవే వాడిపోలేదు. ప్రస్తవణగిరిని చూసారు. 'సీతను చూసావా' అడిగాడు. కొండ బదులు పలకలేదు వళ్ళుమండింది. "నీ శిఖరాల్ని ధ్వంసం చేస్తాను" ఆవేశంతో అరిచాడు.

నదికి కొండకి మధ్యభాగమది. పెద్దపెద్ద అడుగులు కనిపించాయి. చిన్న పాదముద్రలు కనిపించాయి. ఒకటి రాక్షసునిది మరొకటి మైథిలిది. గమనిస్తూ నడిచారిద్దరు. కొద్దిదూరం పోయారు. ఆగారు. ముక్కలైన ధనుస్సు, అమ్ముల పొదలు, చిన్నాభిన్నమైన రథం. తునకలైన బంగారు నగలు. చచ్చివున్న కంచరగాడిదలు, తెగిన కవచం, చేతిలో కొరడా వుంది. సారథి శవం, పొడుగాటి బాణాలు, నెత్తురు చుక్కలు. మైథిలి కోసం ఇద్దరు యుద్ధం చేసారు. రాజీపడ్డారు. సీతను చంపారు. పంచుకుని తిన్నారు. అలా ఆలోచించాడు రాముడు.

"తమ్ముడా! నేను లోకహితార్థిని. జితేంద్రియుణ్ణి. నన్ను చేతకాని వాణ్ణిగా తలచారు. గుణవంతులుగా వుండడం దోషమైంది. ఇపుడు నా బలం నా పరాక్రమం నా తేజం చూపిస్తాను. పర్వతాల్ని పడగొడతాను, సముద్రాల్ని ఇంకింపచేస్తాను, చంద్రుణ్ణి కదలనీయను. అగ్ని చల్లబరుస్తాను. జలాన్ని ఎండగొడతాను. వాయువు ఆపేస్తాను. గ్రహసంచారం నిరోధిస్తాను. అస్త్రశస్త్రాలు ప్రయోగిస్తాను. జగత్తుని నిలిపేస్తాను. ఆకాశాన్ని కప్పేస్తాను. ముల్లోకాల్లో ఒక్కడు తిరగలేడు. సర్వప్రాణుల్ని అంతం చేస్తాను. సీతని నాకు అప్పగించాలి. లేకపోతే ప్రళయకాల స్థితి కల్పిస్తాను." అది రోషతామ్రాక్షుడైన రాముని ఆగ్రాహావేశం.

రామునికి కోపం రావడం ఆరుద్ర రూపం చూడటం సౌమిత్రికి అదే మొదటిసారి భయపడ్డాడు. నోరు ఎండిపోయింది. చేతులు జోడించాడు. నెమ్మదిగా అంటున్నాడు. "రామా! నీవు సర్వభూతహితుడవు. జన్మతః మృదుస్వభావివి. నీ మహోగ్రరూపం ఇప్పుడే చూస్తున్నాను. సూర్యునికి తేజస్సువుంది. భూమికి క్షమాగుణం వుంది. పంచభూతాల గుణాలన్నీ నీలో మూర్తీభవించివున్నాయి.

అన్నా! నిరపరాధుల సంహారం సముచితం కాదు. ఒక్కడు చేసిన పనికి లోకాన్ని నాశనం చేస్తావా? నీవు సర్వప్రాణి శరణ్యుడవు. పరమగతి నీవే, సీతను అపహరించినవాడెవడో వెదుకుదాం. దండకారణ్యంలోని మునులు మనకు తోడు. నేను ధనుర్బాణాలు ఏరుతాను. నీవెంట వుంటాను. దురాత్ముణ్ణి పట్టుకుందాం. మొదట సామోపాయం, కుదరకపోతే దండోపాయం ప్రయోగిద్దాం. దేవతలు నీ భార్యని ఇవ్వకపోతే – ప్రళయం సృష్టించు. కాదనను." అని లక్ష్మణస్వామి అనునయ పలుకులు.

కృష్ణస్తు భగవాన్ స్వయం – సాక్షాత్తు పరమాత్మ. ఆ స్వామిలో సౌలభ్య పరత్వగుణాలున్నాయి. గోపగోపికలతో ఆడాడు పాడాడు. అది సౌలభ్యగుణం. పూతన మొదలు దుష్టసంహారం చేసారు. విశ్వరూపం ప్రదర్శించారు. అది పరత్వానికి నిదర్శనం. లీలామానుష విగ్రహుడన్నారు కృష్ణుణ్ణి.

గుహుడు బోయవాడు. సుగ్రీవహనుమలు వానరులు. విభీషణుడు రాక్షసుడు. జటాయువు పక్షి. రాముడు అందరితో

కలిసిమెలిసి తిరిగాడు. అది సౌలభ్య సౌశీల్యాలకి పెట్టింది పేరు. ఒక్కోసారి బాహ్యంగా మరోసారి అంతర్లీనంగా తను నారాయణుడని తెలియచేసాడు. అది పరత్వానికి దృష్టాంతం మాయామనుష విగ్రహుడన్నారు రాముణ్ణి.

సంపూర్ణ మానవునిగా పుడతాను, రావణుని సంహరిస్తాను. అది వాగ్దానం, దేవతలకి ఇచ్చినమాట. అందుకే దశరథపుత్రునిగా అవతరించాడు. సీత కనిపించలేదు. ఒక సామాన్య మానవునిలా బోరున ఏడ్చాడు. దుఃఖించాడు. విలపించాడు. కష్టాలనుభవించాడు. అదంతా 63 శ్లోకాల్లో వర్ణించాడు వాల్మీకి. కష్టాలకి కుంగి పోలేదు. కుమిలి పోలేదు. గుండెనిబ్బరం తెచ్చుకున్నాడు. ధైర్యంగా నిలిచాడు. పరిస్థితుల్ని ఎదుర్కొన్నాడు. అది నరుని రూపంలోని నారాయణుకని తోచదు మనకు. రామునితో పాటు మనం ఏడుస్తాం. రామునిలా కష్టాల్ని ఎదుర్కోవాలని నేర్చుకుంటాం. అదే శ్రీరామాయణం ద్వారా వాల్మీకి మనకు చెప్పదలిచింది. కష్టాలు మనిషికి కాక మానులకివస్తాయా అని సామెత. నూరుశాతం నరునిగా రాముడు చిత్రీకరింపబడ్డాడు.

★★★

# స్మరణే ముక్తికి తోవ

**- అవధానుల శ్రీనివాస శాస్త్రి**

'మనసు, మాట, చేత' ఒకటిగా చేసుకుని అంతర్యామి పట్ల నిరతిశయమైన భక్తి కలవాడే పరమ భాగవతుడు అనిపించుకోవడానికి అర్హుడు' అని భాగవతం చెబుతోంది. భగవద్దత్తమైన ఈ జన్మను సార్థకం చేసుకునే మార్గాన్ని పరీక్షిత్తుకు చెప్పిన సందర్భంలో శుకుడు ఎన్నో వివరణలు ఇచ్చాడు.

భగవంతుడి ఉనికి గురించి చెబుతూ (ద్వితీయ స్కంధంలో) 'అంతర్యామి అఖిల భూతాల్లో ఆత్మరూపుడై ఉంటాడు' అని స్పష్టంగా చెప్పాడు. అంటే అందరిలోనూ దైవాంశ ఉంటుదన్నది దీని భావం. దాన్ని వెలికితీయగలిగే ప్రయత్నం ఎవరికివారే చేయగలిగితే, అందరూ భగవత్స్వరూపులే అవుతారు. దానికి తగిన మార్గస్థాయిలను చెప్పారు భాగవతకర్తలు. అంతర్యామిని నిస్వార్థంగా సేవించేవాడికి ఇహలోక సౌఖ్యాలపట్ల విరక్తి కలుగుతుంది. మోక్షం పట్ల ఆలోచన పుట్టి ఆసక్తిగా మారుతుంది. పుట్టుక, మరణం అనే చక్రభ్రమణం లేకుండా శాశ్వతంగా భగవంతుడిలో ఐక్యం కావడమే మోక్షమని వేదాంతులు చెబుతారు. ఆ స్థితికి చేరడానికి ప్రణాళిక చెప్పారు భాగవతకర్తలు.

ఒక మూర్తిని ఎదురుగా నిలుపుకోవాలి. అందులో భగవంతుడు కొలువై ఉన్నాడని సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలి. తరివాతి దశలో స్మరణం, కీర్తనం, అర్చనం, పాదసేవనం లాంటి ఉపచారాలతో అర్పించాలి. అలా చెయ్యగా చెయ్యగా ఆ రూపం మనసులో స్థిరపడుతుంది. భగవద్భకులతో సహవాసం, భగవన్నామాన్ని వినడం/ఉచ్చరించడం, అఖిల పురాణాల్లో ఆ అంతర్యామి కొలువై ఉన్నాడనే స్థిరమైన భావం కలిగి ఉండటం... వీటన్నింటివల్ల ఇహలోక బంధనాల పట్ల విరక్తి ఏర్పడుతుంది. అప్పుడు మనసే మందిరంగా మారి అందులోనే కొలువై ఉంటాడా అంతర్యామి.

ఇంత విపులంగా చెప్పినా చాలామంది ఆ ప్రయత్నం చెయ్యరు. దానికి కారణం అలసత్వం. అలసత్వానికి దోహదపడేది కలియుగ ప్రభావం. ఈ విషయంలో కూడా భాగవతంలోనే చెప్పారు. శౌనకాది మహామునులు సూతుణ్ని ప్రశ్నించే సమయంలో 'కలియుగంలో మానవులు అలసత్వం, మందబుద్ధి, మిక్కిలి తక్కువ ఆయుర్దాయం కలిగి ఉంటారు. వారికి ముక్తి ఎలా కలుగుతుంది?' అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా సూతుడు నారాయణుడి కథ చెప్పి, స్మరణతోనే ముక్తి కలుగుతుందంటాడు. అప్పటి నుంచి 'కలియుగంలో స్మరణ వల్ల ముక్తి కలుగుతుంది (కలౌ స్మరణాన్ముక్తిః)' అనే నానుడి ఏర్పడింది.

స్మరణకు ఉన్న బలం ఎంతటిదో భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. 'విషయ వాంఛల గూరించి సదా మననం చేసేవాడికి...' అన్న దగ్గర నుంచి 'బుద్ధి నాశం పొందినవాడు నశిస్తాడు' అన్నంతవరకు (కొన్ని శ్లోకాల్లో) వివిధ దశలు వివరించాడు. కాబట్టి అంత బలం ఉన్న స్మరణను అనవసరమైన విషయాల పట్ల కాకుండా భగవంతుడు / మోక్షం / జన్మరాహిత్యం తదితరాలపై ఉంచితే పుణ్యం-పురుషార్థం రెండూ కలుగుతాయి.

భాగవతం అనే శబ్దాన్ని విశ్లేషిస్తే భక్తి, జ్ఞాన వైరాగ్య, ఆధ్యాత్మికతత్త్వాల్లో ఏదో ఒక దాన్ని బోధిస్తుందని పౌరాణికుల ఉవాచ. సంసార / ఇహలోక బంధనాలను కలిగి ఉంటాయి. దాని ఫలితంగా కలిగే యాతనలను తొలగించి, ప్రశాంతమైన మనసును ఇచ్చేది స్మరణ మాత్రమేనని స్పష్టంగా చెప్పారు భాగవత కర్తలు. కాబట్టి అనవసరమైన విషయాల పట్ల ఆసక్తి తగ్గించుకుని జన్మరాహిత్యానికి దోహదపడే అంశాలను స్మరణ చెయ్యాలి. దానికి సులభమైన మార్గం-భాగవత పఠనం!

# తిరుచానూరు శ్రీకృష్ణస్వామి దేవాలయం

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి

"తిరుచాన" అనగా మహాలక్ష్మి! మహాలక్ష్మి కొలువున్న ఊరు "తిరుచాన ఊరు" గా, క్రమంగా తిరుచానూరుగా పరిణామం చెందింది! చాలా కాలం క్రందట ఇది శ్రీ శుక మహర్షి ఆశ్రమ ప్రాంతం! అందువల్ల "శ్రీశుకనూరుగా" కూడా పిలవబడుతుంది! ఈ పవిత్ర క్షేత్రంలో పద్మాసరోవరంలో ఆవిర్భవించిన శ్రీమహాలక్ష్మి అర్చామూర్తిగా శాంతి నిలయంలో కొలువై స్వతంత్ర వీరలక్ష్మిగా సేవలందుకొంటూ భక్తజన బాంధవిగా భక్తులను అలరిస్తోంది! తిరుచానూరు పద్మావతీదేవి ఆలయంలో సుందర రాజస్వామి దేవాలయంతో బాటుగా శ్రీకృష్ణస్వామి దేవాలయం కూడా వుంది! కృష్ణస్వామిని "అళగిరు పెరుమాళ్" అంటే అందమైన దేవుడు అని కూడా పిలుస్తారు! గర్భాలయంలో పడమటి గోడవారకు దగ్గరగా, రెండు అడుగుల గిలావేదికపై తూర్పుముఖంగా శ్రీకృష్ణుని శిలావిగ్రహం దర్శనమిస్తుంది. పద్మాసనంలో కుర్చుని, వరద హస్త భంగిమలో రెండు చేతులూ బారజాచి వుంటాడు ఈ స్వామి. కృష్ణస్వామి మూర్తికి పక్కనే మరోక శిలావేదికపై బలరాముని శిలా విగ్రహం ఉత్తరాభిముఖంగా ప్రతిష్ఠంపబడింది. ఎడమకాలును మడిచి పెట్టి పీఠంపై కుర్చున్న బలరాముడు కుడికాలును కిందకు జారవిడిచి వుంటాడు! ఎడమ చేయిని మడిచిన ఎడమకాలుపై వుంచి కుడి చేతిని నేలపై ఆన్చి సేద తీరినట్లుగా వుంటాడు! రెండు పాదాలకు పాదరక్షలు ధరించి వుంటాడు! బలరామ–కృష్ణుల విగ్రహాలకు కిరీటాలు వుంటాయి! ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించి ఒక కథ ప్రచారంలో వుంది –

కురుక్షేత్ర సంగ్రామం జరుగుతుండగా ఎవరి పక్షానా వుండడం ఇష్టంలేక – అసలు సంగ్రామసమయంలో ఆ ప్రాంతంలోనే వుండకూడదనీ నిశ్చయించుకున్న బలరాముడు క్షేత్రదర్శనాలకు బయల్దేరి వెళ్ళాడు. 18 రోజుల జరిగిన మహాసంగ్రామం ముగిసిన తరువాత శ్రీకృష్ణుడు తన అన్న అయిన బలరాముని వెదుకుతూ శ్రీశుకమహర్షి ఆశ్రమానికి వచ్చాడు. తన ఆశ్రమంలో ఆతిధ్యం స్వీకరించి విశ్రమించవల్సిందిగా శ్రీశుకుడు కృష్ణుని కోరాడు. అందుకు అంగీకరించిన కృష్ణుడు ఆ పవిత్ర ప్రశాంత ఆశ్రమ వాతావరణంలో పద్మాసనం వేసికొని తన అరిచేతులను రెండు మోకాళ్ళపై వుంచి ధ్యానగ్రస్తుడయ్యాడు! ఇంతలో క్షేత్ర సందర్శనం ముగించుకొని వచ్చిన బలరాముడు, కృష్ణుని చూచి చాలా ఆనందించాడు! ఆ ఆనందంలో అలిసిపోయి వున్న బలరాముడు పాదరక్షలు కూడా విడవకుండానే పీఠంపైన




కూర్చున్నాడు. ధ్యానం పూర్తి చేసికొని కళ్ళు తెరచిన శ్రీకృష్ణుడు, బలరాముని చూచి "ప్రస్తుతం తాము వున్న ఈ ప్రదేశం అంతా దివ్యక్షేత్రమనీ ఇంతకు మించిన పుణ్యప్రదేశం లేనేలేదని, ఇంక ఈ నాటితో క్షేత్రాటనం ముగించుకోమని చెప్తూ తన రెండు అరచేతులతో ఈ దివ్యస్థలాన్ని చూపించాడనీ, బలరాముడు కూడా అందుకు అంగీకరించాడనీ చెప్తారు! ఆనాడు వారిద్దరూ శ్రీశుక ఆశ్రమంలో ఆతిధ్యం తీసుకొన్నందుకు గుర్తుగా అదే భంగిమలలో వారిద్దరి విగ్రహాలు ప్రతిష్ఠిస్తూ శ్రీకృష్ణస్వామి దేవాలయాన్ని నిర్మించారని ప్రతీతి! ఈ ఆలయంలో కొలువైన అన్నదమ్ములిద్దరి దర్శనం చేసుకొంటే సమస్త తీర్ధయాత్రా ఫలితం సిద్ధిస్తుందని, వారు భక్తులకు వరం ప్రసాదించారని కథనం!

బలరామ కృష్ణులు కొలువైన ఈ ఆలయాన్ని దర్శించుకొని మనం కూడా ఫలితాన్ని పొందుదాం!

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

### 268. లక్ష్మీశాయ నమః

లక్ష్మీదేవి యొక్క ప్రాణనాథుడయిన విష్ణుదేవునికి నమస్కారము. విష్ణుదేవుడు తన వక్షః స్థలముననే లక్ష్మీదేవిని నిలిపికొని యున్నాడు. ఆమె విష్ణు దేవునికి అనపాయిని అయింది. స్వామితో అవినాభావ సంబంధము గల్గియున్నది.

లక్ష్మీనాథుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**ద్వయ మంత్రమున**

**శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే**

**శ్రీమతే నారాయణాయ నమః**

అను వాక్యములలో లక్ష్మీదేవితో కూడిన నారాయణుడే ఆరాధనీయుడు. శ్రీమతే శబ్దము లక్ష్మీ నారాయణులు అవినాభావ సంబంధము గలవారు నారాయణునికి లక్ష్మి అనపాయిని అని తెలుపుచున్నది. వేంకటేశ్వరుని హృదయముపై లక్ష్మీదేవి అధిష్టించి యుండుట వారి సంబంధము యొక్క విశిష్టతకు నిదర్శనంగా ఉంది.

### 269. లోక రక్షకాయ నమః

భగవంతుడగు శ్రీమన్నారాయణుడు సర్వ జగత్తునకు రక్షకుడు. సర్వ ప్రపంతమును కాపాడు వాడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 270. దేవకీ గర్భ సంజాతాయ నమః

దేవకి పూర్వ జన్మలో అదితి. విష్ణుదేవుడు దేవకి యొక్క తదుపరి జన్మలో ఆమెకు పుత్రునిగా జన్మిస్తానని వరమిచ్చినాడు.

దేవకి దేవకుని కుమార్తె. వసు దేవుని భార్య. కృష్ణుని తల్లి. దేవకి తండ్రికి సోదరుడైన ఉగ్రసేనుని కుమారుడు కంసుడు. ఒకనాడు ఆకాశవాణి దేవకి అష్టమ గర్భములో జన్మించిన వాని వలన కంసునికి మరణం సంభవిస్తుందని చెప్పింది. వెంటనే కంసుడు దేవకీ వసుదేవులను బంధించి చెరసాలలో పెట్టినాడు. కంసుడు దేవకికి పుట్టిన బిడ్డను పుట్టినట్లు తత్క్షణమే ఆరుగురు పిల్లల్ని చంపినాడు. దేవకి ఏడవ బిడ్డ గర్భంలో వుండగానే విష్ణువు యొక్క ఆజ్ఞచే యోగమాయ సంకర్షించి వసుదేవుని మరో భార్య యగు రోహిణి గర్భంలోకి చేర్చింది. ఆ పిల్లవాడు బలరాముడు. ఇతనికే సంకర్షణుడని మరొక పేరు. కంసుడు దేవకి గర్భము దిగబడిపోయిందని వూరక వుంటాడు. దేవకి అష్టమ గర్భమున విష్ణుదేవుడు కృష్ణునిగా జన్మించాడు. కృష్ణుడు బలరామునితో మధురకు వెళ్ళి కంసుని వధించినాడు. దేవకి గర్భమున కృష్ణునిగా అవతరించిన / జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


### 271. యశోదేక్షణ లాలితాయ నమః

యశోద – ఈక్షణ – యశోదేక్షణ

పెంపుడు తల్లి యశోదా దేవి యొక్క చూపులతోనే లాలింపబడిన వాడు శ్రీకృష్ణుడు. యశోద నందగోపుని భార్య. దేవకి కృష్ణుని ప్రసవించినపుడు కంసుని చెరసాల నుండి వసుదేవుడు యోగమాయ సహాయముతో వ్రేపల్లెకు వచ్చి తన మిత్రుడైన నందుని యింట యశోద ప్రక్కన పరుండ బెట్టి వెళ్ళినాడు. ఇట్లు వసుదేవుడు తన అష్టమ బాలుని కంసుని బారి నుండి రక్షించుకొన్నాడు. ఆ బాలుడే కృష్ణుడు. యశోద కృష్ణుడు తన పుత్రుడను భావముతో పెంచి పెద్ద జేసింది. తరించింది.

యశోద మరు జన్మలో వకుళమాలికగా జన్మించి మొదట వరాహస్వామిని సేవించుచుండి

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

శ్రీనివాసుడు వేంకటాద్రి చేరినపుడు అతనిని సేవించి పెండ్లి రాయబారము చేసి పద్మావతీ శ్రీనివాసుల వివాహమును తన ఆధ్వర్యములో జరపించి ధన్యురాలయింది.

యశోదచే లాలించబడిన (బుజ్జగింప బడిన) కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 272. వసు దేవ కృత స్తోత్రాయ నమః

కృష్ణ భగవానుని తత్త్వ మెరిగిన తండ్రి యగు వసుదేవునిచే స్తుతింపబడిన వాడు.

వసుదేవునికి ఆనక దుందుభి, శౌరి, తారతాణు, యదూద్యకుడు అను పేర్లు గలవు. వసుదేవుడు ఉగ్రసేనునికి (కంసుని తండ్రి) మంత్రి. శూరసేనుని కుమారుడు. కుంతికి సోదరుడు.

వసుదేవునికి దేవకి వలన కృష్ణుడు, సుభద్రలు జన్మించారు. రోహిణి వలన బలరాముడు జన్మించినాడు. శ్రావణ బహుళ అష్ణమి రోహిణీ నక్షత్రమున కృష్ణుడు జన్మించినాడు. అప్పుడు వసుదేవుడు –

**సీ॥ జల ధర దేహు నాజాను చతుర్బాహు సరసీరుహాక్షు విశాల వక్షు**
**జారుగదా శంఖ చక్ర పద్మ విలాసు గంఠ కౌస్తుభమణి కాంతి భాసు**
**గమనీయ కటి సూత్ర కంకణ కేయూరు శ్రీవత్సలాంఛనాంచిత వహారు**
**నురుకుండల ప్రభాయుత కుంతల లలాటు వైదూర్య మణిగణ వర కిరీటు**
**తే॥ బాలు బూర్ణేందు రుచి జాలు భక్తలోక పాలు సుగుణాల వాలు గృపా విశాలు**
**జూచి తిలకించి పులకించి చోద్యమంది యుబ్బి చెలరేగి వసుదేవు డిట్లు పొగడె ॥**
**– భాగ, 10–పూర్వ – 11**
**ఆ॥ చాగి మ్రొక్కి లేచి సరగున నొసలిపై గేలు దమ్మి దోయి గీలు కొలిపి**
**పాపనక వెరక పావని మొదలింటి పోక లెల్ల దలచి పొగడ దొడగె ॥ – భాగ, 10–పూర్వ – 115**
**కం॥ ఏ నిన్ను నఖిల దర్శను జ్ఞానానంద స్వరూపు సంతతు నప రా**
**ధీనుని మాయా దూరుని సూనునిగా గంటి నిట్టి చోద్యము గలదె ॥ – భాగ, 10–పూర్వ – 116**
**శా॥ మింటన్ మ్రోసిన మ్రోత తాలిమిని లో మేంద్రింప మున్నీవు నా**
**యింటన్ బుట్టెద వంచు గంసుడు దొడిన్ హింసించె నీ యన్నలన్ ॥ – భాగ, 10–పూర్వ – 123**

అని వసుదేవుడు తన కుమారుడుగా జన్మించిన విష్ణుదేవుని స్తుతించినాడు.

మేఘము వంటి శరీరము గలిగి, మోకాళ్ళ వరకు వున్న నాలుగు చేతులు గలిగి, పద్మముల వంటి కన్నులు గలిగి, విశాలమైన వక్షఃస్థలము గలిగి, అందమైన గద, శంఖము, చక్రము, పద్మము గలిగి మెడలో కౌస్తుభము ప్రకాశించుట గలిగి, సుందరమైన మొలత్రాడు గలిగి, కంకణములు, అంగదములు గలిగి, శ్రీవత్సమను మచ్చ గలిగి (భృగు మహర్షి పాద తాడనముచే విష్ణువు ఎదపై గలిగిన మచ్చ) పెద్ద కుండలముల కాంతిచే శోభిల్లుచున్న ముంగురులతో నున్న నొసలు గలిగి, వైదూర్య మణులతో అలంకరింపడిన కిరీటము గలిగిన బాలుడు పూర్ణిమ నాటి చంద్రుని వంటి ముఖము గలిగి భక్తులను రక్షించే వాడు, సుగుణములకు నిలయుడు, దయ గలిగిన వానిని చూచి పులకించి, ఆశ్చర్యపడి, ఉప్పొంగి వసుదేవుడు తనకు పుత్రునిగా జన్మించిన విష్ణుదేవుని ఇట్లు స్తుతించనాడు

– భాగ, 10–పూర్వ – 111

బాలునికి సాష్టాంగ నమస్కారము చేసి తొందరగా లేచి నిలబడి చేతులు చేర్చి నమస్కరించి తన పాప దని తలంచక అతని మొదలిల్లు వైకుంఠము నందలి ప్రవర్తనను తలంచి పొగడుటకు మొదలు పెట్టినాడు. – భాగ, 10–పూర్వ – 115

నేను సమస్త శాస్త్ర జ్ఞానానంద స్వరూపుని, ఎల్లప్పుడు స్వతంత్రుడు అగు నిన్ను పుత్రునిగా పొందితిని. ఇంత కంటె ఆశ్చర్యము గలదా? – భాగ, 10–పూర్వ – 116

ఆకాశవాణి మాటలు ధైర్యమును గుండెను భేదించగా నీవు నాయింట పుట్టెదవని తలంచి కంసుడు నీ అన్నలను చంపినాడు. – భాగ, 10–పూర్వ – 123

వసుదేవునిచే స్తుతింప బడిన కృష్ణుడుగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



# జ్ఞానానందమయుడు హయగ్రీవుడు

– చింతలపాటి
శివశంకరశాస్త్రి

**"చతుర్భుజం చిదానందం మల్ల చాణూర మర్దనం
చరా చర గురుందేవంతం వందే చక్రపాణినం"
"శ్రియఃకరం శ్రియోనాథం శ్రీధరం శ్రీ వరప్రదం
శ్రీవత్సల ధరం సౌమ్యం తంవందే శ్రీసురేశ్వరం"**

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజనవత్సలుడు, స్థితికారకుడు మహావిష్ణువు. భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలు తీర్చే ఆ దేవదేవుని స్మరణం కైవల్యదాయకము. భక్తిముక్తిదాయకం.

**"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"**

ధర్మానికి హాని జరిగినా, అధర్మం మితిమీరినా దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయాల్సిన పరిస్థితులేర్పడినప్పుడల్లా ఈ భూమిపై అవతరిస్తూనేయుంటానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించాడు. అలా అనేక అవతారాలలో అవతరించి శిష్ట రక్షణ గావించాడు.

**"జ్ఞానా నందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే"**

జ్ఞానం, ఆనందం, మూర్తీభవించిన మహనీయుడు హయగ్రీవుడు. ఈయన చతుర్భుజమూర్తి. నాలుగు చేతులలో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకం ధరించి సకలవిద్యా ప్రదాతగా, జ్ఞాన ప్రదాతగా, నిర్మలమైన స్ఫటిక ప్రభాలతో ప్రకాశిస్తుంటాడు. ఈయన శ్రీహరి ఆద్యవతారం. అశ్వముఖంతో తేజరిల్లే ఈ పరమాత్మ సర్వ విద్యలకు ఆధారమైనవాడు.

'అశ్వం' అనే శబ్దం 'అశు' అను ధాతువు నుండి పుట్టినది. అశు – వ్యాప్తా – వ్యాపించేది అని అర్థము. విద్య విస్తరించేదే కనుక విద్యాస్వరూపుడు. పరమజ్ఞాన మూర్తి అయిన హయగ్రీవుడు అశ్వముఖుడై దర్శనమిస్తున్నాడు. సప్తకోటి మహామంత్రాల సమూహమే హయగ్రీవుడు. "నృ – తురంగ విగ్రహః తురంగం" అంటే గుర్రం. 'నృ' అనగా నరాకృతి. తురంగవదనం కలిగి అనుగ్రహించే స్వామి హయగ్రీవుడు.

పరాపర విద్యలలో ఏవిద్యయైనా చక్కగా అవగతం కావాలంటే అధ్యయనం మొదలు ఆచరణవరకు అన్ని దశలలో హయగ్రీవుని అనుగ్రహం కావాలి. హయగ్రీవుని పూజించడంవల్ల గొప్ప వాక్ శక్తి లభిస్తుందని ఆర్యోక్తి.

**"వాచాం ప్రవాహైః అని వారతై స్తైః**
**మందాకినీం మందయితుం క్షమంతైః"**

గంగా ప్రవాహాన్ని అడ్డగించే శక్తి హయగ్రీవోపాసకులకు లభిస్తుందని అర్థం. విద్యలలోకెల్లా అమోఘ విద్యగా చెప్పబడుతున్న బ్రహ్మవిద్య అనేది ప్రప్రథమంగా ఈస్వామి ముఖారవిందం నుంచే వెలువడింది. శాక్తేయ పరంపరలో ఉన్న మంత్రాలు, శ్రీవిద్యా సాంప్రదాయంలోని మంత్రాలు సప్తకోటి మహామంత్రాలు – తంత్రాలు మొదలైనవన్నీ హయగ్రీవుని చలువవల్ల లభించేవే. దేవీ భాగవతం శ్రీమద్భాగవతాదులను హయగ్రీవుని బ్రహ్మవిద్యలోని అంతర్భాగాలుగా చెబుతుంటారు మహర్షులు.

పూర్వం హయశీర్షుడనే రాజు భూమండలాన్ని పాలిస్తూ ప్రజలను చిత్రహింసలకు గురిచేస్తూ పరిపాలన సాగించేవాడు. భూలోక ప్రజలనే కాకుండా, తన శక్తియుక్తులతో ముల్లోకాలను గడగడలాడించేవాడు. అతని శక్తి ముందు దేవతలందరూ తలలు వంచి ఆ కిరాతకుడు పెడుతున్న బాధలను భరించేవారు. అటువంటి శక్తి సామర్థ్యాలను కలిగియున్న హయశీర్షునికి మరణం లేకుండా జీవించాలనే కోరిక కలిగింది. తన మనసులో ఎప్పుడైతే ఈ కోరిక తలెత్తగానే బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి, తన భక్తితో ఆ విధాతను మెప్పించి తనలో కలిగిన కోరికను తీర్చుకొని మృత్యుంజయుడిని అవ్వాలని తలచి, రాజ్యాన్నీ మంత్రులకు అప్పజెప్పి తపోవనానికి పోయి తపస్సును ప్రారంభించాడు. అతడి తపస్సు కొన్ని వేల సంవత్సరాలు సాగింది. బ్రహ్మదేవుడు అతని తపస్సుకు మెచ్చి అతని ముందు ప్రత్యక్షమై "ఓ భక్తాగ్రేసరా! నీ భక్తికి నేనెంతో సంతసించాను నీ ఆరాధన నన్ను ముగ్ధుడ్ని చేసింది. నీకు ఏ వరం కావాలో కోరుకో అనుగ్రహిస్తాను" అని పలికాడు.

హయశీర్షుడు విధాతను చూచి అతనిని పరిపరివిధాలుగా స్తుతించి "తండ్రీ! నా తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైనందుకు ధన్యున్ని. మా రాక్షస జాతిలో మరణాన్ని జయించాలన్న కోరికతో తపమాచరించితిని. ఎవరివల్లనూ చావులేకుండా వరమిమ్మని ప్రార్థించాడు. ఆ మాటలు విని బ్రహ్మ అది సరికాదు. పుట్టినప్రాణికి చావు, చచ్చినజీవికి జన్మతప్పవు. ఇంకేదైనా వరం కోరుకొమ్మనగా అయితే నన్ను చంపదలచినవాడు నాకు మల్లే గుర్రం తలను కలిగియుండి, నాతో యుద్ధం చేసినపుడు మాత్రమే మృతున్ని కావాలి. అంతవరకు మరణం ఆసన్నమవకూడదు. త్రిమూర్తులలో ఒక్కడివైన నీవు వరప్రదాతవు కావున నీవలన నాకు మరణం సంభవింపదు. విష్ణువు లక్ష్మీదేవితో కూడియుండి నిరంతరం క్రీడా వినోదములు సలుపుతూ ఉంటాడు. అతడు కూడా నన్ను ఏమి చేయలేడు. మిగిలినది పరమేశ్వరుడు. అతనికి నన్ను చంపవలసిన అవసరం, అగత్యము లేదు మిగిలిన దేవతలు నన్ను ఏమి చేయలేరు. కాబట్టి నాకు ఈ వరాన్ని అనుగ్రహించండి" అని తన కోరికను వ్యక్తపరచాడు. వెంటనే బ్రహ్మ తథాస్తు! నీకోరిక నెరవేరుతుంది అని పలికి అంతర్ధానమయ్యాడు.

విధాత నుండి వరంపొందిన హయశీర్షుడు వరగర్వంతో ప్రజలను మరింత పీడించసాగాడు. వాడి బాధలు భరించనేని దేవతలు పరమేశ్వరుని వద్దకు వెళ్ళి మొరబెట్టుకోగా పరమేశ్వరుడు పరమేశ్వరివంక అర్ధనిమీలిత నేత్రములతో, చిరునవ్వుతో చూసాడు. పరమేశ్వరుని భావాన్ని అర్థము చేసుకున్న పరమేశ్వరి వారితో "దేవతలారా! హయశీర్షుని మరణానికి ఇంకా సమయమున్నది. అతడిని సంహరించే సమర్థుడు శ్రీమన్నారయణుడే. శ్రీహరి చేతిలోనే వానికి మరణం తప్పదు. అంతవరకు మౌనము వహించమని పలికింది. వెంటనే అందరూ ఆ లోకమాతను వేనోళ్ళ కీర్తించారు. వేదాలామెను స్తోత్రము చేసాయి.

ఆర్త త్రాణపరాయణుడైన శ్రీహరి లోకాలన్నింటిని గజగజలాడించచున్న రాక్షసులను తుదముట్టించడానికి రాక్షసులతో యుద్ధం చేస్తున్నాడు. ఆ యుద్ధం పదివేల సంవత్సరాలపాటు జరిగింది. విష్ణువు బాగా అలిసిపోయి, ఒక చక్కని ప్రదేశంలో పద్మాసనం వేసుకున్నాడు. ధనుస్సుకు నారితాడు బిగించియుంది. ఆ ధనుస్సుకు చివర తన చుబుకాన్ని ఆనించి సుఖంగా నిద్రలోకి జారుకున్నాడు. అలా ఎన్నిరోజులు నిద్రపోయాడో తెలియనివిధంగా నిద్రపోయాడు. దేవతలంతా విష్ణువు వద్దకు వచ్చారు. విష్ణువు ఇంకా నిద్రలోనేయున్నాడు. నిద్రపోతున్న శ్రీహరిని నిద్రలేపడం ఎలా? అన్నది దేవతల సమస్య అయింది. అప్పుడు బ్రహ్మ ఆలోచించి, ఒక క్రిమిని సృష్టించి, ధనుస్సును తొలిచి వేయమని చెప్పాడు. నాకు యజ్ఞ భాగాల్లో వాటా ఇచ్చేటట్లు అనుగ్రహిస్తే, ఆ వింటినారిని కొరికి వేస్తానని పలికింది. అందుకు దేవతల రాజైన ఇంద్రుడు సరేనన్నాడు. అందులకు ఆ క్రిమి సరేనని ధనస్సును క్రిందినుండి తొలవడం ప్రారంభించింది. నారిత్రాడును కొరికే సరికి భయంకరమైన శబ్దము వెలువడింది. విల్లు నిటారుగా అయింది. దాని వేగానికి విష్ణువు తల ఎగిరి లవణ సముద్రంలో పడిపోయింది. వింటినారి శబ్దానికి తలతెగిపోవడము విష్ణువుకు తల లేకుండాపోయేసరికి దేవతలంతా దిగ్భ్రాంతికి గురయ్యారు.

పరాశక్తిని దేవతలంతా తిరిగి ప్రార్థించగా, ఆమె ప్రత్యక్షమయి వారితో "చింతించకండి. ఇది లోకకళ్యాణ నిమిత్తం జరిగింది కాబట్టి మీరంతా ఒక గుర్రపు తలను తెచ్చి విష్ణువు తల భాగాన దేహానికి అతికించండి. హయగ్రీవుడైన విష్ణువు ఆ రాక్షసుని సంహరించి లోకానికి శుభమును చేకూరుస్తాడని" పలికింది. పరాశక్తి మాటలను ఆలకించి దేవతలంతా అలాగే చేసారు. విష్ణువు రాక్షసునితో యుద్ధం చేసి సంహరించాడు. రాక్షసుని సంహరించి తమకు, లోకాలకు ఆనందాన్ని కలిగించిన హరిని అందరూ వేనోళ్ళ కీర్తించారు.

వేదాలను అపహరించిన మధుకైటభులు పాతాళానికి వెళ్ళి రక్షణ పొందగా, శ్రీహరి పాతాళానికి వెళ్ళి వారితో యుద్ధం చేసి వారిని సంహరించాడు. రాక్షసులంతా బాగా అలిసిపోయియున్న సమయంచూచి శ్రీహరి అశ్వముఖంతో సకిలించగా, వారు త్రుళ్ళిపడి ఆ ధ్వని ఎక్కడినుండి వచ్చిందో తెలుసుకోవడానికి ప్రయత్నించగా, శ్రీహరి అక్కడి నుండి అదృశ్యమై వారు దాచిన వేదాలను తిరిగి స్వీకరించి బ్రహ్మదేవునికి అందజేసి, ఆ రాక్షసులను సంహరించాడు. నారాయణుడు హయగ్రీవుడైన పవిత్రదినాన (శ్రావణ శుద్ధ పూర్ణిమ) హయశీర్షుని సంహరించి వేదాలను ఉద్ధరించాడు.

లోకకంటకులైన రాక్షసులను సంహరించి వేదాలను ఉద్ధరించినందువల్ల ద్విజులు శ్రావణపూర్ణిమనాడు ఉపాకర్మ పేరిట వేదాధ్యయానాన్ని ప్రారంభించడం ఒక ఆచారమైంది. మంచిని గ్రహించలేనివారు పుడుతూ గిడుతూనే ఉంటారని, వారి జనన మరణాలు, పరిభ్రమణాలు హయ (ప్రకృతి) గ్రీవుని అధీనంలో ఉంటాయని బోధపడుతోంది. జీవుడు బ్రహ్మమైన ఆ హయగ్రీవుని తెలుసుకునేవరకు జనన మరణ చక్రంలోనే తిరుగుతూనే ఉంటాడని హయగ్రీవ వృత్తాంతము పరోక్షంగా తెలుపుతోంది. బ్రహ్మాండపురాణంలో ఉపఖండంగా భాసిస్తున్న శాక్తేయ విద్యను, అందులోని లలితా ఉపాసనారహస్యాలను హయగ్రీవుడు అగస్త్యునికి బోధించాడు. మరియు లలితావైభవం, లలితాసహస్రనామ త్రిశతి వంటి విద్యలను అగస్త్యునికి ఉపదేశించినట్లు బ్రహ్మపురాణం వెల్లడిస్తోంది.

**"జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే"**

జ్ఞానం, ఆనందం మూర్తీభవించిన మహానీయుడు హయగ్రీవుడు. ఈయన చతుర్భుజమూర్తి. నాలుగు చేతులలో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకం ధరించి సకల విద్యాప్రదాతగా జ్ఞాన ప్రదాతగా, నిర్మలమైన స్ఫటిక ప్రభలతో ప్రకాశిస్తుంటాడు. ఈయన శ్రీహరి ఆద్యవతారం. సప్తకోటి మహామంత్రాల సముహమే హయగ్రీవుడు. పరాపర విద్యలలో ఏవిద్యయైనా



చక్కగా అవగతం కావాలంటే, అధ్యయనం మొదలుకొని ఆచరణ వరకు అన్ని దశలలో హయగ్రీవుని అనుగ్రహం కావాలి. కాలవుడు అనే మహర్షి హయగ్రీవుని ఉపాసించి 'శిక్ష' అనే వేదాంగానికి కర్త అయ్యాడు.

హయగ్రీవుని జయంతినాడు శ్రీహయగ్రీవుని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి ఉలవలు, శనగలు వంటి వాటిని ఉడకబెట్టి గుగ్గిళ్ళను నివేదించవలెను. ఈరోజు విద్యార్థులు హయగ్రీవస్వామివారిని పూజించడంవల్ల విద్యాభివృద్ధి జరుగుతుంది.

పరమపవిత్రమైన హయగ్రీవ జయంతినాడు ఆస్వామిని అర్చించి జ్ఞానవంతులమవుదాం.

**'స్వతస్సిద్ధం శుద్ధ స్ఫటికమణి భూ భృత్ప్రతిభటం**
**సుధా సధ్రీచీభిర్ద్యుతిభి రవదాత త్రిభువనం**
**అనంతైస్త్రయ్యంతైరసు విహిత హేషాహలహలం**
**హతశేషావద్యం హయవదనమీడే మహిమహః'**

ధారావాహికం



## శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

### 1. వేంకటాచలానికి శుకమహర్షి రాక :

దేవలుడు దేవదర్శునిని ఇలా అడిగాడు – దేవదర్శనా! దేవర్షీ! బ్రహ్మ పదాన్ని లభింపజేసేది, జనన మరణ సంసారబంధము నుండి విముక్తి కలిగించేది, భగవంతునికి ప్రీతిపాత్రమైనది, శ్రేష్ఠమైనది అయిన ధర్మాన్ని గురించి తెలియజేయండి.

దేవలుడు ఈ విధంగా అడుగగా దేవదర్శనుడు 'దేవలా! బ్రాహ్మణోత్తమా! నీవు మంచి విషయాన్ని అడిగావు. సువ్రతా! నీకు దానిని వివరంగా చెబుతాను, శ్రద్ధగా విను. ఈ చెప్పబోయే ఇతిహాసం పుణ్యప్రదమైనది. చతుర్విధ పురుషార్థాలను ఇచ్చునది. కీర్తికరమైనది. మనోహరమైనది. ఆయురారోగ్య ఐశ్వర్యప్రదమైనది.

పూర్వం సుమేరు శిఖరమునందు నానారత్నములతో కూడిన, విచిత్రమైన, మాణిక్య ఖచితమైన, స్వర్ణమయమైన, చదునైన స్థలంలో నిరంతరంగా ప్రవహించే గంగా ప్రవాహంతో తడుపబడిన, రత్నాలంకారాలతో పోగొట్టబడిన అంధకారముగల పొదిండ్లు కల, దట్టమైన చల్లని నీడనిచ్చే కల్పవృక్ష సమూహములు కల, తీయని మకరందాన్ని స్రవించే పూతీగలు వేలాడుచున్న, మాణిక్య స్తంభాలచే శోభిస్తున్న, మకర తోరణములు కల, విచిత్రాలైన రత్నాలు చెక్కబడిన నాలుగు బంగారు స్తంభాలు కల, మహారత్నాల విచిత్ర కాంతులతో ప్రకాశిస్తున్న సింహాసనంలో సావిత్రీ సరస్వతులతో కూడి బ్రహ్మదేవుడు ఆసీనుడై ఉన్నాడు.

ఆ సభలో గానవిద్యా కుశలురైన గంధర్వులు, కిన్నరులు గానం చేస్తున్నారు, వీణలు వాయిస్తున్నారు. తుంబురులు మొదలగు వారు స్తోత్రాలు చేస్తున్నారు. ఇంద్రాది దేవతలు వారిని సేవిస్తున్నారు. బ్రాహ్మి, మాహేశ్వరి మొదలగు సప్తమాతలు వస్త్రములు, ఆభరణములు, చందనాదులు మొదలగు ద్రవ్యాలు చేతులలో ధరించి సేవిస్తున్నారు. ఆ సభలో వసిష్ఠుడు మొదలగు బ్రహ్మర్షులు, మహర్షులు, సిద్ధులు, చారణులు, మార్కండేయుడు, మరీచి, అత్రి, భృగువు మొదలగు మహర్షులు, యోగిపుంగవులు, శాపానుగ్రహ సమర్థులైన తపోధనులు, పుణ్యక్షేత్రముల మాహాత్మ్యమును గురించి పరస్పరం చర్చించుకుంటున్నారు. వారు వేదవేదాంగ రహస్యాలను చర్చిస్తున్నారు. శాస్త్రాలను, ఉపనిషత్తులను, వేదరాశులను పూర్తిగా నెరిగినవాడు సాంగోపాంగంగా అభ్యసించినవాడు, ప్రపంచ సృష్టి విలాసానికి కారణభూతుడైన బ్రహ్మదేవుడు తన పదవి వలన కలిగిన ఆనందంతో నిండిన హృదయంతో వారితో సంభాషిస్తూ ఉన్నాడు. ఆ సంభాషణ మధ్యలో ప్రసంగవశాత్తు నారాయణగిరి యొక్క మాహాత్మ్యము, శ్రీనివాసుని ఆవిర్భావము గురించి విని ఆ సభలోనున్న శుకయోగీంద్రుడు పుణ్యక్షేత్రమైన,

ఆ నారాయణాద్రిని దర్శించాలనే కోరికతో బ్రహ్మదేవుని అనుమతి పొంది దక్షిణదిక్కుకు బయలుదేరాడు.

ఆదిమధ్యాంతరహితుడు, పురుషోత్తముడు, పురాణ పురుషుడు అయిన వాసుదేవుని యందు భక్తి కలిగి ఆయన కథలను, గుణగణాలను కీర్తిస్తూ మందస్మిత వదనారవిందుడై శుకమహర్షి నారాయణాద్రిని, అక్కడ ఉన్న నారాయణాశ్రమాన్ని దర్శించాడు.

## 2. వేంకటాద్రి స్వరూపం :

ఆ పుణ్య ప్రదేశం ఇలా ఉన్నది – జలగర్భితాలైన నల్లని మేఘాలను చూచి ఆనందిస్తున్న నెమళ్ళవలె ఉన్న ఆ పర్వత శిఖరాగ్రాలపై వాలఖిల్యాది మహర్షులు విశ్రమించి ఉన్నారు. ఆ శిఖరాలలోని మణుల రాశులు సూర్యుని రథాశ్వాల డెక్కలచే నలగగొట్టబడినట్లున్నవి. ఆ పర్వతంలోని చంద్రకాంత మణులు చంద్రకిరణములు స్పర్శచే ద్రవించి ప్రవహిస్తున్నాయి. ఆ ఎత్తైన శిఖరాలలో ప్రకాశించే రత్నాలు కనులకు మిరుమిట్లు గొలుపుతున్నాయి. అక్కడ మాణిక్య కాంతులతో సూర్య మండల ప్రకాశం ద్విగుణీకృతమైంది. ఆకాశాన్నంటుతున్న ఎత్తైన శిఖరాలపై విశాలమైన సమతల ప్రదేశాలున్నాయి.

అమృతాంశుడైన చంద్రుని కిరణములవల్ల కరుగుతున్న చంద్రకాంత శిలల ద్రవాన్ని త్రాగుచున్న చకోర పక్షుల గుంపులతో ఆ పర్వతం నిండి ఉంది. ఆ స్ఫటిక మణిమయ శిలాచరియల నుండి, శిఖరాల నుండి నిర్మలమైన సెలయేళ్ళు ప్రవహిస్తున్నాయి. ఆ కొండ పైభాగమంతటా పూచినటువంటి లొద్దుగ వృక్షాలు సింహాలవలె ఉన్నాయి. ఆ పర్వతమంతా మామిడి పూతలోని తేనెతో తడిసిపోయింది. ఆ పర్వత చరియలన్నీ మదగజ యూథముల దెబ్బలతో ఘూర్ణిల్లినాయి.

శరభ మృగాలు తరచు పైకి, కిందకి ఎక్కుతూ దిగుతూ ఉండడం వలన ఆ పర్వత చరియలు మానవులకు సంచారయోగ్యంగా లేవు. ఆ కొండ చరియలోల మహాంధకారం వలె చూడడానికి వీలు కాన మహా వృషభాలు ఉన్నాయి. అలాగే ప్రాణుల వాసన తగులగానే వాటిని హింసించే భయంకరమైన పెద్దపులులు సంచరిస్తున్నాయి. ఆ పర్వత చరియలోల సెలయేళ్ళు ప్రవహించడం వలన ఆ ప్రాంతంలో మొలచిన తుంగముస్తలను తిని అడవి పందులు బాగా బలిసాయి. అక్కడ అడవి దున్నలు యమ ధర్మరాజు వాహనం వలె ఱంకెలు వేస్తున్నాయి.

అక్కడి వృక్షాల కొమ్మల చివర కోతులు సంచరిస్తున్నాయి. ఆ పర్వతం పైభాగంలో అడవి మృగాల గుంపులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఆ పర్వతంపై ఆకాశాన్నంటే ఎత్తైన వృక్షాలు గల అడవులున్నాయి. గైరికాది ధాతువులతో కూడిన శిలా ప్రదేశాల నుండి సెలయేళ్ళు ప్రవహిస్తున్నాయి. మృత్యుముఖం వలె భయంకరమైన గుహల్లో నీళ్ళు నిలచి ఉన్నాయి. అక్కడి కీచురాళ్ళ ధ్వనులతో దిక్కులన్నీ నిండినాయి.

ఆ పర్వతం లోపలి ప్రాంతంలో భక్తులు జగత్తుకు ఉపాదాన కారణుడైన ఆ భగవంతుని దివ్యంగా కీర్తిస్తున్నారు. ఆ పర్వతంలోని మణుల కాంతులు ఇంద్రధనుస్సు వలె ప్రకాశిస్తున్నాయి. జింకలు, లేళ్ళ గుంపులతో ఆ ప్రాంతమంతా నిండి ఉంది చమరీ మృగాలు తోకలు విప్పి చిందులేస్తున్నాయి. కొండముచ్చులు గుంపులు గుంపులుగా తోకలాడిస్తూ ఎగురుతున్నాయి. ఆ పర్వత గుహలలో పగడాల తీగలు అల్లుకుని అలంకరించబడినట్లున్నాయి.

అ పర్వతము నందలి చరియలలో, సెలయేళ్ళ తీరంలో, విశాలమైన ప్రదేశాల్లో, బ్రహ్మధ్యాన పరాయణులైన మహర్షులు ఆశ్రమాలు నిర్మించుకొని నివసిస్తున్నారు. అక్కడి విశాల వృక్షాలు ఆశ్రితులకు, బాటసారులకు అలసటను పోగొడుతున్నాయి.

శుకమహర్షి ఆ వేంకటాద్రి సానువులలో పయనిస్తూ పవిత్రోదకములు గల అక్కడి సెలయేళ్ళలో నిశ్చల మనస్కుడై స్నానమాచరిస్తూ, అక్కడి పుష్కరిణులలోను, మడుగులలోను, తీర్థాలలోను, నీటిప్రవాహాలలోను మూడుసార్లు గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ, సంసార విమోచనం కలిగించునది, పరమాత్మప్రాప్తి సాధనమైన బ్రహ్మవిద్యను పెంపొందింప జేయునది, అవిద్యను పోగొట్టునది అయిన బ్రహ్మవిద్యను ఉపాసిస్తూ ఆయా ప్రదేశాల్లో ఒక్కొక్క రాత్రి స్వస్థచిత్తుడై నివసిస్తూ జాగరూకుడై బ్రాహ్మణులు నివసించే అంజనాద్రిని సమీపించాడు.

అక్కడక్కడ గృహాల వంటి గుహలలో కూర్చొని ఉన్న మునిశ్రేష్ఠులు, యోగులు, సిద్ధ సంఘములు, విశుద్ధజ్ఞానశీలురైన వైఖానస మునులు ఆయనకు అతిథి మర్యాదలు చేశారు. వారి మర్యాదలు స్వీకరిస్తూ, అక్కడక్కడ విశాలమైన బండరాళ్ళపై విశ్రాంతి తీసుకొంటూ నెమ్మదిగా ముందుకు వెళ్ళి సువర్ణముఖరి తీరంలోని పద్మసరస్సును చేరాడు.

## 3. దివ్యారామం–సుందరోద్యానం :

ఆ తరువాత ఆ సరోవర తీరంలో నున్న ఉద్యానవనాన్ని దర్శించాడు. అది నిత్య నూతనంగా ఉంది. ఆ సుందరోద్యానవనం సురపొన్న చెట్లు, పొన్న చెట్లు, పనస, పాటలి, అశోక, మోదుగ వృక్షాలు, మొల్ల, మందార, సంపంగి, మొగిలి మొదలగు పులచెట్లు, మామిడి, రక్తచందనం, కానుగ, దేవదారు, కొబ్బరి, రావి, మఱ్ఱి చెట్లు, ఖర్జూర, చంద్ర, రుద్రాక్ష, సన్నరాస్త, ధవవృక్షాలతో దట్టంగా వ్యాప్తమై మహేంద్రుని ఉద్యానవనం వలె ఉన్నది.

ఇంకను మాధవి, మల్లె, మొల్ల, అడవి మొల్ల మొదలగు మంచి పూలతలతోను, శతపత్రాలు కల తామర పూలతోను, సుగంధ పరిమళం కల మనోహరమైన దమనం, మరువం, తులసీ శాఖలతో వ్యాప్తమై ఉంది. ఆ తోట బొద్దుమల్లె, దర్భ, రెల్లు పూలతో ప్రకాశిస్తున్నది. పవిత్రమైన విశ్వామిత్రమనే దర్భలు, ముంజ గడ్డి ఏపుగా పెరిగి ఉంది. శుకమహర్షి అటువంటి నూతనోద్యానవనాన్ని చూచి ఆనందించాడు.

ఆ ఉద్యానవనం మెట్టతామర తోటలతోను మఱ్ఱి వృక్షాలతోను, లతామంటపాలతోను నిండి ఉన్నది. అక్కడ వేద వేదాంగ పారంగతులైన తపోధనులు, వేదాధ్యయనం చేస్తున్నారు. ఋషికుమారులు అక్కడ చిలుకలకు వేదమంత్రాలను నేర్పుతున్నారు. ఆ శుకములు వాటిని పలుకుతున్నాయి. ఆ ప్రాంతమంతా అగ్నిహోత్రాలనుండి వెలువడిన హవిర్గంధంతో పరిమళిస్తున్నది. అక్కడ లేడిపిల్లలు దర్భ పొదలలోని కుశపల్లవములు కొరుకుతున్నాయి. అక్కడి ఉపకరణాలన్నీ మనస్సుకు సంతోషాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కుబేరుని ఉద్యానవనం వలె ఉన్న ఆ తోటలో చిత్రవిచిత్రాలు మనోరంజకాలైన పదార్థములు పరిమళాలు విరజిమ్ముతున్నాయి.

## 4. శుకమహర్షి తపస్సు :

శుకమహర్షి కొంచెం సేపు అక్కడ విశ్రమించి శ్రీమన్నారాణుని నిశ్చలచిత్తంలో ధ్యానం చేశాడు ఆయన జితేంద్రియుడై నియమవ్రతుడై, అడవిలో దొరికే కంద మూలాదులను మాత్రమే భుజిస్తూ తమంతట తాము రాలిన పండ్లును స్వీకరిస్తూ, రోజులో రాత్రిపూట మాత్రమే ఆహారాన్ని స్వీకరిస్తున్నాడు. పగటిపూట నిత్యానుష్ఠాన విధులన్నిటిని నిర్వర్తించి దర్భశయ్యపై శయనిస్తున్నాడు.

మరుసటిరోజు ఉదయం బ్రాహ్మీ ముహూర్తంలో లేచి, నిర్మలుడై నియమంతో శంఖచక్రగదాధారియైన ఆ పుండరీకాక్షుని ధ్యానించాడు. యథావిధిగా స్నాన సంధ్యావందనాదు లాచరించి దయాతరంగితాక్షుడు, శరత్పూర్ణేందువదనుడు, పీతాంబరధారి, మహోరస్కుడు, దివ్యమంగళ విగ్రహుడు, పద్మపత్ర నేత్రుడు అయిన ఆ శ్రీనివాసుని స్వస్థచిత్తుడై ధ్యానించాడు.

శుకమహర్షి ఆ పద్మసరోవర తీరంలోని ఉద్యానవన సమీపంలో నిశ్చల మనస్కుడై తపస్సు చేయసాగాడు. ఆయన అశరీరవాణి వాక్కులను స్మరిస్తూ ఆ పద్మసరోవర తీరంలో నిర్మలాంతఃకరణుడై పరమానందంతో తపస్సు చేస్తూ ఉన్నాడు. నిత్యం వేదాధ్యయనం చేస్తూ శ్రీ మహావిష్ణువునే ఆరాధిస్తూ ఆకులను మాత్రమే భుజిస్తూ ఉన్నాడు. మితాహారుడై, మితభాషియై, శాంతుడై, ఇంద్రియనిగ్రహం కలవాడై, సజ్జనుల యందు భక్తి ప్రపత్తులతో పరమ సాత్త్విక బుద్ధితో శుద్ధ సత్త్వస్థితుడై విష్ణుభక్తుడయ్యాడు.

ఆయన ప్రతిరోజు శ్రీనివాసునారాధించకుండా ఆయనకు నివేదించకుడా ఏ కొంచెం కూడా భుజించడు. ఆకలిచే డస్సినా భగవంతునికి నివేదించని దానిని పొరపాటున కూడా ఆహారంగా స్వీకరించడు. దప్పిగొన్నప్పటికి విష్ణుపాదోదకం తప్ప వేరే నీటిని త్రాగడు.

ఆయన ద్వంద్వాతీతుడై, అహంకార రహితుడై ధృతి కలవాడై, ధైర్యంతో, అసూయారహితుడై, దర్భాసనం మీద ఆసీనుడై తపస్సు చేశాడు. ఆయన కుశాగ్ర బుద్ధియై, నిశ్చలుడై, చేతిలో దర్భలను, పవిత్రాన్ని ధరించి, జింక చర్మాన్ని కటికవస్త్రం గాను, ఉత్తరీయంగాను ధరించి, అగ్నిహోత్రం వలె ఎఱ్ఱని జడలు కలవాడై జపమాలను చేతిలో ఉంచుకొని మంత్రజపం చేస్తున్నాడు.

## 5. తపోగ్నిచే లోకోపద్రవం :

శుకమహర్షి జితేంద్రియుడై, భూమివలె ఓర్పుతో నాసాగ్రంపై దృష్టి నిలిపి, సదాచార సంపన్నుడై, పరిశుద్ధ శరీరుడై, దంతములను దంతములతో కలువ నీయకుండ, నాలుకను తాళువు యందుంచి, ధారణయోగంతో, ధ్యాననిష్ఠతో, ప్రాణాయామం చేత నిర్మలమైన బుద్ధి కలవాడై, పైకి వినపడకుండా మనస్సులోనే నారాయణ మంత్రాన్ని జపిస్తూ, పెదవును మాత్రం కదలిస్తూ, శ్రీమహావిష్ణువునందు దృఢంగా మనస్సు నిలిపి, అకుంఠిత దీక్షతో విష్ణు గాయత్రిని జపిస్తున్నాడు.

కృష్ణద్వైపాయనుని కుమారుడైన శుకయోగీంద్రుడు వర్షాకాలంలో నీటి మధ్యలోను, ఎండ కాలంలో పంచాగ్నిహోత్ర మధ్యంలో, సూర్యునివైపు దృష్టిని నిలిపి, శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వముల యందు సమదృష్టి కలవాడై, నిద్రని వీడి, కుశాగ్ర బుద్ధియై, ప్రళయకాలాగ్ని వంటి శరీరం కలవాడై, పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడై, ఘోరమైన తపస్సు చేయడానికారంభించాడు. ఆ తపోధనుని తపస్సుచే భూమి కంపించింది. ఆకాశంలో సూర్యుడు నిస్తేజుడయ్యాడు, సముద్రాలు క్షోభించినాయి, మేఘాలు వర్షించలేక పోయినాయి. అగ్నిహోత్రుడు జ్వలించలేదు. ఆకాశంలో దేవతల విమానాలు విహరించలేదు.

## 6. తపోభంగ ప్రయత్నం :

ఈ నిమిత్తాలను గమనించిన ఇంద్రుడు ఏమి చేయలో తెలియక సంశయాగ్రస్తుడయ్యాడు. ఆ మహేంద్రునికి ఏమి చేయడానికి పాలుపోక శుకమహర్షి తపస్సును భంగము

చేయదలిచి అప్సరసలను పిలిచి, వారితో 'ఓ అప్సరసల్లారా! మీరు లోకోపకార్థం బ్రహ్మచే సృష్టించబడ్డారు. చక్కని రూపం, యౌవనం, లావణ్యం కలవారు. మీరు పద్మాక్షులు, గజగమనం కలవాళ్ళు, ఘనమైన, ఎత్తైన పయోధరములు కలవారు. చక్కని శిరోజములు, దొండ పండు వంటి పెదవులు కలవారు. చక్కగా గానంచేస్తూనాట్యంచేస్తేదేవతలు,రాక్షసులుమనుష్యులందరూ మీవల్ల మోహితులౌతారు. మీ క్రీగంటిచూపులతో లోగడ నా శత్రువులను ఓడించారు. మీలాంటివారిని చూచిన వాడెవడైనా ఇంక తపస్సేమి చేస్తాడు? ధనుస్సునుండి బాణం వెలువడినట్లు నిశ్చల ధ్యానం నుండి అతని మనస్సు కదిలిపోతుంది. మాకు ఇబ్బందులలో సహాయకులు మీరే గదా! ఈ చతుర్దశ భువనాలలో మీకు సాధ్యం కాని కార్యమేదీ లేదు. ఇప్పుడు భూలోకంలో మనకు పెద్ద విపత్తు సంభవించింది. దానిని మీరే వెంటనే పోగొట్టాలి' అని చెప్పారు.

అప్పుడా అప్సరలలో ప్రధానురాలైన రంభ ఇంద్రునికి నమస్కరించి, అంజలి ఘటించి, 'మహేంద్రా! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. సురేశ్వరా! మీకోసమే మేము జీవిస్తున్నాము. మీ క్షేమం కొరకు ప్రాణాలైనా అర్పిస్తాం. అది శ్వేత దీపం కాని, బ్రహ్మలోకం కాని, కైలాసం కాని, మరే ప్రదేశమైనా సరే, మీ శత్రువులెక్కడ ఉన్నా మేమక్కడకు వెళ్తాం. మేము కన్నెత్తి చూస్తే ఒంటరి వారైనా, ఎల్లప్పుడూ నిశ్చల మనస్కులైనా శుద్ధ సత్త్వగుణ సంపన్నులైనా మోహితులౌతారు' అని మృదు మధురంగా పలికింది.

అంతట ఇంద్రుడు సంతుష్టుడై 'ఓ కాంతామణీ! మునులను కూడా మోహింప జేసే సౌందర్యం కల నీవు నిజమే చెప్పావు. భూలోకంలో సువర్ణముఖరీ తీరంలో శుకుడనే మహర్షి దుష్కరమైన తపస్సు చేస్తున్నాడు. స్త్రీరత్నాలైన మీరంతా అక్కడకు వెళ్ళి ఆ మునిశ్రేష్ఠుని మోహింప చేయండి' అని ఆజ్ఞాపించగా ఆ దేవతాంగనలు దేవేంద్రునికి నమస్కరించి శుకమహర్షి తపస్సుచేసే ప్రదేశానికి వెళ్ళారు.

## 7. రంభాదుల విలాసాలు :

వారక్కడకు వెళ్ళి మధురంగా గానం చేశారు. మదోద్ధతలై నాట్యం చేశారు. వీణ, వేణువు మొదలగు వాద్యాలు వాయించారు. మన్మథ ప్రలాపాలు చేస్తూ, నవ్వుతూ క్రీడించసాగారు. ఈ విధంగా మదాంధులైన ఆ అప్సరసలు శుకమహర్షి ఎదుట అనేక పరిహాసాలాడుతూ శృంగార చేష్టలు చేయసాగారు.

దేవేంద్రుని ఆజ్ఞచే సూర్యుడు అక్కడ తపింపచేయకుండా చల్లగా ఉన్నాడు. వాయువు కలువల సుగంధంతో సుఖావహుడై మెల్లగా వీచాడు. చంద్రుడు ఆ సురసుందరీ మణులకు మత్తెక్కిస్తూ చల్లని వెన్నెలను కురిపించాడు. అన్ని ఋతువులలోను పుష్పించే పుష్పాలు అక్కడ ఒకేసారి వికసించడం వలన ఆ వాతావరణం అత్యంత ఆహ్లాదకరంగా ఉంది. మన్మథుడు ఆ తపోవనంలో నిరాటంకంగా సంచరిస్తూ ఆ వసంత ఋతు శోభలో మనోహరంగా విజృంభించాడు. ఆ అమరాంగనలు మదనాతురులై అనేక విధాలైన శృంగార చేష్టలు చేసినప్పటికి ఆ శుక యోగీంద్రుని దృష్టిని తమవైపు మరల్చుకోలేకపోయారు.

శుక మహర్షి శంఖచక్రగదాధారి, వాసుదేవుడు, హృషీకేశుడు, ఈ జగత్తులకు ప్రధాన కారణమైనవాడు, తననాశ్రయించినవారి ఆర్తిని పోగొట్టే వాడు, సర్వ ప్రాణులకు హితుడు, సన్నిహితుడు, స్నేహితుడు, అయిన శ్రీనివాసుని ధ్యానిస్తూ తపోనిష్ఠాగరిష్ఠుడై తన సమీపంలో విలాసచేష్టలు చేస్తున్న ఆ దేవతాంగనలను కన్నెత్తి కూడా చూడలేదు.

## 8. అప్సరసల పరిహాసం :

ఆ విధంగా నిశ్చల చిత్తంతో ఉన్న ఆ శుక యోగీంద్రుని చూచి ఆ దేవకాంతలు సిగ్గు, కోపంతో నిండినవారై తమలో తాము ఇలా అనుకొన్నారు – 'సూర్యునిపై దృష్టి పెట్టుకొని తపస్సు చేస్తున్న ఈ దుర్బుద్ధి ఎవరో కదా! తన ఎదుట తాముగా వచ్చిన అప్సరోగణాన్ని చూడనైనా చూడకుండా ఉపేక్షిస్తున్నాడు. అన్ని తపస్సులకు పరమ ఫలము మేమే కదా! దుష్ట బుద్ధి కలిగిన ఈ మూఢుడు మమ్మల్ని చూడకుండ దేన్ని గురించి ఇక్కడ తపస్సు చేస్తున్నాడు? దేవలోకాధిపతి అయిన దేవేంద్రుడు, శచీపతి, సహస్రాక్షుడు మా సౌందర్యమును దర్శించుట వలన అతని సహస్ర నేత్రములు సఫలమౌతున్నాయి, భూలోకంలో మానవులంతా మా కొరకే యజ్ఞ యాగాదులు చేస్తున్నారు, ధనధాన్యాదులను దానం చేస్తున్నారు. తపస్సు లాచరిస్తున్నారు.

మనోహరాలైన మన మధురాలాపములను, ప్రియ భాషణములను విననివాడు జడుడు. అటువంటి అల్పబుద్ధి జీవితం వ్యర్థం. బాల్యంలో విద్యలను సంపాదించుట, యౌవనంలో విషయసుఖాల ననుభవించుట, వృద్ధాప్యంలో తపస్సు చేయుట కర్తవ్యాలని బుద్ధిమంతులైన పెద్దలు చెబుతారు. సుకుమారుడు, యువకుడు, మిక్కిలి అందగాడు, సుందరీ జనులకు సుందరుడు శృంగారవతులకు శృంగారము అయిన ఇతడు తపస్సు చేస్తున్నాడు.

మానవుడు దేశకాల పరిస్థితులను అతిక్రమించి చేసే పనులు సత్ఫలితాలనివ్వవని బుద్ధిమంతులు చెబుతారు. ఇవి స్వధర్మాచార పరాయణులు, వేదశాస్త్ర విశారదులు, అయిన ధర్మపరాయణులు చెప్పే మాటలు. ఈ మూఢుడు చేతికందిన రత్నాన్ని జారవిడిచి అందని దానకై అర్రులు

చాస్తున్నాడు. ముఖ్యంగా మానవులకు దేవతాస్త్రీలు పూజ్యులు. ఈ దుర్బుద్ధి మనలను గౌరవించకుండా ఆదరించకుండా కూర్చున్నాడు. పూజింపదగినవారిని పూజించకుండుట అనర్థ హేతువని పెద్దలు చెబుతారు అని ఆ దేవాతాస్త్రీలు పరస్పరం సంభాషించుకుంటున్నారు. అయినప్పటికి సదాచార సంపన్నుడు, తపస్సుతో కృశించిన శరీరం కలవాడు, కృష్ణద్వైపాయనుని కుమారుడైన శుకమహర్షి ఓంౖద పెట్టుచున్న గాడిదలను వలె వారిని లక్ష్యపెట్టలేదు.

## 9. శుకమహర్షి పరితాపం :

రంభాది అప్సరసల చేష్టలను చూచి, దుర్వాక్యములను విని శుకమహర్షి తన తపస్సుకు భంగం కలిగిందని చాలా పరితాపం చెందాడు. వాళ్ళ మాటలను గాని, వాళ్ళ చేష్టలను గాని లక్ష్యపెట్టలేదు. అయ్యో! నా తపస్సుకు విఘ్నం కలిగించడానికి వీళ్ళను ఎవరు పంపించారో కదా! అతడెవరో నిష్కారణంగా నాతో శత్రుత్వం వహించాడు. నేను నిరపరాధిని. నా తపస్సును భంగం చేయాలని ఈ అప్సరసలను పంపాడు. వీరు పాప కృత్యములకు మూలభూతాలు. స్వతస్సిద్ధంగానే పాపప్రవృత్తి కలవారు. అనేక విధాలైన అనర్థాలకు వీళ్ళే కారణమని పండితులు చెబుతారు.

వీళ్ళను చూచినంతనే సిగ్గు, విజ్ఞానం, ఆస్తిక్యం, పౌరుషం, జ్ఞానం, ఉన్నతి అన్నీ నశిస్తాయి. ఎంత ధైర్యవంతుడైనా సర్వ ధర్మశాస్త్రాలు తెలిసినవాడైనా వీళ్ళను దర్శించినంతమాత్రానే మోహితుడవుతాడు, కలత చెందుతాడు. వీళ్ళను చూడటమే పాపం. బ్రహ్మదేవుడు సృష్ట్యాదిలో జగత్తు అభివృద్ధి చెందడానికి స్త్రీ పురుషులనే రెండు జాతులను సృష్టించాడు. ఈ స్త్రీపురుషులిరువురు ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధిస్తూ జీవనాన్ని గడపాలి.

లోకంలో అజ్ఞానులు పరస్పరం మోహించుకొని భ్రష్టులవుతున్నారు. కావున అజ్ఞానంతో నిండిన ఈ సంసార సాగరాన్ని దాటగోరి విషయ సుఖమును వీడి ఈ నిర్జనమైన అరణ్యంలో నివసిస్తున్న నా తపస్సుకు విధి విఘ్నం కలిగించింది. నా తపస్సుకు విఘ్నం కలిగించే ఈ అప్సరసలను ఎలాగైనా ప్రయత్నంతో దూరంగా పంపించేయాలి. దుస్తరమైన మహా సంసార సాగరాన్ని దాటగోరేవారిని విషయాలనే మొసలి గట్టిగా పట్టుకుంటుంది. నేను వీరిని శపిద్దామంటే నా తపస్సు తరగిపోతుంది. అందువల్ల నేను వీరిని శపించలేకున్నాను.

ఈ విధంగా శుకమహర్షి చింతిస్తూ సర్వప్రాణుల యందు సమదృష్టి కలవాడై క్రోధాన్ని జయించి, జితేంద్రియుడై, భయంకరమైన మన్మథ బాణములను జయించి, నిశ్చల మనస్కుడై మమకార రహితుడై ఆ హృషీకేశుడైన శ్రీనివాసుని శరణు వేడాడు. పద్మపత్రముల వంటి నేత్రములు కల, ఉజ్జ్వల కాంతితో ప్రకాశిస్తున్న ఆ సురాంగనలు మునీశ్వరుల నిశ్చల ధ్యానాన్ని భంగపరిచే విలాసమైన చూపులతో తపస్సు నందు విముఖతను కలిగిస్తూ, తమ దంతముల కాంతి ప్రసారములచే చీకటులను పోగొడుతూ, మందహాసాలతోను, నేత్ర విలాసాలతోను, శృంగార చేష్టలతోను, నాట్యంతోను ఆ మహర్షి తపస్సుకు భంగం కలిగించుటకై శుకమహర్షిని నలువైపులా చుట్టుముట్టారు.

కాని శుకమహర్షి తపోభంగం కలుగుతుందనే భయంతో వారిని శపించకుండా ఆ భగవంతునే శరణు వేడుతూ నిశ్చల చిత్తుడై ఉన్నాడు. ఆ తరువాత తేనె వలె తీయని మనోభావాలు కల ఆ అప్సరసలు మన్మథ వికారంచే గర్వంతో నిండిన మాటలు పలుకతూ, దుర్బుద్ధితో, స్వభావ సిద్ధమైన చాపల్యంతో, ముల్లోకాలను ఆనందింప చేయుటకు ప్రయత్నిస్తూ శుకమహర్షి శపిస్తాడేమోనన్న భయం లేకుండా ఆయనకు నలువైపులా చుట్టుముట్టి విలాసచేష్టలు చేయసాగారు.

## 10. శుకమహర్షి ప్రార్థన :

అప్పుడు మహానుభావుడు, పరమ నిర్మల మనస్సు కలవాడు, శాంత స్వభావుడు అయిన శుకమహర్షి ఆత్మ రక్షణకై సకల లోకరక్షకుడైన శ్రీమహావిష్ణువును ఈ విధంగా ప్రార్థించాడు –

సకల జనులచేత సేవించబడే లక్ష్మీదేవికి కూడా సేవించదగినవాడు, షడ్గుణైశ్వర్య పరిపూర్ణుడు, శ్రీవత్సలాంఛనుడు, పురాణ పురుషుడు, శంకరాది దేవతాబృందములచే నమస్కరింపబడువాడు, లక్ష్మీదేవికి భర్త అయిన శ్రీనివాసుని శరణు వేడుతున్నాను. సర్వవ్యాపి, సర్వజీవుల హృదయనివాసి, సకల భువనములకు ప్రభువు, పూజ్యుడు, తనకు ఆశ్రయము లేనివాడు, నిర్మల చిత్తం కలవారిచే చింతింపబడేవాడు, పరాత్పరుడు, సంసార సముద్రమునకు అవతల ఉన్న ఉపేంద్రుని శరణు వేడుతున్నాను.

వికసించిన నల్ల అగిసెపువ్వులతో సమానమైన కాంతి కలవాడు, ఎఱ్ఱ తామరల వంటి పాదములు, హస్తములు కలవాడు, వికసించిన తామర పుష్పముల వలె సుందర నేత్రములు కలవాడు, చేతిలో పవిత్రమును ధరించిన శ్రీహరిని శరణు వేడుతున్నాను. సహస్ర సూర్య కాంతితో సమానంగా ప్రకాశిస్తున్న మణుల కాంతితో దేదీప్యమానంగా వెలుగొందుతున్న కిరీటమును ధరించిన శిరస్సు కలవాడు, పగడములు, ముత్యములు, నవరత్నములు కూర్చిన నవరత్న హారములను ధరించిన శ్రీనివాసుని శరణు వేడుతున్నాను.

# తిరుమల సర్వస్వం



– పల్లపోతు వాణిశ్రీ

గత సంచిక తరువాయి

## శ్రీవారి మెట్లు

మనం మొదట్లో చెప్పుకున్నట్టుగా ప్రస్తుతం తిరుమలకు కాలి నడకన చేరుకోడానికి రెండే మార్గాలున్నాయి. ఆ రెండింటిలో, అలిపిరిమార్గం నందు గల విశేషాలన్నింటిని గత కొద్దిరోజులుగా చెప్పుకున్నాం. మరో నడకదారి "శ్రీవారిమెట్లు" గురించి ఈరోజు తెలుసుకుందాం.

**మెట్లెన్ని?**

తిరుపతికి సమీపంలోని శ్రీనివాసమంగాపురానికి కొద్ది దూరం నుండి మొదలయ్యే ఈ మార్గం 2388 మెట్లతో సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలిపిరి మార్గంతో పోలిస్తే ఈ మార్గానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి:

సుమారు 1100 మెట్లు తక్కువ. దూరం కూడా ఆరేడు కిలోమీటర్లు తక్కువే! కేవలం రెండు గంటల కన్నా తక్కువ సమయంలోనే కొండపైకి చేరుకోవచ్చు. కొండపైన, మెట్లమార్గం పూర్తయిన ప్రదేశం నుండి దేవాలయం అతి సమీపంలో ఉంటుంది. అలిపిరి మార్గంలో అయితే కొండపైకి చేరుకున్న తరువాత కూడా, మరో రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాక గానీ ఆలయాన్ని సమీపించలేము. ఈ మార్గం కూడా దారి పొడవునా పైకప్పుతో ఉండి ఎండావానల నుండి రక్షణ కల్పిస్తుంది. అలాగే, మార్గమధ్యంలో మంచినీటి సదుపాయం, శౌచాలయాలు, సామాను, పాదరక్షలు పైకి చేర్చే వెసలుబాటు, ప్రథమచికిత్సా కేంద్రం కూడా ఉన్నాయి. ప్రకృతిసోయగం, వృక్ష, జంతుజాతుల సందడి కూడా దాదాపుగా అలిపిరితో సమానంగానే ఉంటుంది. ఈ మార్గంలో మెట్లు ఎక్కువ ఎత్తులో ఉంటాయని, నడివయసు వారు ఎక్కలేక ఇబ్బంది పడతారని కొందరు చెప్పే మాటలు ఊహాజనితాలే! అలిపిరిమార్గం గుండా నడవగలిగే వారందరూ, ఈ మెట్లను కూడా అంతే సులభంగా అధిరోహించ గలరు.

ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే తెరచి ఉండే ఈ మార్గంలో రోజుకు పరిమితంగా – ప్రస్తుతం ఆరువేల మందిని మాత్రమే – అనుమతిస్తారు.


**అలిపిరే అనుకూలమా?**

అలిపిరి మార్గంతో పోల్చితే శ్రీవారిమెట్ల మార్గంలో

ప్రతికూలాంశాలు కూడా లేకపోలేదు. ఈ మార్గం తిరుపతి పట్టణం నుంచి సుమారుగా 17 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దేవస్థానం వారి "ధర్మరథం" (ఉచిత బస్సులు), అతికొద్ది ప్రైవేటు బస్సులు, త్రిచక్రవాహనాలు తప్ప, తిరుపతి పట్టణం నుంచి రవాణాసౌకర్యం అంతంత మాత్రమే! చాలామంది స్వంత వాహనాల్లోనో లేదా ప్రైవేటు టాక్సీల్లోనో వెళతారు. అలిపిరిమార్గంలో ఉన్నట్లుగా శ్రీవారిమెట్ల మార్గంలో చెప్పుకోదగ్గ చారిత్రక, పౌరాణిక విశేషాలు లేవు. ఈమార్గంలో నడకదారి దాదాపుగా లేకపోవడం వల్ల, ప్రయాణం కొద్దిగా శ్రమతో కూడుకున్నట్లనిపిస్తుంది. మధ్యలో జింకలపార్కు, ఉద్యానవనం వంటి ఉల్లాసభరిత ప్రదేశాలు లేకపోవడం వల్ల, కొంతమంది స్వల్ప అసహనానికి కూడా లోనవుతారు. మార్గమధ్యలో ఘాట్ రోడ్డు ఏమాత్రం తగలదు.

మార్గమధ్యంలో హోటళ్ళు, చిరుతిళ్ళు కూడా అంతగా లేవు కానీ, కనీస సౌకర్యాలకు కొదవలేదు. యాత్రికుల సందడి కూడా తక్కువగానే ఉంటుంది.

కొన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ తరచూ నడక ద్వారా తిరుమలకు చేరుకోవాలనుకునే భక్తులకు, సమయాభావం ఉన్నవారికి, శీఘ్రంగా చేరుకోగలిగే ఈ మార్గం ఎంతో అనువైనది. ఇద్దరు-ముగ్గురు కలిసి మెట్లెక్కుతూ, గోవిందనామాలు బిగ్గరగా ఉచ్చరిస్తుంటే అలసట తెలియదు. మధ్యమధ్యలో



కొద్దిగా ఆగుతూ, పచ్చని ప్రకృతిలో మమేకమవుతూ ప్రయాణం కొనసాగిస్తే చూస్తూ చూస్తూ ఉండగానే కొండపైకి చేరుకుంటాం!

శ్రీనివాసమంగాపురం నందున్న కళ్యాణవేంకటేశ్వరుని ఆలయం నుంచి కొద్దిదూరం మైదాన మార్గంలో ప్రయాణించిన తరువాత ఈ మెట్లమార్గం మొదలవుతుంది.

## పౌరాణిక ప్రాశస్త్యం

శ్రీవారి పాదస్పర్శతో పునీతమై, 'శ్రీపతిమెట్టు' గా కూడా పిలువబడే ఈ మార్గం ఎనలేని పౌరాణిక ప్రాశస్త్యాన్ని పొందింది. ఈ మార్గంలోనే శ్రీవారు అనేకసార్లు వేటనిమిత్తం, వ్యాహ్యాళికై; అశ్వారూఢుడై కొన్నిసార్లు, కాలినడకన కొన్నిమార్లు కొండదిగి పరిసర అటవీప్రాంతాని కేతెంచేవారు. శ్రీనివాసుడు ఈ మార్గం ద్వారానే కొండ దిగి వచ్చి మొట్టమొదటిసారిగా నారాయణవనం పరిసరప్రాంత అడవిలో ఆకాశరాజు తనయ పద్మావతిని కాంచి, తొలిచూపులోనే ఆమెను ప్రేమించారని తదనంతరం వారిరువురికి వకుళమాత చొరవతో పరిణయం జరిగిందని; ఇంతకు ముందే తెలుసుకున్నాం. వివాహానంతరం అగస్త్యుని సలహా మేరకు ఆరు నెలలపాటు ప్రస్తుతం "శ్రీనివాసమంగాపురం" గా పిలువబడే ప్రదేశంలోని అగస్త్యాశ్రమంలో గడిపిన శ్రీవేంకటేశ్వరుడు-పద్మావతి, ఈ మార్గం గుండానే ఆదివారాహక్షేత్రానికి చేరుకుని; తొండమాన్ చక్రవర్తి అప్పటికే అంగరంగ వైభవంగా నిర్మించి సిద్ధంగా ఉంచిన ఆనందనిలయంలో ప్రవేశించారు. ఆ ఆరు మాసాల వ్యవధిలో, శ్రీనివాసుడు సతీసమేతంగా పగటివేళల్లో గడిపినట్లుగా స్థానికులు చెప్పుకునే "ముక్కోటి" ఆలయం కూడా శ్రీనివాసమంగాపురం సమీపంలోని స్వర్ణముఖి నదీ తీరంలో ఉంది. శ్రీమహావిష్ణువు వైకుంఠం నుంచి దిగి వచ్చి మొట్టమొదటగా తిరుమలక్షేత్రంపై కాలుమోపిన "నారాయణగిరి" శిఖరం "శ్రీవారిమెట్ల" మార్గానికి ఆనుకనే ఉంటుంది. శ్రీవారి పాదస్పర్శకు గుర్తుగా నారాయణగిరి శిఖరం మీదనున్న "శ్రీవారిపాదాలు" గా పిలువబడే స్వామివారి దివ్య శిలాపాదాలను ఈనాడు కూడా దర్శించుకుని తరించవచ్చు.

## చారిత్రక ప్రాధాన్యం

14-15వ శతాబ్దాలలో విజయనగర చక్రవర్తుల పరిపాలనా కాలం నందు "శ్రీవారిమెట్ల" మార్గం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయల వారు సతుల సమేతంగా ఈమార్గం ద్వారానే ఏడు సార్లు తిరుమల కేతెంచి, స్వామివారికి లెక్కనేనన్ని కానుకలు సమర్పించి తరించాడు. రాయలవారి మంత్రులు, సామంతులు,




సేనాధిపతులు, ఉన్నతోద్యోగులు సైతం సపరివార సమేతంగా, గుర్రాల పైన, పల్లకీలు, డోలీలు, మేనాల పైన; ఈ మార్గం లోనే ప్రయాణించి తిరుమలకు చేరుకునేవారు. శ్రీవారిమెట్లకు సమీపంలో ఉన్న చంద్రగిరిని ఏలిన ప్రభువులందరూ శ్రీవారి పరమ భక్తులే! తిరుమల ఆలయంలోని నైవేద్యనివేదన ఘంటానాదం విననిదే ఆహారాన్ని తీసుకునేవారు కాదు. వీరు కూడా తరచూ శ్రీవారిమెట్ల మార్గం ద్వారానే తిరుమలేశుణ్ణి దర్శించుకునే వారు. ఆలయనిర్మాణానికి, పునరుద్ధరణకు, ఆ కాలంలో కట్టబడిన లెక్కలేనన్ని మంటపాలకు అవసరమైన బండరాళ్ళను, రాతి ఇటుకలను, గండశిలలను, శిలాస్తంభాలను గజరాజుల చేత, ఈ మార్గం ద్వారానే చేరవేశారని చాలామంది చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు.

మనం "విమానప్రదక్షిణం" ప్రకరణంలో చెప్పుకున్నట్లుగా, 15వ శతాబ్దంలో నియమింపబడ్డ 24 మంది వేదపండితులు శ్రీనివాసమంగాపురం లోనే నివాసముంటూ, శ్రీవారిమెట్టు మార్గం ద్వారా తిరుమలకు చేరుకొని వేదపారాయణం చేసేవారు. అలాగే తిరుమల కొండపై జనావాసాలు అంతగాలేని సమయంలో, అర్చకులు శ్రీనివాసమంగాపురం సమీపంలో నుండే 'కొత్తూరు' అనే గ్రామంలో నివసిస్తూ; వేకువఝామునే బయలుదేరి శ్రీవారిమెట్ల ద్వారా కొండపైకి చేరుకుని అర్చనాభిషేకాదులు నిర్వహించి చీకటి పడకుండానే క్రిందకు చేరుకునేవారు. శ్రీవారి ఆలయంలో ఉండే హుండీని "కొప్పెర" గా పిలుస్తారని మనం ముందుగానే చెప్పుకున్నాం. "కొప్పెర" అంటే వెడల్పాటి మూతి గల పెద్ద లోహపుపాత్ర అని అర్థం. తిరుమలక్షేత్రం మహంతుల అజమాయిషీలో ఉన్నప్పుడు ప్రతిరోజు రెండుపూటలా కానుకలతో నిండిన "కొప్పెర" ను మోసుకుంటూ వెళ్ళి; ఆలయం ప్రక్కనే ఉన్న "మహంతుమఠం" లో చేర్చటానికి ప్రత్యేకంగా పరిచారకులు ఉండేవారు. "కొప్పెర" ను మోసే వారందరూ కలిసి ఒక తెగగా ఏర్పడి శ్రీనివాసమంగాపురం సమీపంలో ఉన్న ఒక గ్రామంలో నివసించుటం వల్ల ఆ గ్రామాన్ని "కొప్పెరవాండ్లపల్లి" గా పిలిచేవారు. వారు కూడా శ్రీవారిమెట్ల మార్గం గుండానే ప్రతిరోజు తిరుమలకు చేరుకునేవారు. ఆ రోజుల్లో శ్రీవారి సేవలకు, ఉత్సవాలకు, నైవేద్యాలకు, నిత్యదీపారాధనకు కావలసినటువంటి ధాన్యం, పప్పుదినుసులు, కూరగాయలు, ఆవునెయ్యి, పాలు, పెరుగు, పూలు మొదలైనవన్నీ కూడా; చంద్రగిరి పరిసర ప్రాంతాల నుండి గంపలలో కెత్తుకుని శ్రీవారిమెట్ల మార్గం ద్వారానే కొండపైకి చేర్చేవారు. ఈ విధంగా, శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి పరిసర గ్రామాలైన ఎగువ రెడ్డివారిపల్లి, దిగువ రెడ్డివారిపల్లి, మెట్టపాలెం, నరసింగాపురం, కాళుహు, చెర్లోపల్లె, పెరుమాళ్ళపల్లి మొదలైన గ్రామాల ప్రజలందరూ, శ్రీవారిమెట్ల మార్గంతో, ఆనాడూ-ఈనాడూ కూడా; ఆత్మీయ సంబంధం, తద్వారా శ్రీనివాసునితో విడదీయరాని అనుబంధం, కలిగి ఉన్నవారే! ఇంతటి మహత్తరమైన చారిత్రక వారసత్వాన్ని సొంతం చేసుకున్న శ్రీవారిమెట్ల మార్గం గుండా కనీసం ఒక్కసారైనా తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకోవటం శ్రీనివాసుని భక్తులందరి చిరకాల స్వప్నం.




# వరలక్ష్మీ వైభవము

డా. దేవులపల్లి పద్మజ

**లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం**
**దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం**
**శ్రీమన్మంద కటాక్ష లబ్ద విభవద్బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం!!**

దివ్యతేజోవంతమైన కాంతి కిరణాలతో భూమిని పరిపాలిస్తున్న శ్రీమహావిష్ణువు యొక్క అర్ధాంగి అవనిపై అడుగడుగునా దర్శనమిచ్చే ఆమె మరో రూపం మనం చలామణిలో నిత్యం మన అవసరాలు తీర్చుకుంటున్న ధనం.

ఆ ధనలక్ష్మిని ప్రత్యేక విధానంలో సేవించుకునే పర్వదినం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం. శ్రావణ మాసం పూర్తి విష్ణు సంబంధ మాసం, కలియుగంలో వెలసిన తిరుమలేశుని జన్మ నక్షత్రమైన శ్రవణం అనుసరించి వచ్చిన మాసం శ్రావణమాసం. ఈ మాసంలోనే ద్వారానాథుని జన్మతిథి మొదలగు ప్రత్యేక విశేషాంశాలు కలిసిన మాసం మరియు సాక్షాత్తు లక్ష్మీదేవికి ప్రీతికరమైన మాసం. గౌరీ సంబంధ వ్రతములు చేపట్టి నిత్య సుమంగళిగా జీవితాన్ని ప్రసాదించమని ఆ పార్వతీదేవిని అభ్యర్థించే ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చు శుక్రవారం సముద్రరాజు కుమార్తె, శ్రీరంగుని అర్ధాంగిగా విష్ణువు మనసులో ప్రతిష్టింపబడిన లక్ష్మీదేవిని వరలక్ష్మిగా సమస్త దేవతలు, మానవులు కొలుచుకుందురు. ఈ వ్రతమును సంకల్పించుకునేవారు ముందురోజు ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకొని, గడపలకు పసుపు కుంకుమలు అద్ది, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మహాలక్ష్మీ ప్రతీ ఇంటికి తిరుగుతూ, ఏ ఇంటి ముంగిట అలికి, ముగ్గులతో అలంకరించి వుంటుందో, ఆ ఇంటిలోనికి ప్రవేశిస్తుందని విష్ణుపురాణంలో చెప్పినట్లు తెలుస్తోంది. అంతులేని ఐశ్వర్యానికి, సిరిసంపదలకు, పుత్రపౌత్రాభివృద్ధికి, కీర్తి ప్రతిష్ఠలకు, విద్యావ్యాపారాభివృద్ధికి తోట్పాటు నందించే మహత్తర వ్రతము వరలక్ష్మీ వ్రతము.

**సర్వార్ధ సాధనకరీ ధానుర్ధారణీ కామలా**
**కరుణాధార సంభూతా కమలాక్ష శశిప్రియా !!**

భూలోకంలో ప్రతి హైందవ స్త్రీ తప్పక ఆచరించదగిన,

అమ్మ ఆశీస్సులు అందుకొను అవకాశం కలిగినది, శ్రావణ శుక్రవారము వ్రతము. అయితే విధివిధానాలు పాటిస్తూ ఈ శ్రావణమాస శుక్రవారాలు మహాలక్ష్మిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ప్రత్యేకించి పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారము జరుపుకునే వరలక్ష్మీ వ్రతము అత్యంత ఫలదాయకమైనది.

ఈ వ్రతమును ఆచరించు స్త్రీలు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి తలకు నువ్వులనూనె రాసుకొని ముఖమునకు, కాళ్లకు, మంగళ సూత్రములకు పసుపు రాసుకొని స్నానాదికాలు ముగించుకొని, పరిశుభ్రమైన వస్త్రము ధరించి పూజ ప్రారంభం చేయాలి. ఈ పూజ చేయు మహిళలు వ్రతము పూర్తియగువరకు నిరాహారముగా నుండి పూజ జరుపవలెను. చక్కటి కలశను ఏర్పాటు చేసుకోవలెను. ఒక కొబ్బరి కాయను ఎంచుకొని, పసుపురాసి, కుంకుమతో అలంకరించి, రాగి, వెండి, ఇత్తడి, బంగారంతో చేసిన ఏదో ఒక పాత్రను తీసుకుని పవిత్రమైన నీటితో కాని, బియ్యంతో కాని నింపి, దానికి సిద్ధం చేసుకున్న కొబ్బరికాయను అమర్చి, ఆ కొబ్బరిపై క్రొత్త వస్త్రం చుట్టవలెను. కలశమునకు చీర కట్టె అలవాటు ఉన్నట్లయితే, కొంచెం పెద్ద కలశ తీసుకుని, దానిని అలంకరించుకోవచ్చును. మనం గుర్తుంచుకోవలసినది భక్తిప్రధానము. పూజకు సిద్ధం చేసుకున్న స్థలంలో వరలక్ష్మిని నిలిపి, యధావిధిని, ఆరోజువున్న మంచి సమయంలో పూజ చేయాలి.

**లక్ష్మీ స్తుష్టిర్మహాధీరా శాంతిపూరణేనవా**
**అనుగ్రహా శక్తిరాద్యా జగజ్జ్యేష్టా జగద్విధిః !!**

శక్తిని అనుసరించి అష్టోత్తరంతో కాని, సహస్రంతో గాని పూజ చేసుకొనవచ్చును. షోషశ పూజ మాత్రం విధిపూర్వకంగా చేయాలి. లభ్యతను అనుసరించి తొమ్మిది రంగుల పువ్వులు, నవధాన్యాలు ఉపయోగించటం శ్రేష్టము. పూజలో నవ తోరం గ్రంధి పూజ చేయాలి. ఇందులో 9 ముడులు ప్రధానము. ఏదైనా ఒక రకం పువ్వులను ఉపయోగించ వచ్చును లేదా తొమ్మిది రకములు పుష్పములతో చేసుకొనవచ్చును. తోరగ్రంధికి ప్రత్యేక మంత్రముతో అర్చించి ధరించవలెను. వ్రతఫలము సంపూర్ణముగా లభించుటకు, ఆ వరలక్ష్మి అనుగ్రహం సిద్ధించుటకు మూడు తోరములను తయారుచేసుకొని, సాక్షాత్తు అమ్మవారిగా భావించే పుణ్యస్త్రీకి ఒకటి, వరలక్ష్మికి ఒకటి, తాను ఒకటి ధరించవలెను.

**అనంతా వైష్ణవీవ్యక్తా విశ్వానందా వికాసినీ!**
**శక్తిర్విభిన్న సర్వార్తిః సముద్ర పరితోషిణీ**

తోరం ధరించేటప్పుడు పఠించవలసిన మంత్రము

**బధ్నామి దక్షిణ హస్తే**
**నవసూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధించ దేహిమే రమే.**

పూజకు సిద్ధం చేసిన స్థలంలో తమలపాకులోగాని, వెండి పళ్ళెంలో గాని, రాగి పళ్ళెంలోగాని పసుపు గణపతిని పెట్టి, పూజ ప్రారంభించాలి.

**"శుక్లాంభరం ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే"**

అని ఆదిదేవుని ప్రార్థించి, అనంతరం మహాలక్ష్మిని వ్రతనియమానుసారంగాపూజించి,నైవేద్య,చందనతాంబులాది సత్కార్య విధులను చేయవలెను. మనకు అందుబాటులోవున్న నైవేద్యాన్ని భక్తితో సమర్పించవచ్చును. ఫలములు, పాయసము, పాలు, తేనె మొదలైనవి సమర్పించవచ్చును. అలాగే పూజావిధిలో వస్త్రం సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోని కొత్త వస్త్రం ఏదైనా సమర్పించవచ్చును. ఆభరణ సమర్పణ విషయంలో కూడా స్వర్ణాభరణముల అవసరం లేదు. వాటి స్థానంలో మంచి పుష్పాలు సమర్పించవచ్చును. విధివిధానం ప్రకారం, భక్తితో, వరలక్ష్మిని పూజించినట్లయితే, సంపదలు, సౌభాగ్యము సిద్ధిస్తాయి.

పూజానంతరము సూతపౌరాణికుడు, శౌనకాది మహర్షులద్వారా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన చారుమతిదేవి కథను చదువవలెను. కథను చదివేటప్పుడు అక్షతలు చేతిలో నుంచుకొనవలెను. తరువాత అక్షతలు అమ్మవారి పాదాలవద్దనుంచి, వాటిని శిరస్సుపై ధరించవలెను. ఆ వరలక్ష్మీదేవికి నవవిధ ప్రదక్షిణలు చేసినట్లయితే, ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కొక్క ఫలితము సంప్రాప్తిస్తుంది. మహాలక్ష్మి అనుగ్రహం కోసం ముత్తయిదువులకు వాయనం ఇవ్వవలెను. ఈక్రింది శ్లోకం చదివిన మంచిది.

**వాయన విధి**

**ఏవం సంపూజ్య కల్యాణీం వరలక్ష్మీం స్వశక్తతః**
**దాతవ్యం ద్వాదశాపూపం వాయనం పి ద్విజాతయే !!**

**వాయనదాన మంత్రము**

**ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వైదదానిచ,**
**ఇందిరా తారకోభాభ్య ఇందిరాయై నమో నమః**

ఈ వాయనంలో పరావర్తనము చెందిన అనగా నానబెట్టిన శనగలు, రెండు పళ్ళు, అరటి పళ్ళు లేక నారికేళం, 5 తమలపాకులు, 2 వక్కలు, పదకొండు రూపాయల దక్షిణ, 5 లవంగాలు, 5 ఏలకులు, గాజులు, కాటుక, పసుపు, కుంకమలు, కలిగినచో చీర లేక జాకెట్టు, సిద్ధం చేసిన తోరంగ్రంధి, పుష్పములు వాయనముగా దానమిచ్చి, వారినుంచి అమ్మవారి తరపున ఆశీర్వచనం పొందవలెను.

**సర్వం సన్మాంగళాని భవన్తు. సర్వం వరలక్ష్మీదేవతార్పణమస్తు.**

ధారావాహికం

# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)

## తొమ్మిదవ శ్లోకం

**కరచరణసరోజే కాంతిమన్నేత్రమీనే**
**శ్రమముషి భుజవీచి వ్యాకులే గాధమార్గే |**
**హరిసరసి విగాహ్యాపీయ తేజో జలౌఘం**
**భవమరుపరిఖిన్న: ఖేదమద్యత్యజామి ||**

సంసారమనే ఈ ఎడారిలో ప్రయాణం చేసి చేసి అలిసిపోయి, ఈరోజు 'హరి' అనే సరస్సు చేరాను. ఎంత సుందరమో ఈ సరస్సు! ఆ హరి కరచరణములే మిలమిలాడుతున్న చేపలు. భుజములే అందు కదలాడే కెరటములు. అన్నింటి శ్రమలు హరించ గలిగే సరస్సు. ఆ రేవులు అవగాహనము చేయడానికి అనుకూలంగా లోతు కలదై ఉంటుంది. అటువంటి హరి సరస్సు లోకి ప్రవేశించి తేజస్సు అనే జలాన్ని తాగి నా బడలికను తీర్చుకుంటున్నాను అని కులశేఖరాళ్వార్లు కీర్తించారు.

ఓ స్వామీ! నా పరిస్థితి ఎడారిలో చుక్క నీరులేని చోట మొలిచిన చెట్టు ఎలా వాడి మోడు అయిపోవునో అట్లున్నది. నేను ఉండే స్థలం ఎటువంటిది అని అడుగుతావేమో? "సుఖము లవలేశమైనను లేకుండా, కష్టాలకు కొలిమి అయినటువంటి సంసారం అనే స్థలంలోఉన్నాను. దీనిలో అత్యంత శ్రమపడి తపించిపోతున్నాను". కాబట్టి ఎడారిలో దాహంతో తపించి పోతున్న వాడికి అదృష్టం కొలది ఒక సరస్సు కనపడితే తనయొక్క శ్రమను ఉపశమనం పొందకుండా వదులుతాడా! అలాగే ఈ సంసారమనే ఈ స్థలంలో ఎంతో అలిసిపోయిన నాకు 'హరి' అనే సరస్సు కనపడింది. నేను మునగ దలుచుకున్న సరస్సు నీవే స్వామీ!

ఈ సరస్సులో తామరలు ఉంటాయా? అంటే నీ యొక్క దివ్య కరచరణములే సరోజములు. చేపలుండునా? అంటే 'కాంతిమన్నేత్రమీనే' దివ్యమైన కాంతితో కదలాడే నీయొక్క నేత్రాలే మీనముల వంటివి.

ఇతరమైన సరస్సులో మునగడం వల్ల తాత్కాలికంగా తాపము తీరుతుంది. కానీ హరి సరస్సు అటువంటిది కాదు 'శ్రమముషి' ఒక్కసారి మునిగిన సకల సాంసారిక దుఃఖములుగా కలిగిన తాపము క్షణంలో మటుమాయమవుతాయి.

సాధారణమైన సరస్సులకు పరిమాణముంటుంది ప్రయత్నంచేస్తే లోతుని తెలుసుకో వచ్చును. 'హరి' అనే ఈ సరస్సుకు ముగింపు తెలియదు. పరమ ప్రామాణికమైన వేదం కూడా పరమాత్మలో ఉండే కళ్యాణ గుణములలో ఒకటైన ఆనందం అనేది లోతు ఎంత ఉన్నది అని చెప్పడానికి ప్రయత్నం చేసి కొంత వరకు చెప్పి ఇక చెప్పలేక కనీసం ఊహించడానికి కూడా సాధ్యం కాదు అని "యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహా" అంటూ అవాఙ్మనస గోచరము అని వెనుతిరిగింది. అటువంటి పరమాత్మ యొక్క కళ్యాణ గుణములనే "తేజో జలౌఘం" తేజో జలములు కలిగిన సరస్సులో తెలిసి పడినా, తెలియక పడినా తరిస్తాము.

**ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే |**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధి: పర్యవ తిష్ఠతి ||**

అని గీతలో తెలిపినట్లు....ఆ జలములు త్రాగిన తరవాత సంసారమనే ఈ స్థలము నుండి విముక్తి పొంది నిత్యముక్తులతో కూడి పరమాత్మ ఆనందమును ఆనందించవచ్చు. అంటూ కులశేఖరాళ్వార్లు "ఖేదమద్యత్యజామి" ఇప్పుడే ఈ సంసారంలో పొందిన బడలికను పరమాత్మ యొక్క దివ్యమైన గుణములను గానం చేస్తూ దాని ద్వారా తాపాన్ని పోగొట్టు కుంటున్నాను. అని పరమాత్మ గుణవైభవాన్ని గుర్తించి మనందరం తరించాలని ఆళ్వార్ల ఉద్దేశ్యము.

కలియుగంలో నామ స్మరణతో భగవంతుని సన్నిధి చేరవచ్చును అని తెల్పుటకు చిన్ని కథ

తుకారాం (1608-1649). మహారాష్ట్ర పూనేలోని దేహూ అనే గ్రామంలో ముగ్గురు సోదరులలో రెండవ వ్యక్తిగా జన్మించాడు. మహారాష్ట్రకు చెందిన మహాభక్తుడు. విఠోబా (పాండురంగడు)ను పూజించేవాడు. ఇతడు 17వ శతాబ్దంలో జీవించాడు. ఇతని ఆధ్యాత్మిక గురువు బాబాజీ చైతన్య.

తుకారాం మరియు వాడుకలో "తుకా" అని కూడా పిలుస్తారు, మహారాష్ట్ర భక్తి ఉద్యమానికి సంబంధించిన పదిహేడవ శతాబ్దపు మరాఠీ కవి. ఇతడు పరమ పుణ్యప్రథమైన పండరిని, మొక్కుబడిగా దర్శించే భక్తులైన, వరకారీలకు చెందినవాడు. తుకారాం పూర్వులు రైతులు. తర్వాతి వారు, వ్యాపారం చేశారు. ఇతని తండ్రి బల్హోబా, గ్రామాధికారిగా పనిచేశారు.



తుకారాం మొదటి భార్య రుక్మాబాయి, కుమారుడు సంతు అప్పట్లో వచ్చిన కరువుకు బలైపోతారు. ఒక వైపున భార్యా బిడ్డలు ఆకలితో అలమటించి పోతున్నా, పాండురంగడి గురించి మాత్రమే ఆలోచించిన అనితర సాధ్యమైన భక్తి ప్రపత్తులు ఆయనలో కనిపిస్తాయి. పాండురంగడు ప్రసాదించినది మినహా వేరెవరు ఏది ఇచ్చినా స్వీకరించనంటూ, శివాజీ మహారాజు పంపిన కానుకలను సైతం తిప్పి పంపిన మహనీయుడు ఆయన. తనను అన్ని విధాలుగా పరీక్షించిన పాండురంగడిని, ఒకానొక సమయంలో తుకారాం నిరసించాడు. అలాంటి పరిస్థితుల్లోనే తుకారాంకి పాండురంగడు దర్శనమిచ్చాడు.

పాండురంగడి ఆదేశం మేరకు అనేక 'అభంగాలు' రచించి వాటిని ఆ స్వామికే అంకితం చేసిన పరమభక్త శిఖామణి. అభంగాలు అంటే మహారాష్ట్రలోని పండరీపురంలో వెలసిన విఠోబా దేవుని కీర్తిస్తూ రాసిన దివ్య కవిత్వం. "అభంగం" అంటే అంతం లేనిది అని అర్థం. భజనలు అంతరాత్మలోకి ప్రయాణానికి నిర్దేశించినవైతే, అభంగాలు ముఖ్యంగా బయట సమాజంతో అనుభవాలను క్రోడీకరించి రాసినవి. పండరీపురానికి వెళ్ళే భక్తులు ఈ అభంగాలను గానం చేస్తూ వెళుతుంటారు. భజనలు చేసేవారే కాక వీటిని దక్షిణ, ఉత్తర భారత సంగీత సంప్రదాయాల ప్రకారం స్వరపరచి శాస్త్రీయ సంగీత కళాకారులు కూడా గానం చేస్తుంటారు. మహారాష్ట్రలో భక్తి సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిన జ్ఞానేశ్వరుడు, నామదేవుడు, తుకారాం మొదలైన వారు అభంగాలను రచించారు.

తనకున్న కొద్దిపాటి ఆస్తి పాస్తులను పాండురంగడి సేవకే ధారపోసిన తుకారాం, 'మానవసేవే మాధవసేవ'గా భావించి భక్తి మార్గాన రాగ పరిమళాలు వెదజల్లాడు. తుకారం తన జీవితంలో ఎక్కువ భాగం, దేహూ అనే గ్రామంలో నివసించాడు. ఇది మహారాష్ట్రలోని, పూనాకు దగ్గర్లోని, చిన్న పట్టణం.

ఆయన రెండో భార్య జీజీబాయి (అవలి అని కూడా పిలుస్తారు). వారికి నలుగురు సంతానం. మహదేవుడు, విఠోబా, నారాయణ, అనే ముగ్గురు కొడుకులు, మరియు భాగీరథి అనే కూతురు.

తుకారాం పాండురంగడికి మహాభక్తుడు. ఇది గొప్ప భక్తునిగా చెప్పుకుంటూ, ఇద్దరు శిష్యులతో, గ్రామాన్ని మోసంచేస్తున్న కుంభోజీకి ఇబ్బంది కలిగిస్తుంది. తుకారాం ప్రాభవాన్ని తగ్గించడానికి, అనేక ప్రయత్నాలు చేస్తాడు. అతనిపై వేశ్యను ప్రయోగిస్తాడు. ఆమె తుకారాం భక్తురాలిగా మారిపోతుంది. కుంభోజి ఆలయంలోని, పాండురంగని విగ్రహాన్ని, నూతిలో పడవేసి, శూద్రుడైన తుకారాం చర్యల్ని భరించలేని పాండురంగడు గుడి నుండి వెళ్ళి పోయాడని ప్రచారం చేస్తాడు. అదే విషయాన్ని శివాజీ మహారాజుకు ఫిర్యాదు చేస్తాడు. ఇది వరలో తుకారాం గురించి విన్న శివాజీ, అతనికి కానుకలు పంపగా, తుకారాం తిరస్కరించి ఉన్నాడు. అతణ్ణి పరిశీలించే దృష్టితో, శివాజీ ఫిర్యాదును విచారించే నిమిత్తం, తుకారాం దగ్గరకు వస్తాడు. శివాజీ చూస్తుండగానే, పాండురంగని విగ్రహం, తిరిగి ఆలయంలో ప్రత్యక్షం ఔతుంది. ఈ లోపులో, కుంభోజీ అందించిన సమాచారంతో, శివాజీ శత్రువులు, సిద్ధంగా లేని శివాజీని చుట్టు ముట్టుతారు.

తుకారాం కోరిక మేరకు, పాండురంగడు, అనేక శివాజీ మూర్తులుగా, శత్రువుల్ని తుద ముట్టిస్తాడు. శివాజీ తుకారాం భక్తి తత్పరతకు పరవశుడై, తనను శిష్యునిగా స్వీకరించ మంటాడు. క్షాత్రమున్నవారు రాజ్యాన్ని రక్షించాలని, శివాజీకి తెలియజేస్తాడు.

ఆ స్వామి ఆదేశం మేరకు ఆయన అభంగాలు రాయడం మొదలు పెట్టగా, ఆయన పనికి ఎలాంటి అంతరాయం కలగకుండా భార్య చూసుకుంది. తుకారం నిస్వార్థమైన భక్తికి మెచ్చిన పాండురంగడు, సశరీరంతో ఆయనను వైకుంఠానికి తీసుకువెళ్లాడు. అలా మహాభక్తుడైన ఆ వాగ్గేయకారుడి జీవితం చరితార్థమైంది. తుకారాం జీవితంలో దైవలీలలకు సంబంధించిన ఎన్నో అపూర్వమైన ఘట్టాలు చోటుచేసుకున్నాయి. తుకారాంకి పాండురంగడి ధ్యాస తప్ప

మరో ఆలోచన వుండేది కాదు. ఆ స్వామిపై అనేక అభంగాలను రచిస్తూ వాటిని పాడుకుంటూ పరవశించి పోయేవాడు. తనకి మంచి జరిగినా, చెడు జరిగినా ఆ పాండురంగడి అనుగ్రహం గానే భావిస్తూ నిరంతరం ఆయన సేవలోనే కాలం గడిపేవాడు. అలాంటి తుకారాంకి ఒకసారి ఒక పరీక్ష ఎదురైంది.

తుకారాం పాండురంగడిపై అభంగాలను రాసి పాడుతుండటం, అవి వింటూ ప్రజలు మైమరచి పోతుండటం, అగ్రవర్ణానికి చెందిన రామేశ్వరభట్టుకి, అసూయ కలిగించింది. గ్రామ ప్రజలు, తన కంటే తుకారాంనే ఎక్కువగా గౌరవించడాన్ని, ఆయన సహించ లేకపోయాడు. గ్రామస్తుల సమక్షంలో, తుకారాంని దోషిగా నిలబెట్టి, తక్కువ కులంలో పుట్టిన ఆయనకి, భగవంతునిపై భజనలు ... కీర్తనలు రాసే అర్హత లేదని చెప్పాడు. ఇక నుంచి, ఆ అలవాటు మానుకోవడమే కాకుండా, అంతవరకూ రాసినవి, ఇంద్రాణి నదిలో పారేయ్యాలని, ఆదేశించాడు.

అది పాండురంగడు తన భక్తికి పెట్టిన పరీక్షగా భావించిన తుకారాం, తాను అభంగాలను రాసిన తాళపత్రాలపై, నాపరాతి పలకలు పేర్చి, వాటిని గుడ్డలో మూటగట్టి, ఇంద్రాణి నదిలో ముంచేశాడు. తనకి ఎంతో ఇష్టమైన అభంగాలను వదిలేసినందుకు బాధతో, ఎంతో శ్రమతో కూర్చిన అభంగాలు, నీటిపాలు కావటంతో, కలత చెందిన తుకారాం, నది ఒడ్డునే, నిద్రాహారాలు మాని ఉండి పోతాడు. ఆరోజు నుంచి ఆయన నిద్రాహారాలను మానేశాడు. అలా ఓ 13 రోజులు గడిచిపోయాక, తుకారాం ఇంద్రాణి నదిలో ఎక్కడైతే ఆ అభంగాలను ముంచాడో, అక్కడే అవి పైకితేలి, గ్రామస్తులకు కనిపించాయి. అవి ప్రవాహానికి కొట్టుకుపోకుండా వుండటం చూసి, అంతా ఆశ్చర్య పోయారు. ఈ విషయం తుకారాంకి తెలియగానే, ఆయన నది ఒడ్డుకు చేరుకున్నాడు. ఆ తాళపత్రాలు ఆయనున్న దిశగా కొట్టుకు వచ్చి ఆగాయి. దివ్య శక్తి అభంగాలు తిరిగి ప్రసాదించగా ఆనంద పరవశుడౌతాడు.

ఆ పాండురంగడికి తనపై దయ కలిగిందంటూ, ఓ బిడ్డను దగ్గరికి తీసుకున్నట్టుగా, ఆయన ఆ తాళపత్రాల మూటను ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకున్నాడు. ఈ దైవలీలను చూసిన వారంతా, ఆశ్చర్యచకితులయ్యారు. ఆనోటా ఈనోటా, ఈ విషయం రామేశ్వర భట్టుకి తెలిసింది. అంతే ఆయన పరుగు పరుగున వచ్చి, తుకారాం పాదాలపై పడ్డాడు. అతని పట్ల అహంకారంతో వ్యవహరించినందుకు, మన్నించమంటూ ప్రాధేయపడ్డాడు. తుకారాం పట్ల నిర్దయగా ఉన్న పీఠాధిపతి సైతం, తుకారాం భక్తిని తెలుసుకుంటాడు.

ఈ సంఘటన తరువాత, తుకారాం విషయంలో, గ్రామస్తుల ప్రవర్తనలో, ఎంతో మార్పు వచ్చింది. తుకారాం మాత్రం, సాధారణమైన వ్యక్తిగా, అతి సాధారణమైన జీవితాన్నే, గడిపాడు. ఆ పాండురంగడి సేవలోనే, తరించాడు.

తుకారాం ఆత్మానుభూతి పొందిన మహానుభావుడు. ఆయన అటు భగవంతునికి, ఇటు జనులకు, సేవలందిస్తూ వచ్చాడు. భగవన్నామ మహత్యాన్ని, ఆయన తన జీవితంలో, పలుమార్లు నిరూపించి చూపించాడు. అటువంటి ఒక సంఘటన....

ఒక రోజు ఇరుగుపొరుగు ఇళ్ళలోని స్త్రీల మధ్య ప్రారంభమైన కలహం, చిలికి చిలికి గాలివాన అయినట్లు, ఉగ్రరూపం దాల్చింది. ఆ స్త్రీలు ఇద్దరు కలిసి, ఒకే చోట పిడకలు తట్టారు. ఎండిన తరువాత. అవి ఒకటిలో ఒకటి కలసిపోయాయి. ఎవరివి ఎన్ని అని తెలుసుకోవటానికి సాధ్యంకాక, కలహించు కోసాగారు.

తుకారాం అప్పుడు ఆ దారిగుండా పోతున్నాడు. ఆయన విషయం విన్న తర్వాత. పిడకలను విభజించి ఇస్తానని చెప్పాడు. ఎండిన అన్ని పిడకలనూ ఆయన ముందు గుమ్మరించారు. ఆయన ఒక్కొక్క పిడకనూ తీసి చెవి వద్ద పెట్టుకుని చూసి, వాటిని రెండు భాగాలుగా విభజించాడు. ఆ తరువాత.!

“అమ్మా! మీ ఇద్దరిలో ఎవరు పిడకలు తట్టుతున్నప్పుడు విఠల విఠల అని చెబుతూ చేశారు?” అని ప్రశ్నించాడు. నామం ఉచ్చరిస్తూ పిడకలు తట్టిన స్త్రీ ముందుకు వచ్చింది. “అమ్మా! ఎడం వైపు ఉన్న పిడకల గుట్ట నీది. కుడి వైపుది ఆమెది” అని తుకారాం చెప్పాడు. ఈ విడ్డూరం చూడడానికి వచ్చిన వారు స్వామి “ఇదేమిటి?” అని ఆశ్చర్యపోతూ అడిగారు.

మనం భగవన్నామం ఉచ్చరిస్తున్నప్పుడు, నామతరంగాలు, చుట్టుప్రక్కలంతా వ్యాపిస్తాయి. నామ ప్రతిధ్వనులు, ఈ పిడకలలో నెలకొని ఉన్నాయి. అవి విని, వాటిని విభజించ గలిగాను అని తుకారాం, వివరించి చెప్పాడు. నామ జపానికి చోటు, సమయం, చూడవలసిన అవసరం లేదు. నామజపం, మనకు శ్రేయోదాయకమేకాక. చుట్టూ వాతావరణాన్ని కూడా, పవిత్రం చేస్తుంది.

తుకారాం పాండురంగని దివ్య లీలలను గూర్చి గానం చేయుచూ, నామ సంకీర్తన చేయుచూ అనేక ప్రదేశములు పర్యటించెను. ఒకనాడు ఒక గ్రామంలో తుకారాం సంకీర్తనా కార్యక్రమం నిర్వహించవలసి వున్నది. అది పూనా దగ్గర లోహగావ్, అనే ఒక చిన్న గ్రామం, పూణే నుండి 13 కి.మీ దూరంలో ఉంది. లోహగావ్ తుకారాం తల్లితండ్రుల స్వస్థలం. అందువల్ల, తుకారం తరచుగా లోహగావ్కు వెళ్లి అక్కడ మతపరమైన ప్రసంగాలు చేసేవారు. లోహగావ్ నివాసితులు గణనీయమైన సంఖ్యలో అతని శిష్యులు గా వున్నారు.

అలాంటి ఒక సందర్భంలో, తుకారం పూనాలో మతపరమైన



ప్రసంగం చేస్తున్నప్పుడు, ఒక అద్భుతం జరిగింది.

లోహగావ్లో శివశంకర్ అనే భక్తుడు ఉండేవాడు. పేదకుటుంబీకుడు. ఆశలు లేని అతను తన భార్య, కుమారునితో ఆదర్శ జీవితం గడుపుతూ వున్నాడు. అతనికి తుకారాం అభంగాలు అంటే ప్రాణం. అతను తుకారాంని తన గురువుగా నిర్ణయించుకున్నాడు. అతను క్రమం తప్పకుండా తుకారాం ఉపన్యాసానికి హాజరయ్యేవాడు.

ఆ రోజు, అతని ఒక్కగానొక్క కొడుకు తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడు. వైద్యుని తీసుకువచ్చి చికిత్స చేయిస్తాడు. కానీ వ్యాధి నయం కావడం లేదు. క్షణక్షణానికీ వ్యాధి తీవ్రరూపం చెందుతోంది. శివశంకర్ భార్య ఆందోళన పడుతోంది. సమయం గడుస్తున్నా కొద్దీ బాలుడి పరిస్థితి విషమిస్తోంది. అప్పుడు కూడా అతను పాండురంగని సంకల్పం ఎలా వుంటే అలా జరుగుతుంది అని, దేవునిపై పూర్తి నమ్మకంతో తుకారాం ఉపన్యాసానికి బయలుదేరాడు.

అతను తన ఇంటి నుండి బయలుదేరుతున్నప్పుడు, అతని భార్య పదేపదే అతనిని అభ్యర్థించింది, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న పిల్లవాడిని విడిచిపెట్టి ఉపన్యాసానికి వెళ్లవద్దు. అయితే సమస్త జీవరాశికి పరమేశ్వరుడే నిజమైన సంరక్షకుడు అని చెప్పి వెళ్లిపోయాడు.

కొద్దిసేపటికే, అతని కుమారుడు మరణించాడు మరియు అతని భార్య తట్టుకోలేకపోయింది. తమ బిడ్డ అనారోగ్యం గురించి తెలిసినప్పటికీ, తన భర్త ఉపన్యాసానికి వెళ్లిపోయాడని ఆమె ఆగ్రహించింది. ఆమె కోపాన్ని అదుపు చేసుకోలేక కుమారుడి మృతదేహాన్ని ఎత్తుకుని నేరుగా ఉపన్యాస వేదిక వద్దకు చేరుకుంది.

ఆమె తన చనిపోయిన కొడుకు మృతదేహాన్ని తుకారాం ముందు పడుకోబెట్టి, "మా కొడుకు మరణశయ్యపై ఉండగా, అతని తండ్రి మనకు దేవుడిపై పూర్తి విశ్వాసం ఉండాలని, మనం ఏమీ చేయకూడదని చెప్పి ఉపన్యాసానికి బయలుదేరాడు. ఇప్పుడు చెప్పు, నీ నారాయణ ఎక్కడ ఉన్నాడు?"

ఆమె భీకరమైన మాటలు విని, ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు, ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. తుకారం, పరిస్థితి యొక్క తీవ్రతను గ్రహించాడు, అతను ఆ తల్లి దుస్థితికి చాలా జాలిపడ్డాడు. మనసులో తీవ్ర వేదనతో పాండురంగడిని పిలవడం ప్రారంభించాడు.

అతను ప్రార్థించాడు, "ఓ పాండురంగా! మేము పురాణాలలో మీ ఆధిపత్యాన్ని చదివాము, మేము కేవలం మీ సేవకులమే. ప్రాణం లేని జీవులకు జీవం పోసే కాలక్షేపం మీరు మాత్రమే చేయగలరు! నీ భక్తుని విపత్తును నివారించడమే నీ నినాదం. హే పాండురంగా! దయతో మమ్ములను కరుణించి, చనిపోయిన ఈ బాలుడిని బ్రతికించి నీ పరాక్రమాన్ని మాకు చూపుము."

ఆ సమయంలో, అతను పలికిన ఒక ద్విపద:

"అశక్య తే తుమ్హా నహి నారాయణ" అంటే: ఓ, నారాయణా నీకు అసాధ్యమైనది ఏదీ లేదు.

తన హృదయపూర్వక ప్రార్థన తరువాత, అతను సమావేశమైన భక్తులందరినీ పాండురంగ నామాన్ని బిగ్గరగా జపించమని కోరాడు. భక్తులందరూ కళ్లు మూసుకుని పాండురంగ నామస్మరణలో మునిగిపోయారు. వాళ్ళు కళ్ళు తెరిచి చూసేసరికి బాలుడు అప్పటికే లేచి తమతో పాటు శ్రీహరి నామస్మరణ చేస్తున్నాడని గుర్తించారు!

ఆ విధంగా, తుకారం యొక్క పవిత్రత ప్రతి ఒక్కరికీ స్పష్టమైంది. ఈ అద్భుత వార్తతో పట్టణాలు, గ్రామాలు దద్దరిల్లాయి. తుకారంను అత్యున్నత సాధువుగా కీర్తించారు.

"సంసారిగా ఉంటూ, తన కర్తవ్యాలన్నిటినీ నెరవేరుస్తూనే, అధ్యాత్మికతను కూడా కొనసాగించడం, తుకారాం ప్రత్యేకత" అని శ్రీమహావిష్ణువు, శ్రీలక్ష్మికి తెలియజేసి, అతని కోసం గరుడ వాహనాన్ని పంపి, తన వద్దకు రప్పించుకున్నాడు.

భక్తునకు భగవంతుని కృపాజలప్రపూర్ణమైన దివ్యకాసారము లభించినది. అతడు సంతోషముగా ఎలుగెత్తి పలుకుచున్నాడు. 'ఈ సంసారమనే ఎడారి బాధ నుండి విముక్తి లభించినది. ఇదిగో ఈ క్షణమే దీనిని విడిచిపెడుతున్నాను'. అని

తుకారాంచే చెప్పబడిన కొన్ని సూక్తులు:

సాధువులు దీపావళి, దసరా పండుగలలో మన ఇండ్లకు వస్తారు. వారి రాక వైకుంఠం కదలివచ్చినట్లే వుంటుంది.

మనసుకు కొంచెంగా దైవభక్తి రుచి గనుక చూపిస్తే అది దానిని ఇంక వదలనే వదలదు.

విగ్రహాన్ని మనస్సులో ప్రతిష్ఠించు, అది అక్కడే పూజలందుకుంటుంది.

దశరథ పుత్రుడు రాముడు మొన్నటివాడు కాగా, ఆత్మారాముడు శాశ్వతుడు.

సంత్ తుకారాం అభంగ కవిత్వం అనే మరాఠీ సాహిత్య శైలిని స్వరపరిచారు, ఇది జానపద కథలను ఆధ్యాత్మిక ఇతివృత్తాలతో కలిపింది. 1632 మరియు 1650 మధ్య, అతను తన రచనల మరాఠీ భాషా సంకలనమైన 'తుకారాం గాథ'ను రచించాడు. 'అభంగ గాథ' అని కూడా ప్రసిద్ధి చెందింది, ఇందులో దాదాపు 4,500 అభంగాలు ఉన్నాయని చెబుతారు.

తుకారాం వైష్ణవ మతంలో సర్వోన్నత దేవుడు అయిన విఠలు (కృష్ణుడి రూపం) ని యొక్క భక్తుడు. వార్కారీ సమాజం ఆయనను విశేషంగా ఆరాధిస్తారు. తుకారాం కవిత్వం నామ్దేవ్తో ప్రారంభమైన భగవత్ సంప్రదాయం యొక్క పరాకాష్ఠగా విస్తృతంగా గుర్తించబడింది. నామ్దేవ్, మరియు పాండురంగడు స్వయంగా కలలో సందర్శించిన తరువాత, తుకారాం అభంగాలు (మతపరమైన కవిత్వం) రాయడం ప్రారంభించాడు.

సంత్ తుకారాం, మహారాజ్ అభంగ అనే భక్తి కవిత్వానికి మరియు కీర్తన అని పిలువబడే ఆధ్యాత్మిక పాటలతో సమాజ ఆధారిత ఆరాధనకు ప్రసిద్ధి చెందారు.

తుకారాం జీవితం భారతదేశంలోని అతిపెద్ద కామిక్ పుస్తక ధారావాహిక అయిన అమర చిత్ర కథ యొక్క 68వ సంచికలో ఉంది.

భారత ప్రభుత్వం 2002లో 100 రూపాయల వెండి స్మారక నాణాన్ని విడుదల చేసింది.

హరి కీర్తనమైన పిదప అన్ని శ్రమలకోర్చి హరి సరోవరం చేరుకున్న భక్త తుకారాం ద్వారా, కులశేఖరులు మనకు హరి సహాయం ఎందుకు కావాలో ఆర్తితో సెలవిస్తూ, విజ్ఞాపన చేశారు చూడండి.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com





# మహామాయ

– డి. శ్రీనివాస దీక్షితులు

ఈ కథ ఈనాటిది కాదు
ప్రళయకాలంలో జరిగిన అమ్మ కథ.
మహాసముద్రంలో ముల్లోకాలూ మునిగి పోయాయి.
మహావిష్ణువు ఆ నీళ్ళల్లో ఆదిశేషుని పానుపు మీద పవళించి ఉన్నాడు. యోగ నిద్రలో ఉన్నాడు. అప్పుడు ఆ పరమపురుషుని చెవిలోంచి రెండు గుబిలి ఉండలు జారి సముద్రంలో పడిపోయాయి.
ఆ గుబిలి ఉండల్లోంచి మధుడు, కైటభుడు అనే ఇద్దరు దానవులు జన్మించారు. ఆ దానవులు ఆ నీళ్ళల్లోనే ఆడుతూ పాడుతూ పెరిగి పెద్ద వాళ్ళయ్యారు. ఎంతో సుఖంగా కాలం గడుపుతున్న ఆ సోదరులిద్దరికీ ఒకనాడు తమ మూలాల్ని తెలుసుకోవాలనే కోరిక కలిగింది.

ఎంతగా ఆలోచించినా వాళ్ళకి సమాధానం దొరకలేదు. "ఒరేయ్ మధూ! మనకే మనం పెరిగిన ఈ నీళ్ళకీ ఆధారం మహాశక్తి కావచ్చు అనిపిస్తోందిరా!" అన్నాడు కైటభుడు.

దానవుడి నోటినుంచి ఆమాట రాగానే ఆకాశం నుంచి వాగ్ బీజం (మంత్రాక్షరం) వినిపించింది. ఆ మంత్రాన్ని సోదరులిద్దరూ పదేపదే మననం చేసుకున్నారు. అప్పుడు ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది.

మొదట తమకి వినిపించింది మంత్రమనీ... తర్వాత కనిపించిన మెరుపు సగుణధ్యానమనీ దానవులు గ్రహించారు. ఆ క్షణం నుంచి అన్న పానీయాల్ని ముట్టుకోకుండా నిరాహారులై ఇంద్రియ నిగ్రహంతో వెయ్యేళ్ళపాటు మధు-కైటభులు కఠోరతపస్సు చేశారు.

దానవుల తపస్సుకి మెచ్చి మహామాయ ప్రత్యక్షమయింది. వరం కోరుకోండి అంది.

తమకి స్వేచ్ఛా మరణం కావాలని వరం కోరుకున్నారు దానవులు. అలాగే వరాన్ని అనుగ్రహించి మాయమయింది

మహామాయ.

వరగర్వంతో మధు-కైటభులు సముద్రంలో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఆవిధంగా తిరుగుతూ ఉండగా ఒకరోజు ఆ సోదరులకి పద్మంలో కూర్చుని బ్రహ్మదేవుడు కనిపించాడు. వెంటనే మధు-కైటభులు ఆయన దగ్గరికి వెళ్ళారు.

"ఏయ్ పెద్దాయనా! మాతో యుద్ధం చెయ్యి. లేదా నీ పద్మాసనాన్ని మాకివ్వు" అని గద్దించారు దానవులు. వాళ్ళ మాటలకు భయపడి విష్ణువు దగ్గరికి పారిపోయాడు. బ్రహ్మదేవుడు, దానవులు బారి నుంచి తనని కాపాడమని విష్ణువుని ఆయన అర్థించాడు.

కానీ మహామాయా ప్రభావంతో యోగానిద్రలో ఉన్న విష్ణువు బ్రహ్మమాటల్ని వినిపించుకోలేదు. ఆ సంగతి తెలుసుకున్న బ్రహ్మ మహామాయని ప్రార్థించాడు. విష్ణువు శరీరాన్ని తన ప్రభావం నుంచి విడిచిపెట్టింది మహామాయ. విష్ణువు నిద్ర నుంచి మేలుకున్నాడు. జరిగిందంతా విష్ణువుకి వివరించాడు బ్రహ్మదేవుడు. అంతలో బ్రహ్మని వెదుక్కుంటూ వచ్చారు దానవులు.

తమతో యుద్ధం చెయ్యమని మధు-కైటభులు మళ్ళీ బ్రహ్మదేవుని అడిగారు. అప్పుడు విష్ణువు కల్పించుకుని దానవుల్ని ముందు తనతో యుద్ధం చెయ్యమని పిలిచాడు.

ఆ దానవులిద్దరూ ఒక్కొక్కరుగా విష్ణువుతో యుద్ధానికి దిగారు. అలిసిపోతూ.. విశ్రాంతి తీసుకుంటూ యుద్ధం చేస్తున్నారు దానవులు.

అయిదు వేల సంవత్సరాల పాటు విష్ణువు మధు-కైటభులతో యుద్ధం చేశాడు ఒంటరిగానే అందువల్ల ఆయన బాగా అలిసిపోయాడు.

"దానవులారా! నేను కూడా కొంతసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ మీతో యుద్ధం చేస్తాను" అన్నాడు విష్ణువు.

అందుకు దానవులిద్దరూ అంగీకరించారు.

మహామాయ నుంచి స్వేచ్ఛా మరణాన్ని వరంగా పొందారు మధు-కైటభులు. ఆ విషయాన్ని దివ్యదృష్టి ద్వారా విష్ణువు తెలుసుకున్నాడు.

"ఇక ఈ రాక్షసులతో యుద్ధం చెయ్యటం వ్యర్థం. వీళ్ళకి వరమిచ్చిన మహామాయనే శరణు వేడటం శ్రేయస్కరం" అనుకున్నాడు విష్ణువు.

ఆలస్యం చెయ్యకుండా ఆయన మహామాయని వేడుకున్నాడు. మహామాయ ప్రసన్నురాలయింది.

"శ్రీహరీ! నువ్వు మరింత ఉత్సాహంతో యుద్ధం చెయ్యి. నా వరబలంతో మదించి ఉన్న మధు-కైటభుల్ని వంచనతో వధించాలి. వేరు దారి లేదు. ముందుగా ఈ సోదరుల్ని నా మాయతో మోహింపజేస్తాను. అప్పుడు నువ్వు ఈ లోక కంటకుల్ని తేలికగా చంపగలవు" అని ఉపాయం చెప్పింది మహామాయ.

దానవ సోదరులు వచ్చి విష్ణువుని యుద్ధానికి రమ్మని కవ్వించారు. విష్ణువు వాళ్ళతో యుద్ధం ఆరంభించాడు. వాళ్ళని పిడికిళ్ళతో కొట్టాడు విష్ణువు. వాళ్ళూ అలాగే చేశారు. కానీ ఆ దానవుల వరబలం ముందు విష్ణువు నిలవలేకపోతున్నాడు. ఆ విషయాన్ని మహామాయ గ్రహించింది.

ఆమె తన మాయని ప్రయోగించింది

చిలిపిగా రాక్షసుల వంక చూసింది.

ఆ ఒక్క చూపుతోనే వాళ్ళ మనసులు కామంతో నిండి పోయాయి. వాళ్ళు దారి తప్పారు. యుద్ధంలో ఏకాగ్రత లోపించింది. అదే అదనుగా భావించాడు విష్ణువు. మధు-కైటభులతో ఆయన మాటలు కలిపాడు.

"దానవులారా! నాతో మీరిద్దరూ అద్భుతంగా యుద్ధం చేశారు. నాకు చాలా ఆనందం కలిగింది. మిమ్మల్ని మెచ్చుకుంటున్నాను. మీకు వరమివ్వాలని అనిపించింది. మీరద్దరూ ఏదైనా వరం కోరుకోండి" అన్నాడు విష్ణువు.

ఆయన మాటల్ని విన్న దానవుల అహం దెబ్బతింది. అదీకాక వాళ్ళు మోహంలో ఉన్నారు.

"శ్రీహరీ! నువ్వు మాకు వరాలిచ్చేంత గొప్పవాడివా? ఛీ.. ఛీ! నీకే మేం వరాలిస్తాం కోరుకో" అన్నారు దానవులు అహంకారంతో.

విష్ణువు చిరునవ్వు నవ్వాడు.

"నా చేతిలో మీరిద్దరూ మరణించాలి" అని విష్ణువు వరం కోరుకున్నాడు. గతిలేక మధు-కైటభులు విష్ణువుకి వరమిచ్చేశారు. కానీ వాళ్ళు నీళ్ళు లేని చోట మాత్రమే మమ్మల్ని వధించాలి అని నియమం పెట్టారు.

తన తొడల్ని బాగా పెంచి వాళ్ళ శిరస్సుల్ని ఆ తొడలమీద ఉంచమన్నాడు విష్ణువు.

దానవులు కూడా తమ శరీరాల్ని వెయ్యి యోజనాలకి పెంచారు. విష్ణువు వెంటనే తన తొడల్ని అమాంతంగా రెండువేల యోజనాలకి పెంచాడు. మధు-కైటభులు తమ శిరసుల్ని విష్ణువు తొడలమీద ఉంచారు.

విష్ణువు స్మరించగానే సుదర్శనచక్రం వచ్చి ఆయన చేతిలో నిలిచింది. ఆ చక్రాయుధంతో విష్ణువు మధు-కైటభుల్ని వధించాడు. ఆ దానవుల మేదస్సు (కొవ్వు) సముద్రజలాల మీద తెట్టుగా తేలింది. ఆ కొవ్వు భూమిగా రూపు దిద్దుకుంది. ఆవిధంగా మహామాయ అనుగ్రహంతో విష్ణువు మధు-కైటభుల్ని వధించి లోకాలకి ఆనందం కలిగించాడు.

# నాగపంచమి

– డా. అహల్యాదేవి

శ్రావణశుద్ధ పంచమినాడు నాగులు ఆరాధించబడుతాయి. నాగుల ఆరాధన వేద కాలం నుండే విశ్వాసం ఉన్నదని అనేక ఆధారాలు చెబుతున్నాయి. దీనికి ఉదాహరణలు కృష్ణుడి బాల్యంలో చేసిన కాళీయ మర్ధనం, కద్రువ శాపం, జనమేజయుని సర్పయాగం వంటి గాధలు. అగ్ని పురాణం, స్కంధ పురాణం, నారదపురాణాలలో నాగుల విశిష్టత గురించి ప్రత్యేకంగా వివరించబడి వుంది. ఈ భూమండలాన్ని తన దేహంపై భరిస్తున్న అనంత శేషుడు కించిత్తు బడలికతో ఎప్పుడైనా కదిలితే వెంటనే భూమి దద్దరిల్లుతుంది.

శ్రావణమాసం వచ్చిందంటే వర్షాలు పడడం ఆరంభమవుతాయి. దాంతో ఛిద్రమయ్యే పుట్టలోనున్న వివిధ సర్పాలు తలదాచుకోవడానికి వెలుపలికి వచ్చి ఇళ్ళల్లోను, వెచ్చగా ఉండే ప్రాంతల్లోను చేరుతుంటాయి. అలా జన జీవనంలోకి వచ్చి నప్పుడు వాటివలన ప్రజలకు హాని కలిగే అవకాశం ఉంది. ఆ హానినుండి రక్షించుకోవడానికి వీటిని ఆరాధించి ప్రసన్నం చేసుకుంటారు. తమను ఆరాధించి ప్రాధేయపడ్డవారికి ఎటువంటి హాని కలిగించకుండా వారిని సంరక్షిస్తాయి. నాగులు ఈనైజం వాటికి స్వతఃసిద్ధంగా ఉన్నవి.

**నాగపంచమి పూజ**

శ్రావణశుద్ధ పంచమి సర్పపూజకు ఉద్దిష్టమైంది. భారతీయులకు నాగపూజ తరతరాల ఆచారంగా ఉంది. మట్టితో చేసిన పాముని ప్రతి కుటుంబంవారు కొనుక్కుంటారు. లేదా గోడమీద పసుపుతో కాని, మంచి గంధంతో కాని ఐదులేక ఏడులేక తొమ్మిది పాములను చిత్రించి పూజిస్తారు. స్త్రీలు ఈపూజ ఉదయాన్నే చేస్తారు. పువ్వులు మంచి గంధం, పసుపు వేపుడు బియ్యం, చిక్కుడు గింజలు, వేపిన ఉలవలు, మొదలైనవి పూజా ద్రవ్యాలు. దీపారాధన, కర్పూర నీరాజనం, ఫలాలు, భక్షాలు, నైవేద్యం, వంటివి పూజకు తయారుచేసుకోవాలి. ఈనాడు ఉడక బెట్టిన పదార్థాలు మాత్రమే భుజించడం ఆచారం. మిగతా రోజుల్లో కంటే ఈనాడు ఆహారపదార్థాలు ముతకవిగా ఉండేట్టు జాగ్రత్త పడాలి. పూజస్థలంలో రోజంతా దీపం ఉంచాలి. పాలు, భక్ష్యాలు కూడా పెట్టి ఉంచాలి. సాయంకాలం తిరిగి పువ్వుల పూజ కర్పూర నీరాజనం దీపారాధన చేయాలి. భక్ష్యాలు మళ్ళీ నైవేద్యంగా సమర్పించాలి. రాత్రి అంతా అక్కడ ఒకటి గాని, ఒకటికి ఎక్కువగాని దీపాలు వుంచాలి. ఆరాత్రి భక్తులందరూ



ఆడుకుంటు మెలుకుని ఉండాలి. నాగపూజ అయిన తర్వాత ఇంట్లోని స్త్రీలు, పిల్లలు ఒకచోట చేరి, ఈ పండుగ పుట్టుపూర్వోత్తరాల గురించి చెప్పుకోవాలి.

పూజ అయిన తర్వాత పాముల ముందు పచ్చగడ్డి పరకలు, వెన్న ఉంచాలి, బతికి ఉన్న పాములకని ఇంటిమూలలో పాలతోనింపిన చిన్న గిన్నెలు పెడతారు.

నాగపంచమినాడు బతికి ఉన్న పాముని చూస్తే మంచి అదృష్టమని గుజరాతీయుల నమ్మకం.

ఆరోజు స్త్రీలు "తెలిసీ తెలియక మేము చేసిని తప్పులను కాచుతండ్రీ! మా పుట్టినింట, మెట్టినింట ఎవ్వరినీ ఎప్పుడు పగబట్టకు, కాటేయకు" అని ప్రార్థిస్తారు. ఇలా నాగేంద్రుని ఆరాధన ద్వారా వారి కుటుంబాలకు నాగదోషాలు, నాగ శాపాలు తొలగి పోతాయన్నది ప్రగాఢమైన విశ్వాసం. ఇది అనాదిగా కొనసాగుతున్న ఆచారం.

## వివిధ రాష్ట్రాల్లో నాగేంద్ర ఆరాధన

**మహారాష్ట్రలో**

మహారాష్ట్రలో స్త్రీలు ఉదయాన్నే లేచి తలారా స్నానాదులు ముగించుకుని తొమ్మిది మూరల చీర ధరిస్తారు. పాములు పట్టేవారు తమ బుట్టల్లో సర్పాలను ఉంచుకుని, ఇంటింటికి వెళ్ళి "ఓ తల్లీ! నాగేంద్రుడికి పాలు ఇవ్వమ్మా!" అని ఎలుగెత్తి వేడుకోగానే, స్త్రీలు బయటకు వస్తారు. బుట్టలో నుండి పాములవాడు పాములను వెలుపలికి తీస్తాడు. పసుపు కుంకుమలు, పూవులతో అలంకరించి, నాగేంద్రుడికి పాలు

పోస్తారు. అనంతరం పాత వస్త్రాలను, కొంతధనాన్ని పాములు పట్టేవాడికి ఇస్తారు. పాలల్లో ముంచిన రోజా పూలతో కూతుళ్ళు తమ తండ్రి కళ్ళను శుభ్రపరుస్తారు. అనంతరం తండ్రి నుండి వివిధ కానుకలు అందుకుంటారు.

**కేరళ రాష్ట్రంలో**

కేరళ రాష్ట్రంలో నాగపుట్ట ఉన్న ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడుతాయి. కొందరు తమ ఇళ్ళల్లో వెండి లేదా పంచలోహాలతో చేసిన నాగరూపాలు ఉంచుకుని ప్రార్థనలు చేస్తారు.

**పంజాబ్ రాష్ట్రంలో**

ఇక్కడ సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో నాగపంచమి ఉత్సవం జరుగుతుంది. గ్రామంలోని ప్రజలు ఇచ్చిన గోధుమ పిండి, వెన్నతో నాగేంద్రుని రూపు తయారుచేస్తారు. దాన్ని అలంకరించిన ఓ బుట్టలో పెట్టి ఊరేగిస్తారు. స్త్రీలు, పిల్లలు ఆటపాటలతో ఆ ఊరేగింపులో పాల్గొంటారు. ఇలాగందరూ ప్రధాన కూడలి వద్దకు వచ్చాక వివిధ పూజాధికాలు చేసి, నివేదనలు చేసి శాస్త్ర ప్రకారం ఆ నాగేంద్రుణ్ణి పూజిస్తారు. ఊరేగింపు సమయంలో ప్రతి ఇంట్లోనివారు ఏదో ఓ నివేదన చేసుకుంటారు.

పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాల్లో నాగపంచమినాడు మానసాదేవిని ఆరాధిస్తారు.

**షిరోలిలో నాగపంచమి**

ముంబైనుండి నాలుగువందల కి.మీ. దూరాన ఉన్న బల్టిస్ హిరోలి గ్రామంలో నాగపంచమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయి. ప్రపంచంలోని వివిధ సర్పాలు, నాగులు, ఈ గ్రామానికి తెప్పించబడి ఉంచబడతాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి ఆ సర్పాలకు ఆరాధనలు జరుపుకుంటారు. ఈ సందర్భంలో ఒక విశేషం గుర్తించవచ్చు. ఇక్కడకు తేబడే ఏ సర్పానికీ విషం తీయబడదు. అయినా ఏ ఒక్కప్రాణి ఈసందర్భంలో సర్పకాటుకు గురైనట్లుగా ఇంతవరకు చరిత్రలోలేదు.

సర్పాలు కుండలనుండి ఆలయంలో విడిచి పెట్టబడతాయి. వాటికి పసుపుకుంకుమ తేనె, పాలు నివేదించబడతాయి. అనంతరం మరలా అవన్నీ కుండల్లోను, బుట్టల్లోనూ పెట్టి ఎద్దులబళ్ళల్లో ఊరేగిస్తారు. కొందరిళ్ళవారి కోరికపై కొన్ని నాగుపాములు ఇళ్ళముందు దించబడతాయి. ఆ సమయంలో వాటికి మరలా పసుపుకుంకుమలు, పూవులు సమర్పించుకుని కర్పూర హారతి నిచ్చి పూజాదికాలు చేస్తుంటారు ఇళ్ళవాళ్ళు. కన్నెపడచులు తమ వైవాహిత జీవితం సుఖమయంగా ఉండేందుకు నాగేంద్రుడి ఆశీర్వాదాలు పొందుతారు. ఆ సమయంలో కొందరు తమ శిరస్సులకు నాగేంద్రుడికి అత్యంత సమీపంగా వంచి నమస్కరిస్తారు. ఆ సర్పాలు వేటికీ విషం తీయబడక పోయినా అవేవీ ఏ హానీచేయక పోవడమే భగవంతుని ఉనికికి నిదర్శనం. ఆరోజు సాయంత్రం కుండలన్నీ ఆలయంలో చేర్చబడుతాయి. కుండలపై మూత తీసి వేయబడుతుంది. కొన్ని సర్పాలు కుండల్లోనుండి పైకి వచ్చి ఇటునిటు తిరుగాడు తుండడాన్ని మనం గమనించవచ్చు. ఆ రోజు ఏ ప్రాణికి పాములవలన ఏ హాని జరగక పోవడం విశేషాంశం. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి దేశంలోని పలుప్రాంతలనుండే గాక విదేశాలనుండి కూడా భక్తులు తరలి రావడం గుర్తించాల్సిన అంశం.

పాములను చూసి భీతిల్లడం తగదని, అకారనంగా మానవాళికి హాని కలిగించవని గురు గోరఖ్‌నాథ్ వివరించడంతో ఆనాటినుండి నాగేంద్ర ప్రతిమలకు గాక, నాగులకు, సర్పాలకు పూజాదికాలు నిర్వహించడం అనే ఆనవాయితీ ఈ గ్రామంలోను చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ ఏర్పడింది. ఆ ప్రాంతంలో గురుగోరఖ్‌నాథ్ ఆలయాన్ని తిలకించవచ్చు.

**నాగపంచమి ప్రాశస్త్యం**

నాగపంచమినాడు చెట్లు నాటడం, పోలం దున్నడం వంటివి చేయరు. చాలా కుటుంబాల్లో వండిన పదార్థాలు, వేడి చేసే పదార్థాలు తినకుండా పచ్చివే తింటుంటారు. దీపావళి తర్వాత వచ్చే నాగుల చవితిని దక్షిణ భారతంలో విశేషంగా చేస్తే ఉత్తర భారతంలో శ్రావణశుద్ధ పంచమినాటి నాగపంచమిని విశేషంగా జరుపుకుంటారు. రోజు ఏదైనా హిందువులందరూ ఘనంగా తమ భక్తి గౌరవాలను నాగేంద్రుడికి ఏడాదికోసారి సమర్పించుకుని, నాగేంద్రుడి ఆశీస్సులు పొందుతుండడం గమనార్హం. నాగేంద్రుడి ఆరాధనలకు ఆంధ్రప్రదేశ్ తల మానికంగా చెప్పవచ్చు. అసలు ఆంధ్రులు నాగజాతి వారు అనే అంశం కూడా ప్రాచుర్యములో ఉంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నాగేంద్రుడిగా ఆరాధించడం మన సంస్కృతిలోని భాగం. నాగుల్లో ప్రధానంగా చెప్పుకోబడే అనంతులు శ్రీమహావిష్ణువుకు తల్పంగా ఉంటూనే ఈ భూమండనాన్ని భరిస్తున్నాడు. మరో అత్యంత శ్రేష్ఠుడైన వాసుకి నాగరాజుగా ఖ్యాతి పొందాడు. వాసుకి శిరస్సున నాగమణి ఉంటుందని పురాణ ప్రవచనం. క్షీరసాగర మధనానికి సహకరించిన శ్లాఘనీయుడు వాసుకి. నాగుల మహారాణి మానసాదేవి వాసుకికి స్వయంగా సోదరి. గీతోపదేశంలో "అర్జునా! సర్పాల్లో నేనే వాసుకిని" అన్న శ్రీకృష్ణుడి మాటలు స్మరణీయం భూమండలాన్ని భరించే ఆదిశేషునకు యావత్ జాతి కృతజ్ఞతలు తెలిపే పర్వం — నాగపంచమి.

# అమృతకలశం

– గుండు వల్లీశ్వర్

## శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్

"శ్రీనివాసుడి భక్తుల పాలిటి అమృతకలశం శ్రీ వెంకటేశ తాపిన్యుపనిషత్... దీని గురించి తెలుసుకుందాం.

విదేహరాజు అయిన జనక మహారాజు ఒక దశలో రాజ్యభారాన్ని తన తమ్ముళ్ళకి అప్పగించేసి, తపోవనాలకి వెళ్ళిపోయాడు. అక్కడ సూర్యకిరణాల శక్తిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ తపస్సు చేస్తున్న అనేకమంది మునుల మధ్య అపారమైన సూర్య తేజస్సుతో వెలిగిపోతున్న మహర్షి శాఖాయన్యుడు దర్శనమిచ్చారు. జనక మహారాజు స్తుతితో సంతసించి, ఆయన ఏదైనా వరం కోరుకోమన్నాడు.

"కామ, క్రోధ, మద, లోభ, మోహ, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు బానిసైన ఈ శరీరంతో కామోపభోగాలు అనుభవించాలనే కోరిక లేదు. ద్యుమ్న, ప్రద్యుమ్న, ఉగ్రసేన, అంబరీష, ఇంద్రద్యుమ్న తదితర చక్రవర్తులే అన్ని భోగాలనూ వదిలేసి వెళ్ళిపోయారు కదా! ఆ భోగాల మీద ఆసక్తి నాకూ లేదు. చీకటి నూతిలో కప్పలా సంసారబంధంలో కొట్టుమిట్టాడుతున్నాను. నన్ను ఈ బంధం నుంచి విముక్తుడిని చేయండి..." అని జనకుడు ప్రార్థించాడు.

ఇందుకు భగవద్భక్తి యోగం తప్ప మరో మార్గం లేదని అంటూ, శాఖాయన్యుడు అపార కరుణతో జనకుడికి బోధించిన భక్తిసాధనా మార్గం శ్రీ వెంకటేశ తాపిన్యుపనిషత్ లోని సారం.

సర్వ సులభుడైన వేంకటేశుడుగా సగుణబ్రహ్మమై వేంకటాచలంలో ఉన్నాడు. ఏది వైకుంఠమో అదే వేంకటాచలం. శిలా రూపంలో దర్శనమిస్తున్న ఆ వేంకటేశుడే, ఆయనను బ్రహ్మ అన్న భావనతో ఉపాసిస్తే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఇప్పుడే ఆయన్ని చూడాలి అన్నంత తపనతో, ఆర్తితో, ఆరాధనతో ఉపాసిస్తే ముక్తి లభిస్తుంది.

పుష్కరిణీ తీరంలో, వక్షస్థలంలో రమా సమేతుడై స్వయం వ్యక్తమైన స్వామి ఇవ్వాళ కూడా మనకి కనుపిస్తున్నాడు. స్కంద, బ్రహ్మాండ, నృసింహ పురాణాలు ఇదే విషయం చెప్పాయి. ఉపాసనతో ఆయన భక్తులకు సర్వ సులభుడు. ఆ ఉపాసనా మంత్రాన్ని జనకుడికి శాఖాయన్య మహర్షి బోధించాడు. ఇక్కడివరకూ పూర్వ తాపిన్యుపనిషత్.

ఉత్తరతాపిన్యుపనిషత్ ఉపాసనా విధానాన్ని వివరిస్తుంది :

మొట్టమొదటి 'వేంకటేశ' అన్న మంత్ర శబ్దం వెలువడగానే విన్నవాడు బ్రహ్మ. ఆ తరువాత ఆయన విన్న శబ్దం 'శ్రీ'... స్కాంద పురాణం ఏం చెబుతుందంటే – ఎవరి నోట భక్తిభావంతో 'శ్రీ వేంకటేశ' వినబడుతుందో వాళ్ళకి దేవతలు నమస్కరిస్తారు. గురూపదేశంతో ఈ మంత్రాన్ని ఉపాసించాలి. ఈ ఉపాసనలో మంత్రం, యంత్రం, తంత్రం ఉన్నాయి. 'వేంకటేశ' అంటే పాపాలను దహించేవాడు. 'శ్రీ' ని రమగా వక్షస్థలంలో ధరించేవాడు కనుక 'శ్రీనివాసుడు'... వేద వేద్యుడు కనుక 'గోవింద'... గురు ముఖతః స్వీకరించిన మంత్రంతో ఉపాసన చేయగా చేయగా స్వామి సాక్షాత్కరిస్తాడు.

అలా మొట్టమొదట బ్రహ్మకి సాక్షాత్కరించినవాడు – వేయి శిరస్సులతో ప్రకాశించే విరాట్ పురుషుడు. ఆ మంత్ర జపం వల్ల బ్రహ్మకి సృష్టి చేసే శక్తి లభించింది. ఈ మంత్ర జపంతోనే – చతుర్భుజాలు, కటివరద శంఖ చక్ర హస్తాలతో పీతాంబరధారియైన వేంకటేశుడిని దర్శించాడు బ్రహ్మ. అలా వ్యక్తమైన స్వామే బ్రహ్మకి ఈ అష్టాక్షరి మంత్రాన్ని 'శ్రీ వేంకటేశాయ నమః' ఉపదేశించాడు.

ఉపాసనకి మహా చక్రవిధానాన్ని బోధించాడు. వృత్తాకారంలోని సుదర్శన చక్ర రూపంలో – నాభి స్థానం నుండి ఒక్కో చక్రంలో ఈ మంత్రాక్షరాలు ఎలా ఉంటాయంటే – షడక్షరాల దళాలు, అష్టాక్షర దళాలు, ద్వాదశాక్షర దళాలు, షోడశాక్షర దళాలు, చతుర్వింశాక్షర దళాలు, చివరగా 32 అక్షరాల దళాలు. బ్రహ్మ మొదట తెలుసుకొని వేంకటాచలంలో ఈ ఉపాసన చేశాడు.

ఎలా స్తోత్రం చేయాలో కూడా స్వామి బోధించాడు

'ఓం భూర్భువస్సువః ...' భూనభోంతరాళాలు ఆవరించి ఉన్నవాడు. ఆయనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు... ఆయనే లక్ష్మి, సరస్వతి, గౌరి. వేదములుగా, వేద శాఖలుగా, ఏకాదశ రుద్రులుగా, ద్వాదశ ఆదిత్యులుగా కనుపించే సర్వదేవతాత్మకుడైన ఆ నారాయణుడే 'వేంకటేశుడు'.

నారాయణోపనిషత్ లో మంత్రాలు లాగా, ఈ ఉపనిషత్ లో కూడా మంత్రాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఈ తాపిన్యుపనిషత్తుని అధ్యయనం చేసి, ఈ ఉపాసనా విధానాన్ని సాధన చేస్తే, సూర్య, వాయు, చంద్రాదులు కూడా పొందలేని 'మహోన్నత స్థితి' ని భక్తుడు పొందగలడు.



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

పి. వేంకట రామిరెడ్డి

## పదునాలుగవ అధ్యాయము

## మోక్షమునిప్పించుట — మోక్షము నిచ్చుట

అనంతాళ్వాన్ వంటి నియమ, నిష్ఠాగరిష్ఠుడను, కర్తవ్యదీక్షాపరుడును, గురు ఆజ్ఞా పాలితుడను, ఘనాపాటిని చూచి, సాక్షాత్ లోక సృష్టికర్త, స్థితికారుడు, ధర్మపరిరక్షకుడు, సకల జీవుల మోక్షకారకుడు, మోక్షధాముడగు అల శ్రీ వైకుంఠనాథుడే, ఇల వెలసిన శ్రీ వేంకటేశ్వరునకే ఆశ్చర్యము కలిగెడిది. అనంతాళ్వాన్‌పై ప్రేమ రెట్టింపవ్వసాగెను. అందుచే అనంతాళ్వాన్ మాటలకు గానీ, చేతలకు గాని, శ్రీ వేంకటనాథుడు అడ్డు చెప్పెడి వాడు కాదు. అనంతాళ్వాన్ యన్న ఆనంద నిలయునికి అంత గురియన్నమాట.

ఒకసారి శ్రీరామానుజుల వారి శిష్యులు, తిరుమల బయలుదేరిరి. మార్గమధ్యమున వళర్తాన్ మంగళ ముడైయాన్ అను ఊరిలో వళర్తార్ మంగళముడైయాన్ అనునొక బ్రాహ్మణుడు వీరిని పూజించి, వారి ద్వార విశిష్టాద్వైతానుభవ సిద్ధాంతమునకు ఆకర్షితుడై తిరుమలలోని శ్రీరామానుజుల వారి అనుంగు శిష్యుడగు అనంతాళ్వాన్‌ల ప్రతిభా పాటవముల ఆకర్ణాంతుడై, తానునూ, వారితో బయలుదేరి తిరుమలకు చేరెను.

తిరుమల గిరుల, అనంతాళ్వాన్ తోటకు విచ్చేసిన వారినందరిని కుశల ప్రశ్నలు వేయు సందర్భమున వారు, తమ వెంట వచ్చిన వళర్తార్ మంగళ ముడైయాన్‌ను పరిచయము

చేయ, వళర్తార్ మంగళ ముడైయాన్ అనంతార్యులకు సాష్టాంగ ప్రణామములొనరించి, పైకి లేయు వేళ, అతని ముఖవర్చస్సును గమనించి, ఈతడు ఖచ్చితముగ నాకు శిష్యుడవ్వదగినవాడే, ఈతని భవమోహముల తప్పించవలయునని తలంచుచూ, అతనితో, సరి! నేను, నిన్ను శిష్యునిగ స్వీకరింతును. కానీ నీవు సంపాదించిన సంపదలనన్నింటిని భగవత్ కైంకర్యములకే వెచ్చించవలటునని పలుక, అతడు అట్లేయని పలికి, తనను శిష్యునిగ స్వీకరించమని, అనంతార్యులను వేడ, అనంతార్యులు అతనిని శిష్యునిగ స్వీకరించి, అతనికి శ్రీవైష్ణవ దాసుడని పేరుపెట్టి, సర్వశాస్త్ర నిగూడార్థములను, భగవత్ సంబంధ విషయములను విపులీకరించి చెప్పెడువాడు.

కొలది కాలముననే, శ్రీ వైష్ణవదాసుడు, అనంతాళ్వాన్‌లకు ముఖ్య శిష్యుడయ్యి, గురువు మనస్సునెరిగి మసలెడివాడు.

ఒకానొకరోజు, అనంతాళ్వన్, శ్రీవైష్ణవదాసుని పిలిచి, నీవు నీ ఊరికి పోయి తల్లిదండ్రుల సేవ చేయుచూ, అచట కొంతకాలము ఉండి రమ్మని పంపెను.

శ్రీవైష్ణవ దాసుడు తన ఊరికి పోయి, తల్లిదండ్రుల సేవల చేయుచూ,తనసంపదలన్నింటినిలెక్కించి,మూడుభాగములుగ చేసి, రెండు భాగముల తన తల్లిదండ్రులకు ఇచ్చి, మిగిలిన ఒక్కభాగమును తాను తీసుకొని వచ్చి, తన బంధములన్నీ తెగిపోయి, స్వేచ్ఛా జీవుడనైతినని, తనకిక సంపదలక్కరలేదని, తనను అనుగ్రహించమని, అనంతాళ్వాన్‌లను వేడెను.

అతని విన్నపముల విని, వినయ విధేయతలకు, తనలో తాను లోలోన మురిసి పోవుచూ ఆరోజున శ్రీనివాసునికి తాను అనునిత్యము చేయు పుష్పకైంకర్యమునకు తనతో పాటు, తన శిష్యుని కూడా శ్రీవేంకటాద్రి విభుని కడకు తీసుకుని పోయెను అనంతాళ్వాన్.

గురు, శిష్యులిరువురునూ శ్రీ వేంకటాద్రీశుని కడ నిలువ, అనంతాళ్వాన్, శ్రీకాంతునితో ఇట్లు పలికె ఓ వేంకటేశ్వర! నేను చెప్పినట్లే, నా శిష్యుడగు ఈ వైష్ణవ దాసుడు, తన సంపదలనన్నింటిని నా పాదముల చెంత బెట్ట, సంపదల నేనేమి చేసుకుందును, నీవే, ఈ సంపదలన్నీ మూటకట్టి, శ్రీవేంకటపతి పద్మపాదముల కడ నుంచుము, స్వామివారి, ఆజ్ఞ మేర భగవత్ కైంకర్యములకు, లోకోద్ధరణకు వెచ్చించి, నీ కృపకు పాత్రుడవ్వమని చెప్పి, నీకడకు తీసుకుని వచ్చితినని పలికి, శిష్యుని వైపుచూడ, ఆ పరమశిష్య శిఖామణి, అనంతాళ్వాన్‌ల వైపు చూచుచూ, గురువర్యా! నీవు చెప్పినట్లే నేను ఈ సంపదలన్నింటిని, శ్రీవారి పాదపద్మములవద్ద నుంచుచుంటిని, దీనివలన, నేను, ఇల సంపాదించిన సంపదయంతయూ సద్వినియోగమవవలెననెడి నా కోరిక ఒకటి తీరినది. ఇక నా రెండవ కోరికయగు, పరమపదము చేరి, శ్రీవిష్ణుని అర్చించవలెననెడి కోరిక, మీరే, శ్రీనివాసిభుని సమక్షమున, వారితో మాటలాడి తీర్చవలయునని పలుక, అందుకు అనంతాళ్వాన్, ఓ శ్రీనివాస, కరుణాసింధో, దీనజన బాంధవ, యోగి హృద్యానుగమ్య, నీవు ఈతనితో "మాశుచః" (దుఃఖించకు) యన్న నొక్కమాట పలుకవలెనన్న, పరమానంద భరితుడైన పరమాత్ముడు శేషాద్రీశుడు, శ్రీగోవిందుడు, అనంతా! నీవలెనే, ఈతడు కూడ, దేహావసానమున, దుఃఖ రహితుడై దేహము వీడి, వైకుంఠము చేరి, అచ్చోటనున్న మమ్ముల సేవించుకున గలడని పలికి, శ్రీవైష్ణవదాసునితో "మాశుచః" యని పలికి, వారిరువురికి తీర్థప్రసాద, శఠకోపాది మర్యాదలు అర్చకులచే చేయించెను.

మహదానంద భరితులైన గురు, శిష్యులిరువురునూ, ఆనందనిలయము వీడి, పుష్పతోటను చేరిరి.

మరునాడు అనంతాళ్వన్‌నకు తానిచ్చిన మాటకు కట్టుబడి, శ్రీ వేంకటేశ్వరుడు, అనంతాళ్వన్ ఇంటిముందు నిలచి, శ్రీవైష్ణవ దాసుని పిలిచి, శ్రీ వైష్ణవదాస! నీకిదే మోక్షము నిచ్చితియనగనే శ్రీవైష్ణవదాసుడు, ఎటువంటి దుఃఖములు లేనివాడై, ఆత్మానందభరితుడై దేహము విడచి పద్మనాభుని సన్నిధికి చేరెను.

పిమ్మట అనంతాళ్వాన్, తానే స్వయముగ తన శిష్యుని పార్థివ దేహమునకు చేయవలసిన కార్యములన్నియు, దగ్గరుండి నెరవేర్చెను.

చూచితిమి కదా! గురువు అనుగ్రహమున్నచో, సాక్షాత్ వైకుంఠరాధుడే, శ్రీ వేంకటనాధుడే తనకై, తానే వచ్చి, శిష్యుని ఆత్మను, దుఃఖమన్నదే లేకుండా, దుఃఖమన్నదే కానరాని తన ఆనందనిలయమున, వైకుంఠ ధామమున, తన పాదపద్మముల చెంత చేర్చుకున్నతీరు, అట్లే, తనను, నమ్మి, ఆశ్రయించి, సేవించి తరియించ చూచిన శిష్యునికి, నిజమైన గురువగు అనంతాళ్వాన్, పరమపదమునకు చేర్చిన తీరు.

## నిత్యసూరులు :

నిత్యసూరులు కూడ తిరుమల వాసులుయేయనుచూ, చీమల గుంపును, తిరిగి అనంతార్యులు తిరుమల చేర్చిన విధానమునల తెలుసుకుందుము.

ఒకసారి అనంతార్యులు తన శిష్యులతో కలిసి, కేరళ రాష్ట్రమునకు బయలుదేరెను. దారి బత్తెము నిమిత్తము, కొంత ఆహార పదార్థముల మూట కట్టుకుని, తిరుమల దిగి, తిరుపతి దాటి కొంత దూరము పోయిన పిమ్మట, ఆయన శిష్యుడగు వరదార్యుడు, గురుదేవా! ఇచ్చటికి కొంచెము దూరములో ఒక

నీటి కాలువ యున్నది అచ్చట కొంత తడవు విశ్రాంతి తీసుకుని, ఇంత ఎంగిలిపడి, తిరిగి ప్రయాణము సాగించెదమని వినయుడై పలుక, అందులకు అనంతార్యులు సరియనెను. కాలువ గట్టున చేరి దారి బత్తెము విప్పిచూడ అందు ఎఱ్ఱని కొండచీమలు గుంపుల, గుంపుల కాన్పించెను.

అది చూడగనే అనంతాళ్వాన్, అహూ! ఎంత పెద్ద తప్పు చేసితిని, ఎన్నో జన్మల పుణ్యఫలమైన గాని, జీవులు తిరుమల గిరుల పుట్టుట కానీ, మరణించుట కానీ జరుగదు కదా! అటువంటి ఈ నిత్యసూరుల (చీమలు), దేవతాంశ సంభూతుల నేనిచటకు తెచ్చితినే యనుచూ, వీనిని తిరిగి తిరుమలగిరుల, ఆ పద్మనాభుని సన్నిధి యందే చేర్చుదుననుచూ తిరిగి ఆ మూటను యధావిధిగ కట్టి, ఆకలి, దప్పుల లెక్కించక, వెనుదిరిగి, తిరుమలలోని ఆనంద నిలయము వద్ద చేరి దారి బత్తెము మూట తెరచి, అందులోని నిత్యసూరులను శ్రీవేంకటేశ్వరునికి చూపుచూ, విడిచిపెట్టెను. తిరిగి తిరుమల గిరుల దిగి, కేరళ దేశమునకు పయనమై పోయెను.

ఇంతటి భూతదయ కరుణ, ప్రతిజీవిలో, చెట్టులో, పుట్టలో, చీమలో, కంటికి కన్పించని జీవిలో, సర్వములో, విశ్వమంతటిలోను, విశ్వాంతరాత్ముని చూచుట, మనవంటి వారి తరమగునా? ఒక్క అనంతాళ్వాన్‌కు తప్ప.

అంతటి అనంతాళ్వాన్ జీవిత చరిత్ర తెలుసుకొనుటకు, వినుటకు, చదువుటకు, తిరుమలలోని అనంతాళ్వాన్ తోట లేదా పురిశైవారి తోటలో కాలిడుటకు, మనకు అదృష్టము ఉండియే తీరవలయును. లేకున్న కోట్లాదిమంది భక్తులు తిరుమల వచ్చి, శ్రీనివాసుని దర్శనము చేసుకుని, వెనుదిరిగి పోవుచున్నారే తప్ప, అనంతాళ్వాన్ తోటన కాలిడలేకున్నారు, అనంతార్యుల చరిత్ర తెలుసుకున ప్రయత్నము చేయలేకున్నారు.

కనుక ఒక్కటి మాత్రము నిత్య సత్యము, ఎవ్వరి కర్మలు పరిక్వమైనవో, మంచికాలము రానున్నదో, వారు మాత్రమే, వారికి మాత్రమే, శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ, అనంతాళ్వాన్‌ల అంగీకారము దక్కి, అనంతార్యుల తోటన ప్రవేశించి, అనంతార్యుల బృందావనమును దర్శించుకును భాగ్యము దక్కును. లేనిచో అది అసాధ్యపు కార్యమే!

## పులికి మోక్షమిచ్చుట :

ఒకనాడు సూర్యోదయపు వేళ, శిష్యులతో కలిసి, అనంతాళ్వాన్, స్నాన సంధ్యావందనముల నిమిత్తము శ్రీ ఆదివరాహ ఆలయమునకు ఆనుకునియున్న శ్రీస్వామి పుష్కరిణికి పోవువేళ, అతని భుజముల కప్పుకున్న కండువ, రావి చెట్టు క్రింద ప్రశాంతముగ, కన్నుల మూసి, నిదురించేటి ఒక పులి చెవుల మధ్య చిక్కుపడినది. ఎంత ప్రయత్నించినా, కండువా రాలేదు. సరికదా పులియున్నూ కిమ్మనకుండా పండుకుని, కదలక, మెదలక అట్లేయుండెను.

ఇది గమనించిన శిష్యులు, అయ్యా! ఈ పులి, మీ కండువా కప్పుకుని, తన కన్నుల తెరవక, తనకు కప్పియున్న మాయామోహపు తెరలు తొలగించునా జూచుచున్నదని పలుక అనంతార్యులు నవ్వి, అట్లే అగునులే! మీరు కోరినట్లే దాని ఆత్మకు పట్టిన మాయ తెరలు, ఇట్లే తొలగిపోవు సమయమాస్నమైనది. దేహము వీడు కాలమైనదని పలుకుచూ, ఎట్లో తన పైపంచను (కండువను) దాని చెవుల మధ్య నుంచి, నెమ్మదిగ తీసుకొని, పుష్కరిణికి పోయి, స్నాన, జప, తపాదుల ముగియించుకుని, ఇంటికి పోవ వెనుదిరిగెను.

ఆశ్చర్యము! దారిలోని రావి చెట్టు క్రింద పులి విగత జీవియై, ప్రాణములేని దేహుడై కాన్పించెను. అంతట దాని దేహపు చరమ కైంకర్యముల అనంతార్యులు తానే నిర్వర్తించిరి.

పుష్పోద్యానవనములలోని పుష్పముల కోసి, యధావిధిగా మాలల కట్టి ఆనంద నిలయము చేరి, ఆనంద నిలయునికి పుష్పాలంకరణల చేయ చూడ, శ్రీవేంకటపతి దివ్యపద్మ పాదముల వద్ద గతియించిన పులి ఆత్మను, అనంతార్యులకు చూపి, ఓయీ! అనంతా! ఎన్నియో జన్మములెత్తి, పాప, పుణ్యకర్మముల చేయుచూ, పాప, పుణ్య కార్యసమములై, మరల, మరల జనన, మరణ చక్రభ్రమణల తిరుగుచూ, మోక్షమార్గము కాన్పడనట్టి జీవులకు కూడ ఇట్టె చిటికెలో మోక్షమీయ మొదలిడితివి. నీపైపంచ (కండువ) తగిలి, తన మాయామోహపు తెరలు తొలగి, ఈ పులి మోక్షమొందినది. నేను భూలోకమున అవతరించినదే పాపుల శిక్షించి, అధర్మ అసుర అరిషడ్వర్గ వికారముల పోగొట్టి, పుణ్యులగు వారి మోక్షపు యోగ్యత కనిపెట్టి, ఎన్నెన్నో జన్మముల కలవి కాని, అంతు చిక్కని, వాని వాని ఆత్మల పట్టిన అజ్ఞాన మోహాంధకారముల పోగొట్టి మోక్షమిచ్చి, సృష్టి ధర్మమును నిక్కచ్చిగ నెరవేర్చుటకే గదా!


నీవు గురువాజ్ఞ పాలించి, నాకు పుష్పకైంకర్యములు చేయ వచ్చినవాడవే తప్ప, అన్నింట వ్రేలుపెట్టి, అజ్ఞాన తిమిరాపహరణముల చేయుచూ, జీవుల మోక్షపు దారుల చూప, వచ్చియుండలేదు, సృష్టి విరుద్ధపు పనుల మాని, తిన్నగ, నీ పనులు నీవు చేసుకో, నా కర్తవ్యముల కల్పించుకున చూడవద్దు, లేని ఎడల ఇపుడే, నీవు ఉన్నపళముగ, తిరుమల కొండ దిగిపొమ్ము, అన్ని నీవే చేయచూచిన, భూలోకముల నా అవసరము ఏమున్నది అని నిష్ఠూరముగ, ఘాటుగా పలికి, ఇది నా ఆజ్ఞ, ఇందుకు విరుద్ధముగ చేయదలచిన

నేను వెడలిపోవుదును. నీవే ఈ వేంకట గిరుల నుండుమని శ్రీ వేంకటనాధుడు యన్నంతనే మన అనంతాళ్వాన్ ఎట్లు జవాబిచ్చెనో చూడుడు:–

అయ్యా! వేంకటనాథ, వేంకటాద్రీశ, నన్ను కొండదిగి పొమ్మనుచున్నారే. ఈ తిరుమలగిరులు, తమరి సొంత సొత్తైనట్లు, ఇచటకు కలియుగ ధర్మము నెరప మీరున్నూ, గుర్వాజ్ఞ పాలించ నేనునున్నూ, కొంచెము ముందు , వెనుకల, మనమిరువురము, అటు, నిటుగ ఇక్కడ అద్దెలకు చేరితిమి. తమరు శ్రీ ఆదివరాహుని, ఉండనింత స్థలమిమ్మని వేడ ఆ దేవదేవుడు మీక ఇంత స్థలమీయ, తామేదో పెద్ద భూదానమునకు ప్రతిఫలముగ మొదటి దర్శనములు, నైవేద్యము నీకే జరుగునని చెప్పి, అతనిని ప్రలోభపెట్టి ఇంతింతై వటుడింతైయన్నట్లు తమరి వామనరూప విశేషమహత్యగుణముల జూపి, భక్తుల కోరిన కోర్కెలన్నీ తీర్చుచూ, తమరి ప్రాబల్యమును ఏడుకొండలనంతటను విస్తరింపచేసుకుంటిరి.

ఇప్పుడేమో, అంతయూ, అన్నియూ నావేయని పలు మధురముగా పలుక నేర్చినారే! నాకిక్కడ నుండుటకు, తమరి స్వంత స్థలమేమీ ఇవ్వలేదు కదా! నేనునూ, నీవలెనే, నీకంటే కొంచెము, వెనుకగ నీ ఆనందనిలయము వెనుక, సరిహద్దున కావల ఇండ్లు కట్టుకుని, కంటికి కునుకు లేకుండ, తమరి సేవలు చేసేటి నన్ను పొమ్మనుటకు మీరెవ్వరు? పొమ్మనుటకు రమ్మనుటకు ఒక్క మన గురువగు భగవద్రామానుజుల వారికి మాత్రమే హక్కుగలదు యని పలుక, ఆనంద నిలయుడు అచ్చెరువొంది, అనంతార్యులను ఎగాదిగ చూచుచుండ, మరల అనంతాళ్వాన్, అయ్యా! శ్రీనివాస, తమరు నాకిచ్చిన వరము విషయముమరచినట్టున్నారు.నాకునూ,నాసంబంధీకులకునూ, వారి సంబంధీకులకునూ, పుష్పతోటలోని, చెట్టు, చేమ, పుట్ట, చిరు జీవులు మొదలు, అన్నింటికిని మోక్షమిట్లే లభించునని, మీరిచ్చిన వరము సంగతి ఏమిటని, నవ్వుచూ, ఎదురాడి ప్రశ్నించ, శ్రీ వేంకటేశ్వరుడు, తన కోపపు నటనములనాపి, పక, పక నవ్వుచూ, అనంతా! నీ చిత్త స్థైర్యమునకు, జీవులకు మోక్షమిప్పించవలెననెడి స్వార్ధరహితపు ఆలోచనల, ఆత్రుతల, ఆర్ద్రతలు నన్ను పరమానందింప చేయుచున్నవి. నీ సమయస్ఫూర్తియగు జవాబు, నన్ను మురిపింపచేసినది యనుచూ, అనంతాళ్వాన్ల భుజము తట్టి, కౌగిలించుకుని, పరమాత్ముడు, శ్రీ వేంకటేశ్వరుడు, ఆనందములకు నిలయుడు, తానే ఆనంద డోలికా మనస్కుడాయెను.

**ఇతి: శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**
**మోక్షమునిప్పించుట – మోక్షము నిచ్చుటయను**
**పదునాలుగవ అధ్యాయము సంపూర్ణః**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 46వ కళ్యాణం

తేది 29–06–2023 తొలి ఏకాదశి రోజున జరిగింది. సాయంత్రం 6 నుండి 7 వరకు భజగోవిందం, మరియు 7 నుండి శ్రీనివాస కళ్యాణం జరిగింది. దీనిని శ్రీమాన్ గ్యార గోపాల్ గారు (గోవింద మాల గురుస్వామి), క్రాంతినగర్ గ్రౌండ్స్ కర్మన్‌ఘాట్ హైదరాబాద్‌లో జరిగింది. వైఖానసాగమోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది.

## 47వ కళ్యాణం

తేది 9–07–2023 ఆదివారం నాడు ఉ. 10.30 నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ చల్లూరి సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహించారు. శామిర్ పేట మండలం లాల్గడి మలక్ పేట నందు వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్యన జరిగింది.

# క్షమాగుణము

**– పి. ఎల్. నరసింహాచార్య**

సకలగుణ సంపన్నుడు భగవానుడు. అన్ని గుణాలను ఈ మానవలోకానికి అందించినవాడు ఆ పరమాత్ముడు.

అన్ని గుణాలలోకన్నా ముఖ్యమైన గుణం – "క్షమా గుణము"

వాల్మీకి మహర్షి రామాయణాన్ని రాస్తూ బాలకాండలో 33వ సర్గలోని 8వ శ్లోకములో ఇలా అన్నారు.

**"క్షమా దానం క్షమా యగ్నః క్షమా సత్యం హి పుత్రికా"**

**"క్షమా యశః క్షమా ధర్మః క్షమయా"**

**"విష్ఠితం జగత్"**

దీని భావము :

నా పుత్రికలారా! పాత్రులకు దానము చేయుటవల్లనూ సత్యప్రవర్తనల వల్లనూ యాగాలనాచరించుట వల్లనూ కలిగెడి మహాఫలాలన్నియూ క్షమాగుణమును కలిగియుండుట వలన లభిస్తాయి క్షమ యనస్కరము పరమ ధర్మము, ఈ జగత్తంతయూ క్షమపైనమే నిలిచియున్నది.

తప్పు చేయడం మనవ సహజముచ క్షమించడం దైవత్వముచ ఒరిమికి పరాకాష్ట క్షమచ ఎంతటి అవమానాన్ని కానీ బాధను కానీ సహిస్తూ – అందుకు కారణమయిన వారపట్ల ప్రతీకార భావాన్నీ – ద్వేషభావాన్నీ – లేకండా ఉండగలగడము క్షమ. ఇది ధీరుల లక్షణం.

విష్ణుసహస్ర నామాలలో ఆయనకున్న ఒక నామము 'క్షమ' – అనగా క్షమాగుణమున్న భక్తులను ఆదరించేవాడని అర్థము. క్షమ కలిగి వుండడము తెలివి పరుల భక్తుల లక్షణమనీ అది 'దైవసంపద' అని గీతాశాస్త్రము చెబుతుంది.

భూదేవికి క్షమాగుణాన్ని గురించి – ఆమెకున్న ఓర్పునకు ప్రతీకగా కొనియాడుతారు. భూమిని గడ్డపారతో త్రవ్వుతారు ఇంటిన కట్టుకోవడానికి తనను అంతగా బాధించినా ఎంతో ఓర్పు వహించి ఉంటుంది. ఉదయమే మనము నిద్రలేచి కాళ్ళు క్రిందపెట్టునపుడు భూమి ఎంతో ఓర్పు వహిస్తుంది. మనమందరము మన తలలు ధ్రించు అయినా మనము ఈ శ్లోకాన్ని చెబుతాము కదా?

**'సముద్రవసనే దేవీ పర్వతస్తనమడలే'**

**'విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే'**

'అమ్మా భూదేవీ! నీ మీద నేను నా పాదాలను పెడుతున్నాను'

'నీక భాదకలిగిస్తున్నందుకు నన్ను క్షమిమంచుమాతా!'

అని దీని భావము.

భూమిని ఎంతగా భాధించినా ఎంతో ఓర్పు వహించి ఉంటుంది. సకలజీవులూ – మనవులతో పాటీ – ఈ భూమి మీదనే జన్మిస్తున్నాము – చివరకు ఈ భూమిమీదనే శరీరాన్ని దహనము చేస్తున్నారు.

మానవులందరూ తమ తమ భార్యలను భూదేవితో సమానంగా భావిస్తారు – భావించాలి కూడా! ఎంతో ఓర్పుతో సంసార భాధ్యతలను నిర్వహిస్తుంది. ప్రతి భార్యకుండే ఆరు లక్షణాలలో 'క్షమాగుణము' ఉత్తమోత్తమమైనది!

విశిష్టాద్వైత స్థాపకుడయిన రామానుజాచార్యులవారి గురువుగారు యమునాచార్యులవారు మహాభక్తుడు – శ్రీరంగనాథుని సేవలో తరించినవారు ఎవరి జోలికీ పోయేవారు కాదు. ఆయనంటే గిట్టనివారు కొందరు అసూయద్వేషాలతో అవమానించాలని అవకాశము కోసం ఎదురు చూడసాగినారు.

ఒక రోజు యామునాచార్యులవారు వస్తున్న దారిలో ఒక చోట పాదరక్షలతో – దారి కాస్త ఇరుక్కాఉండడముతో – ఆయన తలకు తగిలేటట్లుగా కట్టినారట కొందరు ఆకతాయిలు. అప్పుడు యామునాచార్యులవారు దూరమునుంచే చూచి సాష్టంగపడి సాగిలపడి ఆ పాదరక్షల మాలకు నమస్కరించి ఒక శ్లోకాన్ని చదివారట! దాని భావమేమిటంటే సమర్థులయిన కొందరు పుణ్యాత్ములు కర్మయోగాన్ని అనుసరించి – మరికొందరు జ్ఞానయోగాన్ని అనుసరించి ముక్తిని పొందుతారు. నావంటి అసమర్థులకు మాత్రము భక్తుల పాదరక్షలే గతి అని వాటిని ఆశ్రయించి ముక్తిని పొందడానికి ప్రయత్నము చేస్తారు.

ఆ ఆకతాయీలు తమ తలలు ధ్రించుకుని పశ్చాత్తాపముతో సిగ్గుతోనూ ఆయన పాదాలపయిన పడి క్షమించమని ప్రార్థించినారట! యామునాచార్యులవారు ప్రసన్నవదనముతో వారిని దీవించి వెళ్ళిపోయారట!

ఈ క్షమాగుణాన్ని గురించి ఇంకా ఎన్నో సందర్భాలున్నాయి మన పురాణాలలో.

రావణాసుర సంహారము తర్వాత హనుమ సీతమ్మతో ఆమె చుట్టూ ఉన్న ఆ రాక్షస స్త్రీలు మిమ్ములను చాలా బాధకు గురిచేసినారు కనుక మీరు అనుమతిస్తే వారినందరునీ సంహరిస్తానమ్మా అని అడగ్గా – సీతమ్మ తల్లి చాలా దయార్ద్ర హృదయురాలు కనుక వీరంతా వారి రాజుగారి ఆదేశాలను అమలు చేయక తప్పదు కనుక విధి వారి రాజు చేతుల్లో ఉంది కనుక ఎట్టి పరిస్తుతుల్లోను మహాత్ములైనవారు ఎలాంటి కీడునూ తలపెట్టకూడదన్న వ్రతానికి బద్ధులై ఉంటారు అని హనుమను వారించిందని వాల్మీకి చెప్పినారు.

వధింపదగినవాడు ఎంత పాపము చేసిన శత్రువైనప్పటికీ తనచేతికి చిక్కినప్పటికీ కీడు చేయకుండా తగిన విధంగా మేలు చేసి పొమ్మనడం మంచిదని పెద్దలంటారు.

ఎవరైనా కోపగించుకున్నా తాను కోపగించకుండా కఠినమైన మాటలను పలుకకుండా – వినినా విననట్లు జవాబు ఇవ్వకుండా ఉండేవాడు – అవమానాన్ని పొందినా మనసులో దాచుకోకుండా క్షమాగుణమున్నవాడే ధర్మము తెలిసినవాడు అని భారతములో నన్నయ్య 'క్షమ' కలవారి గురించి చెప్పినాడు.

క్షమే రక్షణ కల్పించే సాధనమని అందరూ గ్రహించాలి.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు వృత్తి వ్యాపారాల్లో గత నెలల కంటే కొంత ఉపశమనం ఉంటుంది. జాగ్రత్తలు పాటించిన వారికి ఇంకా కొంత వెసులుబాటు ఉంటుంది. పిల్లల విషయంలో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. తక్కువ మాట్లాడి ఆనందంగా ఉండండి. అమ్మవారి పూజ చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. శకునం చూసి ఎక్కడికైనా బయటకు వెళ్లాలి. ప్రతి విషయంలో రాజీ పడరాదు. తొందరపాటు లేకుండా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలి. నవగ్రహ జపాలు లేదా నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విధాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లుగా కనిపించినా సమస్యలు తొలగిపోతాయి. ఆర్థికంగా చిక్కులు ఉంటాయి. అవసరానికి డబ్బు వస్తుంది. ఏదైనా అవకాశం వస్తే డబ్బు పెట్టుబడి లేని వ్యాపారం చేయండి. లక్ష్మీదేవికి పూజలు చేయడం మంచిది.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. కానీ, మానసిక ఒత్తిడికి గురి కారాదు. మీరు చాలా విషయాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. సత్యదేవుని వ్రతం, నవ గ్రహ ఆరాధనం, ప్రదక్షిణాలు, దానాల వలన కొన్ని విధాలుగా పురోగతి ఉంటుంది.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు కాస్త మానసిక ఒత్తిడి కలిగి ఉంటారు. ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తగాఉండాలి. గృహ మార్పులు, స్థాన చలనం, బంధువులతో విరోధాలు ఉన్నాయి. నాలుకను అదుపులో పెట్టుకోవాలి. రాజకీయ నాయకులకు పదవీ గండం ఉంది. ఈ విషయం గురించి మీరు తెలుసుకునేలోపు మార్పు జరుగుటకు అవకాశాలు ఉన్నాయి. శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం, చక్రపొంగలి ప్రసాదం పంచండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహ కలయిక సరిగా లేదు. సూర్య ఆరాధనం, సుబ్రమణ్యేశ్వర స్వామి పారాయణం చేయండి. శ్రీసూర్యాయ నమ: అనే పారాయణంతో కొంత శాంతి ఉంటుంది. అవకాశం ఉన్న వారు అభిషేకం చేయించగలరు. నిరంతరం దైవ నామ జపం చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఎవరితోనైనా సామరస్య ధోరణితో ఉండాలి. వినయ విధేయతలతో సాధించ లేనిదంటూ ఏదీ లేదు. నవగ్రహ ఆరాధన తప్పనిసరిగా చేయాలి. ప్రయత్నలోపం తప్ప జరగనిది ఏదీ లేదు. గృహంలో మాట పట్టింపులు లేకుండా చూసుకోగలరు. శరవణభవ మంత్రాన్ని జపించండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. లక్ష్మీ, విఘ్నేశ్వర హోమం చేయించండి. అన్ని విషయాల్లో అనుకూలంగా ఉంటుంది. శనివారం శనికి తైలాభిషేకం చేయండి. వృత్తి వ్యాపారాల్లో ధనాదాయ వనరులు ఉన్నవి. తొందరపాటు నిర్ణయాలు తీసుకునేందుకు ఇది సమయం కాదు. స్నేహితులతో చక్కగా ఉంటారు. కానీ, జాగ్రత్తలు తీసుకోవాలి. శనికి తైలాభిషేకం చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఎన్ని సమస్యలు ఉన్నా గుండె నిబ్బరంగా ఉంటుంది. ఆర్థిక లోటు కనిపిస్తుంది. పిల్లలతో ఆర్గ్యూమెంట్ చేయడం వల్ల కుటుంబంలో చీలిక భావం ఏర్పడుతుంది. మాటకు మాట వల్ల అనేక విధాలుగా సమస్యలు కొని తెచ్చుకుంటారు. జాగ్రత్తగా ఉండటం మంచిది.

## మకరరాశి

**ఉత్తరాషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ప్రయాణాలు ఉన్నాయి. వాయిదా వేయుట మంచిది. ఖర్చుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఖర్చులు ఆపడం చాలా కష్టం కానీ, ఏ విధంగా చేస్తే ఖర్చులు తగ్గుతాయో ఆలోచన చేయాలి. దక్షిణామూర్తికి, దుర్గాదేవికి పూజలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాబాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నిర్లక్ష్యం పనికిరాదు. మొహమాటం కొద్ది ఎట్టి పరిస్థితుల్లో సాక్షి సంతకం చేయొద్దు. జాయింట్ వ్యవహారాల్లో అన్యోన్యంగా ఉండండి. అకస్మికంగా కలహాలు రావొచ్చు. తక్కువగా మాట్లాడండి. మీ ఓర్పే మీకు రక్ష. శ్రీసత్యదేవుని వ్రతం చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో వ్యతిరేక భావాలు ఉన్నవి. అలా అని భయపడాల్సిన పనిలేదు. మీరు ఏకాగ్రతతో కార్యం పట్ల ఉన్న అవరోధాలు చాకచక్యంగా తొలగించుకునే సమర్థులు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గృహ శాంతి కోరకు నిత్యదీపారాధన అనంతమైన శక్తిని ఇస్తుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. తొలి ఏకాదశికి మరో పేరు?
2. 'హరినామ క్షేత్రం' ఎక్కడ నిర్మిస్తున్నారు?
3. భృగుడనే మహర్షికి బోధించిన సర్పరాజు ఎవరు?
4. పుణ్యలోకప్రాప్తికి ఏ దానం ప్రధానమైనది?
5. మయధర్మరాజుని దర్శించి తిరిగి వచ్చిందెవరు?
6. సీతను రక్షించబోయి మరణించిందెవరు?
7. రావణుడు అన్న ఎవరు?
8. ప్రజాపతి దేవతలకు, రాక్షసులకు, మానవులకు ఏమి ఉపదేశించాడు?
9. గురు పూర్ణిమ ఉత్సవాన్ని ప్రారంభించింది ఎవరని ప్రతీతి?
10. విష్వక్సేనుడి తల్లి ఎవరు?
11. క్షేత్రయ్య అసలు పేరేమిటి?
12. శ్రీ వేంకటేశ్వరుని అక్కలు ఎవరు?
13. ప్రహ్లాదుని మనుమడు ఎవరు?
14. జడమహర్షి ఎవరి కొడుకు?
15. కృష్ణశర్మ మరుజన్మలో ఎవరు?

1. ____________
2. ____________
3. ____________
4. ____________
5. ____________
6. ____________
7. ____________
8. ____________
9. ____________
10. ____________
11. ____________
12. ____________
13. ____________
14. ____________
15. ____________

పేరు: ____________
చిరునామా: ____________
____________
____________
____________
పిన్‌కోడ్: ____________
ఫోన్: ____________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. తాలజంఘుని; 2. శాపం పొందిన ఇంద్రుడు; 3. వ్యాసరాయలు; 4. నాలుగు; 5. సురేఖ, 6. రాజవోలు మండపం; 7. ముగ్గుబావి వద్ద; 8. లవణ సముద్రంలో; 9. పద్ముడు; 10. శయన ఏకాదశి / తొలి ఏకాదశి, 11. సీతాదేవి; 12. కలియుగం రాగానే; 13. ఏకాదశీ దేవి; 14. సమస్త లోకాలకు అధిపతి; 15. భగవంతుని వైపుకి తీసుకువెళుతుంది.

## సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి, 2. పి. యశోద, 3. సూరి సౌభాగ్యలక్ష్మి, 4. సువర్చల, 5. రాజశేఖర్‌రెడ్డి

లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**రాజశేఖర్ రెడ్డి**



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122




If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq

